www.andhrajyothy.com
వెల (Price) : Rs. 8.00 విజయవాడ సిటీ*

# ఆంధ్రజ్యోతి

పేజీలు: 12 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 330

ఆదివారం 15-3-2020

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి రా. 3.20 తదుపరి అష్టమి; నక్షత్రం: అనూరాధ ఉ. 11.24 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: సా. 4.57-6.32; దుర్ముహూర్తం: సా. 4.47-5.34; అమృత ఘడియలు: రా. 2.29-4.04; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.27; సూర్యాస్తమయం: 6.22

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore



నెల్లూరులో మూసివేసిన మల్టీప్లెక్స్ థియేటర్



విజయవాడ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే బస్సులో సోడియం హైపో క్లోరైడ్ స్ప్రే చేస్తున్న సిబ్బంది

ఏదైనా దేశానికి వెళ్లి ఫిబ్రవరి 10వ తేదీ తర్వాత వచ్చారా? అయితే, ఇంటి నుంచి బయటికి కదలొద్దు! ఏదో ఒక 'స్లాట్ దర్శనం' లేకుండా తిరుమలకు వెళుతున్నారా? అయితే, మీకు దర్శనం దొరకదు! ఇది 'కరోనా' కాలం! ముందు జాగ్రత్తలు తీసుకోక తప్పదు! ప్రపంచాన్ని కుదిపేస్తున్న కరోనా వైరస్‌పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తెలంగాణ సర్కారు ఈ మహమ్మారిపై ఏకంగా యుద్ధమే ప్రకటించింది. ఈనెలాఖరు వరకు విద్యా సంస్థలు, సినిమా హాళ్లు బంద్ చేసింది! శుభకార్యాలకు పరిమిత సంఖ్యలోనే అతిథులను పిలుచుకోవాలంది. పబ్బులు, క్లబ్బులు మూసేసింది. కరోనాతో మృతి చెందిన వారి కుటుంబాలకు కేంద్రం 4 లక్షల పరిహారం ప్రకటించింది.

# ఇల్లు కదలొద్దు!

## 6,644 మందికి 14 రోజులు 'క్వారంటైన్'

### విదేశాల నుంచి వచ్చిన వారిపై రాష్ట్ర ప్రభుత్వ ఆంక్షలు

- దాదాపు కోటి ఇళ్లలో సర్వే పూర్తి
- నేడు మరో 40 లక్షల గృహాల్లో నిర్వహణ
- డీఎంహెచ్‌వోలకు 'ఎన్‌ఫోర్స్' అధికారాలు
- ఆస్పత్రుల్లో 21 మంది అనుమానితులు
- నివేదికల కోసం ఆరోగ్యశాఖ ఎదురుచూపు
- నన్నయ వర్సిటీ విద్యార్థులకు సెలవులు
- ఆర్టీసీ బస్సులు, కౌంటర్లలో మందు స్ప్రే
- కడపలో మహిళకు నెగిటివ్

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కరోనాపై అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే 'మినీ హెల్త్ ఎమర్జెన్సీ' ప్రకటించిన సర్కారు... ఫిబ్రవరి 10వ తేదీ తర్వాత వివిధ దేశాల నుంచి వచ్చిన వారికి 'క్వారంటైన్' విధించింది. ఇప్పటిదాకా 6,644 మందిని గుర్తించి... 14రోజుల పాటు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 10తర్వాత విదేశాల నుంచి వచ్చినవారి వివరాలను మూడురోజుల నుంచి సేకరిస్తున్నారు. ఇప్పటి వరకూ కోటి ఇళ్లలో సర్వే నిర్వహించి 6,644 మంది వచ్చినట్లు తేల్చారు. వీరిలో 149 మందిని అనుమానితులుగా గుర్తించారు. మరో 40లక్షల ఇళ్ల సర్వే ఆదివారం పూర్తికానుంది. దీంతో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఆశా వర్కర్లను ఎప్పటికప్పుడు వారి ఇళ్లకు పంపించి ఆరోగ్య పరిస్థితిని

మిగతా 8వ పేజీలో...

## కరోనా విశ్వరూపం

- 149 దేశాల్లో ఉగ్రతాండవం
- లక్షన్నర కేసులు- 5,500 మరణాలు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కూ టెస్టులు
- కెనడా పార్లమెంట్ మూసివేత
- అమెరికా వీసా అపాయింట్‌మెంట్లు రద్దు
- మృతులకు 4 లక్షల ఎక్స్‌గ్రేషియా: కేంద్రం

8

## భారత్ @ 84

- పెరుగుతున్న కరోనా కేసులు
- మహమ్మారికి దేశంలో మరో మృతి?
- పలు రాష్ట్రాల్లో విద్యా సంస్థలకు సెలవు
- థియేటర్లు, మాల్స్ మూసివేత

7



## భక్తులందరికీ స్లాటెడ్ టోకెన్లే

- అది తీసుకోనివారికి దర్శనం ఉండదు
- కంపార్టుమెంట్లలో నిరీక్షణకు స్వస్తి
- 'కరోనా' నేపథ్యంలో టీటీడీ నిర్ణయం

8



ఈ ఫొటోలో ఉన్న మహిళ మల్లేశ్వరి. గుంటూరు జిల్లాలో టీడీపీ తరపున ఎంపీటీసీగా నామినేషన్ వేశారు. ఎలాంటి కేసులు, నేర నేపథ్యమూ లేకున్నా... 'బైండోవర్' అంటూ పోలీసులు ఠాణాకు తీసుకెళ్లబోయారు.

# ఉపసంహారణం

## ప్రలోభాలు, బెదిరింపులు, ఒత్తిళ్లు

### పెండింగ్ బిల్లులతో బ్లాక్ మెయిల్.. ప్రత్యర్థులపై వైసీపీ దండోపాయం





అటూ ఇటూ ఉన్న వారు చెరో రెక్క పట్టుకోగా... నిస్సహాయంగా ఉన్న ఇతని పేరు బాలు నాయక్. గుంటూరు జిల్లా మాచర్ల జడ్పీటీసీ స్థానానికి జనసేన అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆయన కోసం పాతిక మంది పోలీసులు, వైసీపీ కార్యకర్తలు నాలుగు రోజులు గాలించారు. ఎట్టకేలకు శనివారం గుంటూరుకు పట్టుకొచ్చి.. బెదిరించి, బంధువులతో ఒత్తిడి చేయించి నామినేషన్ ఉపసంహరణ పత్రాలపై సంతకాలు చేయించారు. ఇదంతా రిటర్నింగ్ అధికారి సమక్షంలో, ఎమ్మెల్యే పీఏ పర్యవేక్షణలోనే జరిగింది.

- భారీగా నామినేషన్ల ఉపసంహరణ
- టైం ముగిసినా అధికారుల సహకారం
- పశ్చిమలో ఫోర్జరీ చేసిన పత్రాలూ ఓకే
- బీ-ఫారాలు గల్లంతు పేరిట నాటకం
- కర్నూలులో వైసీపీ జడ్పీ చైర్మన్ అభ్యర్థి కుమారుడి 'స్వీయ పర్యవేక్షణ'
- తుది జాబితా ప్రకటన తర్వాత మొదలైన ఉపసంహరణల పర్వం
- కడప జిల్లాలో 'ఏక'పక్షమే!

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

స్థానిక ఎన్నికల్లో ప్రత్యర్థులపై సామ దానోపాయాలు ముగిశాయి. వాటికి లొంగని వారిపై... 'దండోపాయం' మొదలైంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజైన శనివారం బెదిరింపుల పర్వం తారాస్థాయికి చేరింది. ఈ ఒత్తిళ్లు తట్టుకోలేక అనేకచోట్ల విపక్షాల అభ్యర్థులు బరి నుంచి వైదొలిగారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు శనివారం 3 గంటలకు ముగిసినప్పటికీ... అధికారపార్టీ నేతల అభీష్టం మేరకు సాయంత్రం 5 వరకూ అందుకు అవకాశం కల్పించారు. గుంటూరు జిల్లా వినుకొండ నియోజకవర్గంలో టీడీపీ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్న నాలుగు ఎంపీటీసీ స్థానాల నుంచి టీడీపీ అభ్యర్థులను బరిలో నుంచి తప్పించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఉపాధి హామీ పనులకు

మిగతా 10వ పేజీలో...

## 'అధికారిక' దాడులు!

- రంగంలోకి పోలీస్, అటవీ, ఎక్సైజ్.. అభ్యర్థికి 'బైండోవర్' బెదిరింపు
- ఠాణాకు రావాలంటూ ఒత్తిడి.. ఎమ్మెల్యే అనగాని రాకతో వెనక్కి
- మరో అభ్యర్థిపై మద్యం కేసు.. ఇంకొకరి సామిల్‌లో సోదాలు.. టీడీపీనే టార్గెట్

11

# ఖాకీ టెర్రరిజం!

- టీడీపీ నేతల్ని పోలీస్‌స్టేషన్లో పెట్టి ఎలా కొడతారు?
- ఉపసంహరణ కోసం మా అభ్యర్థులను బెదిరిస్తారా?
- పోలీస్ యూనిఫాం వదిలి వైసీపీ కండువా కప్పుకోండి
- ఓ వ్యక్తికి ఊడిగం కాదు...శాంతి భద్రతలు కాపాడాలి
- ఏ డీజీపీ అయినా కోర్టులో నిలబడి సెక్షన్లు చదివారా?
- మాచర్ల వెళ్లవద్దనడానికి పోలీస్ అధికారులు ఎవరు?
- పోలీసుల తీరుపై విపక్ష నేత చంద్రబాబు మండిపాటు



అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో ఖాకీ టెర్రరిజం నడుస్తోందని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహించారు. పోలీస్ వ్యవస్థ బరి తెగించి అధికార పార్టీకి ఊడిగం చేస్తోందని, తమ నేతలను బెదిరించి కొట్టి భయపెట్టి ఎన్నికల రంగం నుంచి తప్పించడానికి శాయశక్తులా పని చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. తమ పార్టీ నేతలు వర్ల రామయ్య, దీపక్ రెడ్డితో కలిసి శనివారం సాయంత్రం ఆయన మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని బల్లి కురవ మండలంలోని ఒక గ్రామానికి చెందిన టీడీపీ నాయకులను పోలీసులు తీసుకువచ్చి కొట్టిన తర్వాత వారు ఏడుస్తున్న దృశ్యానికి సంబంధించిన వీడియోను

మిగతా 10వ పేజీలో...

## ఇదొక క్రిమినల్ సర్కారు!



- నేరగాళ్లకే పోలీసుల మద్దతు.. దాడి చేసినా బెదరం
- కేసులకు వెరవం.. యువత నుంచే నాయకత్వం
- క్రిమినల్సా.. మార్పా?.. తేల్చుకోవాల్సింది ప్రజలే
- పార్టీని చంపను..మహా వృక్షమవుతుంది: పవన్

2

## స్థానిక పోరు ఆపాల్సిందే



- కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరపాలి
- ప్రత్యర్థులపై దాడులు.. చరిత్రలో చూడని హింస
- ఈసీ, పోలీసు వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యం: కన్నా

11





## ఆ సంచులు గడప వరకే!

- బియ్యం కార్డుదారుల బ్యాగుల్లోనే పోయాలి
- ప్రభుత్వ సంచులు వెంటనే తెచ్చి డీలర్లకివ్వాలి
- వలంటీర్లకు పౌర సరఫరాల శాఖ ఆదేశాలు
- పర్యావరణానికి ఇబ్బందంటూ కొత్త మెలిక
- శ్రీకాకుళంలో ఇచ్చినవి సేకరించాలని సూచన
- వీటికోసం ఏటా దాదాపు 700 కోట్ల భారం



3

## కొత్త పలుకు

### సిగ్గు పడాలి!

...బిహార్ వంటి వెనుకబడిన రాష్ట్రంలో ఇప్పుడు పరిస్థితులు మెరుగుపడుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచక పాలన సాగుతోంది. చట్టాలకు, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన అఖిల భారత సర్వీసు ఉన్నతాధికారులు కూడా ఈ పాపంలో పాలుపంచుకోవడం విషాదం!

...అధికార పార్టీకి చెందినవారు అరాచకంగా ప్రవర్తిస్తున్న దృశ్యాలను న్యూస్ చానెళ్లు కళ్లకు కట్టినట్టుగా చూపిస్తున్నా రమేశ్‌కుమార్ కళ్లు మూసుకుని కూర్చుంటున్నారు.

...తాడిపత్రిలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా స్థానిక ఎమ్మెల్యే దుస్తులు పంపిణీ చేసినా క్రిమినల్ కేసు పెట్టకుండా ఆయనను ఒక రోజు ప్రచారానికి దూరంగా పెడుతున్నామని ప్రకటించడానికి ఎన్నికల కమిషన్ సిగ్గుపడటం లేదా?

...పంచాయతీ భవనాలకు వేయించిన వైసీపీ రంగులను పది రోజుల్లో తొలగించాలని హైకోర్టు ఆదేశించినా.. ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఏమిటి?

...ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులను కౌన్సెలింగ్ పేరిట ఒంగోలుకు తీసుకెళ్లిన పోలీసులు చితకబాది పంపడంపై చర్యలు తీసుకున్నారా?

...మాచర్లలో తెలుగుదేశం నాయకులపై పోలీసుల సాక్షిగా దుడ్డుకర్రతో దాడి చేసిన తురకా కిశోర్‌కు స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలివేయడం ఏమిటని పోలీసులను సంజాయిషీ ఎందుకు కోరలేకపోతున్నారు?

..ప్రజాస్వామ్యాన్ని బాహాటంగా చెరబడుతున్న వారిపై అధికారాలు ఉండీ చర్యలు తీసుకోని వ్యవస్థలు ఉన్నా ఒక్కటే, లేకున్నా ఒక్కటే!

-ఆర్కే విశ్లేషణ 4వ పేజీలో..



## వివేకా హత్యకు ఏడాది!

### 3 సిట్‌లతోనూ వీడని మిస్టరీ

- విపక్షంలో ఉండగా సీబీఐకి అప్పగించాలన్న జగన్
- ముఖ్యమంత్రి అయ్యాక మారిన వైఖరి
- దర్యాప్తు తీరుపై కుటుంబ సభ్యుల అనుమానం
- సీబీఐకి అప్పగించిన హైకోర్టు

(కడప- ఆంధ్రజ్యోతి)

సరిగ్గా ఏడాది కిందట! అప్పుడప్పుడే సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వెలువడింది. రాష్ట్రమంతా ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఈ రాజకీయాగ్నికి మరింత ఆజ్యం పోస్తూ, రాష్ట్రాన్ని కుదిపివేసే సంఘటన... కడప జిల్లా పులివెందులలో జరిగింది! అది... వైఎస్ వివేకానంద రెడ్డి దారుణ హత్య! ఈ దారుణం జరిగి ఆదివారానికి సరిగ్గా ఏడాది! 2019 మార్చి 15న

మిగతా 2వ పేజీలో...

## పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ రూ.3 పెంపు

- ప్రభుత్వానికి 39 వేల కోట్లు పెరగనున్న ఆదాయం
- అంతర్జాతీయంగా తగ్గిన ముడి చమురు ధరలు
- అయినా వినియోగదారులకు దక్కని ప్రయోజనం
- చమురుకు తగ్గట్లుగా ధరలు తగ్గించాలి: కాంగ్రెస్

7



## మొబైల్స్‌పై జీఎస్‌టీ మోత

- పన్ను 12% -18 శాతానికి పెంపు
- పెద్ద దెబ్బేనంటున్న పరిశ్రమ వర్గాలు
- విమానాల ఎంఆర్‌ఓ సేవలిక చౌక
- అగ్గి పెట్టెలకు ఒకే పన్ను రేటు
- జీఎస్‌టీ నెట్‌వర్క్ బలోపేతం



పరంజ్యోతి

# అజ్ఞానం వంటి పగ లేదు



ఆంధ్ర మహాభారతం.. శాంతి పర్వంలో ధర్మరాజుకు భీష్మ పితామహుడు పలు ఉపాఖ్యానాల ద్వారా జ్ఞానబోధ చేశాడు. వారి సంభాషణలో జనక-పరాశర సంవాదం ఒకటి. ఈ సందర్భంలో మహాకవి తిక్కన ఓ చక్కని పద్యాన్ని రచించాడు.

*"కం॥ మానవునకు దలపగన*
*జ్ఞానమునట్టి పగలే దసంగతకృత్యా*
*ధీనుండై రూపు సెడును*

దానంగావున సుదాత్త ధర్మ విధజ్ఞా॥" అంటూ భీష్ముడు ధర్మరాజుతో నిజమైన పగ అంటే ఏమిటో చెబుతూ.. పరాశరుడు జనకునకు ఏది హింస - ఏది అహింస అనే దానిలోని సూక్ష్మాంశములను తెలియజేసిన తీరును వివరించాడు. మానవులు అజ్ఞానంతో పొందిక లేని పనులకు అధీనులై.. నశిస్తూ ఉంటారు. మనుజునకు అజ్ఞానం వంటి శత్రువు లేదు. దీనిని వివరిస్తూ, ముందుగా 'జ్ఞానం' అంటే ఏమిటో తెలుసుకోవాలి. స్వస్వరూప జ్ఞానమే నిజమైన జ్ఞానం. తన స్వరూపాన్ని స్పష్టంగా తెలుసుకోవడం. దీన్నే తత్త్వం అంటారు. ఈ తత్త్వాన్ని మాయ చేసేది, కనుమరుగు గావించేదీ 'అజ్ఞానం'. తాను అనగా దేహం. ఇంద్రియాలు అనే భావన అజ్ఞానం. తాను ఆత్మ అనే దానిని తెలియకుండా అడ్డుపడేది అజ్ఞానం. జ్ఞానం అనాది - అనంతం. సర్వకాల సర్వావస్థలలో ఉండటమే దీని లక్షణం. అజ్ఞానం అనాదియే గాని.. మొదలు లేకుండా.. అంతం ఉన్నది. జ్ఞానం కలిగిన వెంటనే అజ్ఞానం మాయమౌతుంది. ఇక పగ విషయానికివస్తే.. ఇది మానవుడిని నాశనం చేయడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తుంది. ధన రూపేణా, వనితల రూపేణా, భూమి కోసమో పగ ఏర్పడుతుంది. పగ శత్రుత్వానికి దారితీస్తుంది. కానీ ఈ అజ్ఞానం అనే పగ మాత్రం ఏ కారణం వల్ల కలుగుతుందో చెప్పలేం. అకారణంగా కలిగేది పగ. ఈ అజ్ఞానం తక్కిన పగలను తలదన్ని పోయేది. తగిన కారణం తెలిస్తే దాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తాం. కానీ, తెలియకపోతే ఏమీ చేయలేం. ఈ పగ వల్ల మానవుడు అసంగత కృత్యాలకు - ఏ విధమైన పొందికలు లేని పనులకు వశమైపోతాడు. పొందికనే యోగం అంటారు. తనను పరమాత్మలో కలుపుకోవడమే యోగం. అదే మానవ జన్మకు పరమార్థం. అది లేనిది, దానికి వ్యతిరేకం అయినదే అసంగతం. ఈ అకృత్యాలను తొలగించాలంటే చాలా గొప్ప సాధన అవసరం. గురువు అనుగ్రహంతో, దైవ కృపతో తప్ప ఆ సాధన సాధ్యం కాదు.

మహాభారతంలోనే ఉద్యోగపర్వంలో ఒక పద్యంలో "పగఅడగించుటింతయు శుభంబగు" అన్నారు తిక్కనామాత్యులు. ఈ పగను అణచడం వల్ల జ్ఞాన సిద్ధి కలుగుతుంది. దీనినే ముక్తి/మోక్షం అని అంటారు. అందుకే.. మానవులు నిరంతరం ప్రయత్నాలు చేయాలని పరాశరుల వారు ఉపదేశించినారని, భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు. సకల మానవులూ ఈ సందేశాన్ని అనుసరించి తమ అజ్ఞానాన్ని వదలి, పగను రూపుమాపి సత్య మార్గంలో పయనించి తరించాలి.

పి.వి.సీతారామమూర్తి, వంకాయలపాడు
సెల్: 9490386015

# లోకం తీరు




## ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 35.9 | 21.7 |
| అనంతపురం | 36.5 | 23.2 |
| గుంటూరు | 35.4 | 24.4 |
| నెల్లూరు | 34.1 | 24.7 |
| ప్రకాశం | 33.3 | 24.1 |
| శ్రీకాకుళం | 33.0 | 26.0 |
| తూర్పుగోదావరి | 32.0 | 19.0 |

## శ్రీవారి దర్శనానికి 7గంటలు

తిరుమలలో శనివారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దాదాపు 75వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి దాదాపు 7గంటలు పడుతోంది. సోమవారం ఆర్జితసేవలకు సంబంధించి బ్యాంక్ఆఫ్ బరోడా కౌంటర్‌లో ఆదివారం లక్కీడిప్‌లో జారీచేసే టికెట్లు సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80 అందుబాటులో ఉన్నాయి.



## మాంసాహారుల వల్లే కరోనా వైరస్ వచ్చింది

జంతువులను చంపి తినడం వల్ల కరోనా వైరస్ వచ్చింది. ఏదైనా జంతువును చంపినప్పుడు ఓ శక్తి ఉద్భవించి ఆ పరిసరాలను నాశనం చేస్తుంది. కరోనా వైరస్ ప్రపంచవ్యాప్తంగా ప్రబలిపోవడానికి కారణం ఇదే. మాంసాహారులను శిక్షించడానికి ఎత్తిన అవతారమే కరోనా వైరస్. గోమూత్రం తాగితే వైరస్ సోకదు.

*- స్వామి చక్రపాణి, హిందూ మహాసభ అధ్యక్షుడు (ఢిల్లీలో జరిగిన గోమూత్ర పార్టీలో..)*



## కరోనాపై యోగాస్త్రం

కరోనా వైరస్‌కు భయపడాల్సిన అవసరం లేదు. అస్తమా, గుండె జబ్బులు, మధుమేహం వంటి జీవన శైలి వ్యాధులు ఉన్నవారే అధికంగా ఈ వైరస్ బారిన పడుతున్నారు. అందువల్ల వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి యోగాను, సహజ జీవన శైలిని పాటిస్తే చాలు.

*- బాబా రాందేవ్, యోగా గురు*



## కీటో డైట్‌తో 'కీటో-ఫ్లూ'!!

టాస్మానియా, మార్చి 14 : అధిక బరువు, ఊబకాయం సమస్యలను అధిగమించేందుకు చాలామంది కీటో డైట్‌ను అనుసరిస్తుంటారు. దీంతో కొందరిలో ఆరోగ్యపరమైన సత్ఫలితాలు రాకపోగా.. ఫ్లూ జ్వరం తరహా సమస్యలు తలెత్తుతున్నాయని ఆస్ట్రేలియాలోని టాస్మానియా వర్సిటీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. కీటో డైట్ తీసుకునేవారిలో పలువురు మొదటి వారంలోనే మైకం, వికారం, ఆయాసాలతో సతమతమవుతున్నారని తెలిపారు. ఆరోగ్యంపై పడుతున్న ఈ ప్రభావానికి 'కీటో-ఫ్లూ'గా పేరు పెట్టారు. అధిక ప్రొటీన్లు, తక్కువ కొవ్వు, అతి తక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్న ప్రత్యేక ఆహార ప్రణాళికనే కీటో డైట్ అంటారు.



## 'లో బీపీ'తో వృద్ధులకు ప్రాణగండం

లండన్, మార్చి 14 : అధిక రక్తపోటు(హై బీపీ) ఉన్న ముసలివారితో పోల్చితే.. అల్ప రక్తపోటు(లో బీపీ) ఉన్న వృద్ధులు త్వరగా మరణించే అవకాశాలు ఉంటాయని బ్రిటన్‌లోని ఎక్సెటర్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. 75 ఏళ్లకు పైబడిన 4.15 లక్షల మంది వృద్ధుల ఆరోగ్య నివేదికల విశ్లేషణ అనంతరం ఈవిషయాన్ని వెల్లడించారు. లో బీపీతో బాధపడిన పలువురు వృద్ధులు పదేళ్లలోనే(85 ఏళ్ల వయసుకు చేరేలోపే) ఆరోగ్య సమస్యలతో తనువు చాలించారని అధ్యయనంలో గుర్తించారు. హై బీపీ కలిగినవారు గుండెపోటు వంటి హృద్రోగ సమస్యలతో సతమతమవడం మినహా అంత త్వరగా మరణించిన దాఖలాలు కనిపించలేదని పేర్కొన్నారు.



ఇద్దరు పిల్లలతో శేషగిరిరావు, పావని దంపతులు(ఫైల్)

# మా అమ్మను బతికించరూ!

- గుండెవ్యాధితో చావుబతుకుల్లో మహిళ
- తల్లడిల్లుతున్న పిల్లలు, భర్త
- దాతల సాయం కోసం ఎదురుచూపు



అనారోగ్యంతో మంచంపట్టిన పావని

విశాఖపట్నం, మార్చి 14: రోజూ బాక్సులో అన్నం పెట్టి స్కూలుకు పంపించే అమ్మ.. దాదాపు నెలరోజుల నుంచి తన చేత్తో ఒక్క ముద్ద కూడా పెట్టడంలేదు. అమ్మకు ఏం జరిగిందో తెలీక బేలచూపులు చూడటమే ఆ చిన్నారుల వంతవుతోంది!. విశాఖపట్నానికి చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్ కుటుంబంలోని పరిస్థితి ఇది. బెహరా శేషగిరిరావు భార్య పావని(34) కొన్నాళ్లుగా అరుదైన గుండె జబ్బుతో బాధపడుతోంది. ఈ దంపతులకు భార్గవ్(8)తోపాటు మూడేళ్ల మరో బాబు ఉన్నాడు. పావనికి 1997లో పుట్టపర్తి సత్యసాయిబాబా ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించారు. గత నెలలో తిరిగి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి మంచం పట్టింది. ఆమెను హైదరాబాద్‌లోని కేర్, కిమ్స్ ఆస్పత్రుల్లో చూపించగా.. వైద్యులు పరీక్షించి గుండె నుంచి ఊపిరితిత్తులకు రక్తప్రసరణ జరిగే నాళం ఒకటి పాడయ్యిందని, దాన్ని మార్చాల్సి (పల్మనరీ వాల్వ్ గోడ)న అవసరం ఉందని తెలిపారు. ఇందుకు సుమారుగా రూ.20 లక్షల ఖర్చవుతుందని చెప్పారు. ఆపరేషన్ కూడా 20 రోజుల్లోనే జరగాలని, లేదంటే ఆమె పరిస్థితి చెప్పలేమని తెలిపారు. తను పని చేస్తున్న కంపెనీ నుంచి రూ.5 లక్షల వరకు బీమా అందుతుందని... మిగిలిన ఖర్చు భరించే పరిస్థితి తనకు లేదని శేషగిరి రావు తెలిపారు. తన భార్యను బతికించుకునేందుకు మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఇతర వివరాలకు ఆయన ఫోన్ నెంబరు 7659986667ను సంప్రదించవచ్చు.

# ఇదొక క్రిమినల్ సర్కారు!

- నేరగాళ్లకే పోలీసుల మద్దతు
- ధైర్యం నశిస్తే స్వార్థమే విజేత
- పార్టీని చంపను..మహా వృక్షం అవుతుంది..పార్టీ ఆవిర్భావ సభలో పవన్

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): క్రిమినల్స్ పాలన కావాలో, సమాజ హితం కోరి మార్పు కోసం పోరాడేవాళ్ల కావాలో తేల్చుకోవాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోరారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన జనసేన ఏడో ఆవిర్భావ దినోత్సవ సభలోనూ, అనంతరం గోదావరికి హారతి ఇచ్చినప్పుడూ పవన్ కల్యాణ్ మాట్లాడారు. "ఏడేళ్లు నిలిచాను.. మరో 70 ఏళ్లు జనసేన నిలబడుతుంది. పార్టీని చంపను. అది మహా వృక్షమవుతుంది. నా తర్వాత కూడా పార్టీ ఉండాలనేదే నా తపన" అని వ్యాఖ్యానించారు. ఇదొక క్రిమినల్ ప్రభుత్వం అని, దాడులు చేస్తే బెదిరిపోమని, కేసులు పెడితే భయపడి పారిపోబోమని పవన్ స్పష్టం చేశారు. యువత నుంచే నాయతక్వం రావాలని ఆకాంక్షించారు. "ఎక్కడైతే ధైర్యం నశిస్తుందో అక్కడ పుణ్యం నశిస్తోంది... అక్కడ స్వార్థం గెలుస్తుంద'ంటూ భారత్-చైనా యుద్ధ సమయంలో ఓ కవి రాసిన కవితను ఉటంకించారు. క్రిమినల్సే ఎలా లంటే వైసీపీలోకి వెళ్లిపోవాలని, సమాజంలో మార్పు కోసం ధైర్యంగా నిలబడేవాళ్లే జనసేనలోకి రండని పిలుపునిచ్చారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..



ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద గోదావరికి హారతి ఇస్తున్న పవన్

### మనకు పద్మావతులు కావాలి..

"నేను యువతనే నమ్మాను. జేజేలు కొట్టే వాళ్ళను కాదు. నిలబడి పోరాడేవాళ్లు కావాలి. లక్షమందిలో నలుగురే నిలబడతారు. కాని ఆ నలుగురే లక్షమంది మెదళ్లను కదలిస్తారు. అనంతపురంలో ఎంత భయపెట్టినా మొండిగా ఎంపీటీసీగా పోటీ చేస్తున్న పద్మావతి వంటివారు కావాలి. కాకినాడలో దౌర్జన్యాలను ఎదిరించిన ఆడపడుచులవంటి వారు కావాలి. జనసంఘ్ జనతా పార్టీతో కలిసిపోయి పోటీచేస్తే రెండు సీట్లు వచ్చాయి. కాని తర్వాత అప్రతిహత పార్టీగా నిలబడింది. బీజేపీతో పొత్తు సమయంలో జనసేనను విలీనం చేయమని హోంమంత్రి అమిత్‌షా అడిగారు. నేను నా స్టాండ్ తగ్గలేదు. పార్టీని చంపను. మహా వృక్షమై తీరుతుంది"

### కోర్టు అడిగినా చలనమే లేదు..

"స్థానిక ఎన్నికలలో రూల్స్ పాటించడం లేదు. నేరాలు చేసేవారికి పోలీసులు కూడా అండగా నిలుస్తున్నారు. కోర్టు ప్రశ్నించినా స్పందించడం లేదు. ఈ పరిస్థితిని మనమే సరిచేయాలి. ఒక్కరు కదిలినా చాలు ప్రభుత్వం కదులుతుంది. జనసేనది సుఖమయ పయనం కాదు. మన టికెట్లతో నిలబడి, ఆఖరికి పారిపోయేవాళ్లను ఏమనాలి? రాజకీయాలు సర్వీసు స్థాయికి రావాలి"

### 'యోగి ఆత్మకథ' చదివి..

"నేను నా స్థాయిని పరిమితం చేసుకుని ఉంటే ఇంత మంది గుండెల్లో అభిమానం సంపాదించుకుని ఉండేవాణ్ణి కాదు. సినిమా తీసే సమయంలో ఈ అబ్బాయిది రూ.70లక్షలు కంటే ఎక్కువ స్థాయి కాదు అన్నారు.. కానీ నేను పట్టించుకోలేదు. 'ఒక యోగి ఆత్మకథ' చదివినప్పుడు ఒక విషయం అర్థం అయింది. ఇల్లు ఊడ్చేవాడు మనస్సు పెట్టి ఆపని చేస్తే అది సంపూర్ణం. నటుడిగా నా పని సంపూర్ణంగా చేశాను"

### పోయిన ధైర్యం నింపడానికే..

"2014లో జనసేనను ప్రతికూల పరిస్థితుల్లో స్థాపించాను. తండ్రో, బంధువులో సీఎంగా ఉన్న పరిస్థితికాదు నాది. పార్టీ పెట్టేటప్పుడు కొంతమంది వచ్చారు. కులం, వర్గం గురించి చెప్పారు. ఓ కులానికి మరో వర్గం తోడైతే విజయం మనదే అన్నారు. కానీ వాళ్ల అరిస్తే పారిపోయే రకం. మన నేతల్లో ధైర్యం కొరవడింది. రూ.వేలకోట్లు ఉన్నాయి. వేల ఎకరాల భూమి ఉంది. కాని ధైర్యం చచ్చిపోతోంది. తిరిగి ఆ ధైర్యం పోయడానికివచ్చాను. ఢిల్లీలో కాళ్లపట్టుకుని, ఆంధ్రాలో మాత్రం వైసీపీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది" అని పవన్ కల్యాణ్ విమర్శించారు. అనంతరం ధవళేశ్వరం రామపాదాల రేవులో గోదావరికి ఆయన హారతి ఇచ్చారు. అక్కడినుంచే 'మన నది - మన నుడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

### పవన్ దెబ్బకు జగన్ బండ పగులుతుంది: నాగబాబు

నియంత హిట్లరే పతనమయ్యాడని, ఇక జగన్ ఎంతని నటుడు, జనసేన నాయకుడు నాగబాబు ప్రశ్నించారు. "బండరాయి ఓ దెబ్బకు బద్దలు కాకపోవచ్చు. రెండో దెబ్బకు పగలక పోవచ్చు. 99 దెబ్బలకీ...బద్దలు కాక పోవచ్చు. పవన్ 100వ దెబ్బకు జగన్ బండ పగులుతుంద"ని వ్యాఖ్యానించారు.

**పవన్ చెప్పిన స్వామి కథ..**

ఓ స్వామి యువతను చైతన్యం చేయడానికి ఊరూరా తిరుగుతున్నాడు. ఓఊరిలో చెరువు గట్టు మీద యువకులు కనిపించారు. అయినా అక్కడ ఆగకుండా స్వామి ముందుకెళ్లడం.. ఆయన అనుచరులను ఆశ్చర్యపరిచింది అది గమనించిన స్వామి వారికి తన అంతరంగం వివరించారు. 'ఆ చెరువును చూడండి. ఎంత పాచిపట్టి ఉందో! కనీసం చెరువు నీటినీ శుభ్రం చేసుకోలేని ఈ బద్ధకస్తులైన యువకుల వల్ల ఉపయోగం లేదు" అని సెలవిచ్చారు.



కార్యశాలకు హాజరైన రచయితలు బండి నారాయణస్వామి, దీర్ఘాసి విజయభాస్కర్, శివనాగిరెడ్డి,తదితరులు

## చరిత్రను భవిష్యత్తరాలకు
# అందించాలి

- 'కాలయంత్రం' లక్ష్యమదే: సాయి పాపినేని

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రరాష్ట్రంలో మనదైన చరిత్ర, సంస్కృతిపట్ల అవగాహన, ప్రేమ ఉండాల్సినంత లేదు. దానిని పెంపొందించి భవిష్యత్ తరాలకు అందించాలి. నవల, కథా రచనను ఆంధ్ర రాష్ట్రంలో ప్రోత్సహించడమే లక్ష్యంగా కాలయంత్రం... చారిత్రిక కథారచన కార్యశాలను నిర్వహిస్తున్నాం' అని నిర్వాహకుడు సాయి పాపినేని చెప్పారు. మంగళగిరి సమీపంలో శనివారం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 40 ప్రముఖ రచయితలు హాజరయ్యారు. కార్యక్రమం ఉద్దేశాన్ని సాయి వివరించారు. మన మూలాల గురించి తెలియకపోవడంతోనే రేపటిపై భయం, ఉమ్మడితనం లేకపోవడం వంటి లక్షణాలు మనలో కనిపిస్తున్నాయన్నారు. చరిత్రను ముడి సరుకుగా తీసుకోవడానికి గల అవకాశాలను ప్రముఖ చరిత్రకారులు ఈమని శివనాగిరెడ్డి సమగ్రంగా వివరించారు. కళింగ ఆంధ్ర చరిత్రను ఆధారం చేసుకొని కథలు, నవలలు ఎలా రాయవచ్చో దీర్ఘాసి విజయభాస్కర్ ఉదాహరణలతో వివరించారు. తెలంగాణ ప్రాంతంలో లభ్యమవుతున్న చారిత్రిక ఆధారాలతో నాటి కాల మాన పరిస్థితులను తెలుసుకోవడానికి చేసిన ప్రయత్నాన్ని కట్టా శ్రీనివాస్ వివరించారు. పరిశోధనలను కథా రూపంలో 'ఆంధ్రజ్యోతి' ఆదివారం పత్రికలో వచ్చినపుడు వచ్చిన స్పందనను ఆయన తెలియచేస్తూ సాహిత్య రూపంలో చరిత్రను ఎక్కువ మందికి చేరవేయగలుగుతామని చెప్పారు. రాయలసీమ ప్రాంతంలో లభ్యమయ్యే అత్యంత అపురూపమైన చారిత్రిక ఆధారాలను కాపాడుకోవడంలో కనిపిస్తున్న నిర్లక్ష్యాన్ని వేంపల్లి గంగాధర్ సందర్భోచితంగా ఎండగట్టారు. అనంతరం తానా బహుమతి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన శప్తభూమి నవలా రచయిత బండి నారాయణస్వామితో ముఖా ముఖి జరిగింది.

## ఏపీ బ్యాంకు సీఎండీ కిడ్నాప్ కేసు..
# పోలీసుల అదుపులో ఐదుగురు

- రేపు పుణెలో సీన్ రీకన్‌స్ట్రక్షన్‌కు నిందితులు!
- 'ఆంధ్రజ్యోతి'లో కథనాలతో బెజవాడ పోలీసుల విచారణ!!

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ మర్కంటైల్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సీఎండీ బండారి సత్యనారాయణరావు కిడ్నాప్ కేసులో.. ముంబైలోని కమోతే పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు వినాయక్ పురోహిత్ సహా..అతడి నలుగురు అనుచరులను విచారిస్తున్నారు. బాధితుడిని కిడ్నాప్ చేసి..ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రూ. 35 లక్షలు కొల్లగొట్టిన నిందితులు ఆ డబ్బును ఎక్కడ దాచారనే కోణాల్లో ప్రశ్నిస్తున్నారు. వారిని ఆదివారం సాయంత్రం అధికారికంగా అరెస్టు చేసినట్లు ప్రకటించే అవకాశాలున్నాయి. సోమవారం ఉదయం బాధితుడిని ఎలా కిడ్నాప్ చేశారు? పుణె సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి ఎలా తీసుకువెళ్లారు? అనే కోణాల్లో 'సీన్ రీకన్‌స్ట్రక్షన్' చేయించనున్నారు. కాగా.. కిడ్నాప్ ఉదంతంపై 'ఆంధ్రజ్యోతి'లో గత ఆదివారం నుంచి ప్రచురితమైన కథనాలపై విజయవాడ పోలీసులు దృష్టిసారించారు. శనివారం విజయవాడలోని ఏపీ మర్కంటైల్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రధాన కార్యాలయానికి చేరుకుని, కిడ్నాప్ ఉదంతంపై విచారించారు. బాధితుడి కుమారుడి నుంచి కొంత సమాచారం సేకరించినట్లు తెలిసింది. అయితే.. విషయం తమ దృష్టిలో ఉందని, తాము మాత్రం ఎలాంటి విచారణ చేపట్టలేదని విజయవాడ పోలీసు కమిషనర్ ద్వారకా తిరుమలరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

# చస్తూ బతుకుతున్నాం!

- ప్రభుత్వాన్ని నమ్మడమే పాపమైంది
- 88వ రోజూ సాగిన ఆందోళన
- నేడు చండీయాగం: జేఏసీ నేతలు



తుళ్లూరులో రాజధాని మహిళలు, రైతుల నినాదాలు

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'నేతి బీరకాయలో నెయ్యి చందాన, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది. మా ఇళ్ల చుట్టూ తిరిగి రాష్ట్ర భవిష్యత్తు కోసం అంటూ గడ్డాలు పట్టుకొని బతిమాలి భూములు తీసుకొన్న అధికారులు... ఇప్పుడు మా మోహం చూసి చీదరించుకుంటున్నారు. ప్రభుత్వాన్ని నమ్మడమే పాపమైంది. ఎప్పుడు ఏమవుతోందన్న అన్న భయంతో చస్తూ బతుకుతున్నాం' అంటూ రాజధాని ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజధానిగా అమరాతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శనివారం 88వ రోజు అమరావతిలో ఆందోళనలు, నిరసన దీక్షలు కొనసాగించారు. తుళ్లూరు, మందడంలో మహాధర్నా నిర్వహించగా, వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం, తాడికొండ అడ్డరోడ్డు, పెదపరిమి, తాడేపల్లి, నవులూరు, తదితర ప్రాంతాల్లో రిలే దీక్షలు, ఆందోళనలు కొనసాగించారు. అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించే వరకు గాంధేయ మార్గంలో పోరు అపబోమని తెల్చిచెప్పారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు రివర్స్‌లో నడుస్తున్నాయని.. 9నెలల్లోనే మా బతుకులు తలకిందులయ్యాయంటూ తుళ్లూరు రైతులు, మహిళలు, రైతు కూలీలు రివర్స్‌లో దండం పెడుతూ నిరసన తెలిపారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాయపూడి రైతులు, మహిళలు రోడ్లు ఊడ్చారు. రైతుల ఆందోళనకు టీడీపీ మహిళా నేత గద్దె అనురాధ మద్దతు తెలిపారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ఎస్పీ సాహేబ్, జేఏసీ నేత పాతర్ల రమేశ్ రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతంలో ప్రవాసాంధ్రుల సౌజన్యంతో ఆదివారం ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు చండీయాగం నిర్వహిస్తున్నట్లు జేఏసీ నేతలు తెలిపారు.

**అమరావతి కోసం నేను సైతం!**

**88రోజులుగా దీక్షా శిబిరంలో దివ్యాంగుడి సేవ**



అమరావతి పరిరక్షణ ఉద్యమంలో ఓ దివ్యాంగుడు అందరినీ ఆకట్టుకుంటున్నాడు. 88 రోజులుగా రాయపూడి దీక్షా శిబిరానికి హాజరవుతున్న అంకరాజు అందరి తలలో నాలుకలా నిలుస్తున్నాడు. ఉదయం 9గంటలకు అందరికంటే ముందుగా వచ్చి టెంటుల్లో కుర్చీలు, మైకులు సిద్ధం చేస్తున్నాడు. తానే నినాదాలు చేస్తున్నాడు. 'అమరావతిని కొనసాగేలా చూడమ్మా' అంటూ శిబిరం పక్కనున్న పోలేరమ్మకు 88రోజులుగా స్వయంగా నైవేద్యం పెడుతున్నాడు. చదువు లేకపోయినా అతడి చొరవ, తెలివితేటలు, మాటలకు అందరూ ముగ్ధులవుతున్నారు. పేద కుటుంబంలో పుట్టిన అంకరాజుకు చదువుకునే అవకాశం కల్పిస్తామంటున్నా.. అమరావతి తరువాతే ఏదైనా అని చెబుతున్నాడు. 10నెలల క్రితం పోలీసులు వస్తున్నారంటే ఇంటినుంచి బయటకు కూడా వచ్చేవాడు కాదని.. అలాంటివాడు ఇప్పుడు పోలీసు అధికారులతో ధైర్యంగా మాట్లాడుతున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చే పింఛన్‌ను కూడా నిరాకరించాడంటున్నారు.

## కాసులు లేకున్నా
# కళా పోషణ!

- ఇళ్ల స్థలాల లేఅవుట్‌లతో కరిజ్మా అల్బమ్స్
- సీఎంను ప్రసన్నం చేసుకునేందుకు సర్వే ఉన్నతాధికారి అత్యుత్సాహం

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కరిజ్మా అల్బమ్స్... అత్యంత ఖరీదైన ఫొటో బుక్. పెళ్లిళ్లు, ప్రత్యేక ఫంక్షన్‌ల తర్వాత వాటి అనుభూతులు ఓ మధురజ్ఞాపకంలా ఉండేందుకు భారీగా ఖర్చుపెట్టి మరీ కరిజ్మా మోడల్ ఫొటో అల్బమ్స్ తయారు చేస్తుంటారు. సర్వే అధికారులు కూడా ఇప్పుడు ఇదే బాటపట్టారు. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూమిలో ప్రస్తుతం లే అవుట్‌లు వేస్తున్న సంగతి తెలిసిందే. వీటిని హైడెఫినేషన్ ఫార్మాట్‌లో ఫొటోలు తీసి మండలం, డివిజన్, జిల్లా వారీగా కరిజ్మా ఫొటో అల్బమ్‌లుగా తయారు చేయించాలని సర్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాస్థాయి సర్వే అధికారులకు ఆదేశాలు కూడా వెళ్లాయి. మరి నిధుల మాటేమిటి అంటే మౌనం! ఆ ఒక్కటీ అడగొద్దు అంటూ హెచ్చరిక. పైగా ఏ జిల్లా అల్బమ్ ఎంత అద్భుతంగా వస్తుందో నిరూపించుకోవాలంటూ చక్కటి పోటీపెట్టారు కూడా! ఇక్కడే అసలు విషయం ఉంది. లే అవుట్‌లపై కరిజ్మా ఫొటో అల్బమ్స్ తయారు చేయించాలని సర్వే అధికారులకు ఎవరూ బాధ్యతలు అప్పగించలేదు. రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, లేదా భూ పరిపాలనా ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) నుంచి లిఖితపూర్వక ఆదేశాలు వెళ్లలేదు. ఎందుకంటే, లే అవుట్‌ల తర్వాత ఫొటో ఆల్బమ్ తయారు చేయించాలంటే జిల్లా స్థాయిలో కలెక్టర్‌లు, రాష్ట్ర స్థాయిలో రెవెన్యూ శాఖ దానిపై నిర్ణయం తీసుకోవాలి. ఇందులో సర్వేశాఖకు పెద్దగా పాత్ర లేదు. మరి సర్వే అధికారులు భారీ ఖర్చుతో కూడిన ఈ ప్రయత్నం ఎందుకు మొదలుపెట్టారు? దీనికి బడ్జెట్ ఎక్కడి నుంచి తీసుకొస్తారు? ప్రభుత్వ అనుమతి ఉందా? ఇవ్వన్నీ అడగకూడదని సర్వే ఏడీలకు హెచ్చరికలు ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌తో వీటిని ఆవిష్కరింపచేయాలని సర్వే అధికారులు భావిస్తున్నారు. వీటి ద్వారా నేరుగా సీఎంను ప్రసన్నం చేసుకోవాలన్నది సర్వే అధికారి వ్యూహమని, అందుకే అధికారులపై భారీ ఖర్చుతో కూడిన పనులను మోపారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. .

# వివేకా హత్యకు ఏడాది!

(మొదటిపేజీ తరువాయి)

తన స్వగృహంలోనే హత్యకు గురయ్యారు. ఏడాదిలో వివేకా హత్య కేసు దర్యాప్తు పలు మలుపులు తిరిగింది. వివేకా హత్య జరిగిన వెంటనే దర్యాప్తు కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 'సిట్'ను నియమించారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత సీఎం జగన్ రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదని, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. హైకోర్టును ఆశ్రయించారు. అయితే.. ఆయన స్వయంగా ముఖ్యమంత్రి అయిన తర్వాత 'సీబీఐ' సంగతి పక్కనపెట్టారు.

### కుమార్తె పోరాటం...

వివేకానంద రెడ్డి 'గుండెపోటు'తో మరణించారని తొలుత ప్రచారం చేయడం... రక్తపు మరకలను తుడిచేయడం, కుటుంబ సభ్యులు రాకమునుపే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయడం వంటి అనేక 'అనుమానాస్పద' చర్యలతో ఈ కేసు పెను సంచలనం సృష్టించింది. సిట్ దర్యాప్తు ఇప్పటికి ముగ్గురు ఎస్పీల ఆధ్వర్యంలో సాగింది. తొలుత అప్పటి సీఎం చంద్రబాబు నాటి కడప ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ నేతృత్వంలో దర్యాప్తు కోసం సిట్‌ను నియమించారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక కడప ఎస్పీగా అభిషేక్ మహంతిని నియమించారు. ఆయన నేతృత్వంలో సిట్ దర్యాప్తు కొనసాగింది. దాదాపుగా విచారణ ఓ కొలిక్కి వస్తున్న తరుణంలో అభిషేక్ మహంతి దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది అక్టోబరు 11న కడప ఎస్పీగా కేకేఎన్ అన్బురాజన్‌ను నియమించారు. ఆయన నేతృత్వంలో మూడో సిట్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన సారథ్యంలోనే దర్యాప్తు కొనసాగుతోంది. నెలలు గడుస్తున్నా కేసు దర్యాప్తులో పురోగతి లేకపోవడంతో వివేకా కుమార్తె డాక్టర్ సునీత న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించారు. సిట్ దర్యాప్తు చేస్తున్న అధికారులను మార్చారని, కడపకు కొత్త ఎస్పీ వచ్చిన తరువాత దర్యాప్తు నత్తనడకన సాగుతోందని వెల్లడించారు. 'అమాయకులను ఇరికించి అసలైన నేరస్తులను వదిలేస్తారేమో?' అనే సందేహం వెలిబుచ్చారు. 'వీరిపై అనుమానాలున్నాయి' అంటూ పలువురి పేర్లు, వారిపై ఉన్న అనుమానాలను కూడా హైకోర్టుకు వివరించారు. కేసును సీబీఐకి అప్పగించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆదినారాయణ రెడ్డి, టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కూడా ఈ కేసును సీబీఐకి అప్పగించాలని హైకోర్టును ఆశ్రయించారు. ఆయా ఫిర్యాదులను విచారించిన న్యాయస్థానం ఈ నెల 11న సీబీఐకి కేసును అప్పగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది.

## శ్రీవారిసేవలో హైకోర్టు న్యాయమూర్తి


కుటుంబ సభ్యులతో జస్టిస్ విజయలక్ష్మి

తిరుమల, మార్చి 14: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.విజయలక్ష్మి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉద యం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుం బ సమేతంగా స్వామిని దర్శించుకున్న అనంతరం ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

## ఎరక్కపోయి రైలెక్కి ఇరుక్కున్నాడు..!

▸▸ 3 కిలోల గంజాయితో పట్టుబడిన డిగ్రీ విద్యార్థి


పట్టుబడిన గంజాయితో మహ్మద్ షోయక్త్ జాని

పలాస, మార్చి 14: ఒక రైలు బదులు మరొకటి ఎక్కి మూడు కిలోల గంజాయితో పట్టుబడ్డాడు ఓ డిగ్రీ విద్యార్థి. శ్రీకాకుళం జిల్లా పలాసలో శనివారం వెలుగు చూసిన ఘటనకు సంబంధించి ఆర్పీఎఫ్ సీఐ కేకే సాహు అందించిన వివరాలు.... మహ్మద్ షోయక్త్‌జాని అనే యువకుడు విశాఖ జిల్లా అరకులో 3 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. స్వగ్రామం కృష్ణాజిల్లా మచిలీపట్నం తీసుకెళ్లడానికి విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అతను విజయవాడ రైలు ఎక్కాల్సి ఉంది. అదేసమయంలో విజయవాడ, భువనేశ్వర్ వైపు వెళ్లే రైళ్లు రెండూ ఒకేసారి స్టేషన్‌కు చేరుకున్నాయి. అయోమయానికి గురై భువనేశ్వర్ రైలు ఎక్కాడు. శనివారం వేకువజామున చూసేసరికి పలాస స్టేషన్ బోర్డు కనిపించడంతో అక్కడే దిగిపోయాడు. ఫ్లాట్‌ఫారం పై అనుమానాస్పదస్థితిలో తిరుగుతుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది ఆరాతీశారు. బ్యాగులో మూ డు కిలోల గంజాయి వెలుగుచూసింది. తనతో పాటు 11 మంది స్నేహితులకు గంజా యి పీల్చే అలవాటు ఉందని.. అరకు వెళ్లి కొనుగోలు చేస్తామని మహ్మద్ షోయక్త్ జాని చెబుతున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వారాంతాల్లో హైదరాబాద్, ఢిల్లీ వెళ్లొద్దు!

**ఉన్నతాధికారులకు నీలం సాహ్ని ఆదేశం**

- ▸▸ సీఎం నిర్వహించిన కీలక సమావేశాలకు పలువురు గైర్హాజరు?
- ▸▸ ప్రధాన కార్యదర్శి పరిశీలనలో పలు అంశాలు వెలుగులోకి
- ▸▸ కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లపై ఆగ్రహం.. మెమో జారీ
- ▸▸ కార్యదర్శులంతా సచివాలయానికి రావాల్సిందేనని హుకుం



అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం వస్తే చాలు. ఆఫీసు పని పేరు చెప్పి హైదరాబాద్, ఢిల్లీకి వెళ్లి సోమవారం తిరిగొస్తున్న ఉన్నతాధికారులపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తంచేసింది. చీటికీమాటికీ వారాంతాల్లో ఉన్నతాధికారులు హైదరాబాద్, ఢిల్లీ వెళ్లొద్దని ఆదేశాలు జారీచేసింది. తప్పనిసరి పనులేమైనా ఉంటే కిందిస్థాయి అధికారులను పంపించాలని ఆదేశాల్లో పేర్కొంది. ఇటీవల పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులు వారాంతాల్లో తరచూ హైదరాబాద్, ఢిల్లీ వెళ్లిపోతున్నారు. శని, ఆదివారాల్లో సచివాలయానికి సెలవు కావడంతో...ఆ రెండురోజులు నగరాల్లో ఉండి వస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం తరపున పని కల్పించుకుని... ఖర్చులను ప్రభుత్వం మీదే వేస్తున్నారు. వారి సొంత పనుల కోసమే ఈ రకంగా వెళ్లిపోతున్నారనేది బహిరంగ రహస్యం. అదే సమయంలో ప్రభుత్వం అత్యవసరంగా ఏదైనా సమావేశం నిర్వహిస్తే సదరు ఉన్నతాధికారులు అందుబాటులో ఉండడం లేదు. ఈ పరిస్థితిని గమనించి ఇకపై హైదరాబాద్, ఢిల్లీ వెళ్లే పనులకు కిందిస్థాయి అధికారుల్ని పంపించాలని.. మరీ అత్యవసరం అనుకుంటేనే ఉన్నతాధికారులు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని శనివారం మెమో జారీచేశారు. మరోవైపు అనేక అంశాలపై ఇప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం నెలకొందని, ఈ దృష్ట్యా తరచూ సెలవులు పెట్టొద్దని నిర్దేశించారు. అదే సమయంలో పలువురు కార్యదర్శులు క్యాంప్ కార్యాలయంలోను, లేకుంటే విజయవాడలోను సమావేశాలు పెట్టుకుంటున్నారని, సచివాలయానికి రావడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. దీనిపైనా సీఎస్ స్పష్టమైన ఉత్తర్వులిచ్చారు. కార్యదర్శులు కచ్చితంగా సచివాలయానికి రావాల్సిందేనని ఆదేశించారు. సమావేశాలుంటే సచివాలయంలో పెట్టుకోవాలని, మరీ అవసరమైతే తప్ప మరో చోట నిర్వహించకూడదని స్పష్టంచేశారు. అదేవిధంగా ఐపీఎస్ అధికారులు కూడా పలువురు క్యాంప్ కార్యాలయాల్లోనే ఉండి పనులు చక్కబెడుతున్నారు. దీంతో సందర్శకులకు కలిసేందుకు వీల్లేకుండా పోతోంది. క్యాంప్ కార్యాలయాలకు వెళ్లేందుకు అందరికీ అనుమతి ఉండకపోవచ్చు. దీంతో ప్రజా సంబంధ వ్యవహారాలపై వచ్చినవారికి వాటిపై నివేదించే అవకాశం లేకుండాపోతోంది.

**జరిగిందిదీ!**

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల కొన్ని సమావేశాల కోసం కొందరు ఐఏఎస్ అధికారుల్ని రావాలని పిలిచారు. అయితే ఆ సమయానికి సదరు అధికారులు లేరన్న సమాచారం వచ్చింది. ఒకటికి రెండుసార్లు ఇలానే జరగడం, పలువురు ఐఏఎస్‌ల విషయంలో ఇదే అనుభవం ఎదురవడంతో అసలేం జరుగుతుందో ఆరా తీయాలని ఆదేశించారని తెలిసింది. దీంతో ఈ అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లోతుగా ఆరా తీశారు. ఈ క్రమంలో జరుగుతున్న వ్యవహారాలు ఆమె దృష్టికి వచ్చాయి. దీంతో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లారని సమాచారం. అదే సమయంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కొందరు కార్యదర్శులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు పలు పనులపై సచివాలయానికి వస్తున్నా.. అక్కడ కార్యదర్శులు ఉండడం లేదు. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. మొత్తంగా పరిస్థితిని అధ్యయనం చేసిన ప్రభుత్వం...దీన్ని నియంత్రించేందుకు తాజా మెమో జారీచేసినట్లు తెలిసింది. ఒకవేళ ఎవరన్నా కచ్చితంగా వెళ్లాల్సి వస్తే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనుమతి తీసుకుని వెళ్లాలని స్పష్టం చేసినట్లు సమాచారం.

## రేషన్ బియ్యానికి రెక్కలు

▸▸ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా అరెస్టు

నెల్లూరు ( క్రైం), మార్చి 14: రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి, నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు ద్వారా విదేశాలకు అక్రమంగా ఎగుమతి చేస్తున్న అంతర్జాతీయ ముఠాను పోలీసులు శనివారం అరెస్టుచేశారు. నిందితుల వివరాలను ఎస్పీ భాస్కర్ భూషణ్ విలేకరులకు తెలిపారు. గత నెల 29వ తేదీన కృష్ణపట్నం పోర్టులోని సీబడ్ సీఎఫ్ఎస్ గోదాములో నిల్వ ఉంచిన 1,645 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కృష్ణపట్నం కస్టమ్స్, జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారులు సీజ్ చేశారు. ఈ ఘటనపై ఈ నెల 1వ తేదీన కృష్ణపట్నం పోర్టు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్పీ భాస్కర్ భూషణ్.. నెల్లూరు రూరల్ డీఎస్పీ వై.హరినాథ్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. ఈ బృందం దర్యాప్తు ప్రారంభించి నలుగురు నిందితులను వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద శుక్రవారం రాత్రి అరెస్టు చేసింది. ఈ ముఠాకు చెందిన కృష్ణా జిల్లా విజయవాడలోని ఎంఎస్ఆర్ ట్రేడర్స్ యజమాని షేక్ సయ్యద్, తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన మొయికొమాడియేట్స్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆపరేషన్ మేనేజర్ మంచికల వీరవెంకట సత్యశివప్రసాద్.. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలానికి చెందిన శ్రీరాజ్యలక్ష్మి రా అండ్ బాయిల్డ్ రైస్‌మిల్లు యజమాని కుంకాల రవి, గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన శ్రీ బాలాజీ ట్రేడర్స్ రైస్‌మిల్లు యజమాని బతుల వెంకటేశ్వర్లును పోలీసులు అరెస్టుచేశారు. వీరంతా రేషన్ బియ్యాన్ని రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి, వాటిని రైతుల వద్ద కొనుగోలు చేసినట్లు తప్పుడు బిల్లులు, ఇన్‌వాయిస్‌లను సృష్టిస్తారు. పలు బ్రాండ్ల పేర్లతో ఉన్న రైస్‌బ్యాగుల్లో నింపి ఎగుమతి చేస్తున్నారు. ఈ కేసులో మరి కొందరిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని ఎస్పీ తెలిపారు.

# ఆ సంచులు గడప వరకే!

- ▸▸ బియ్యం కార్డుదారుల బ్యాగుల్లోనే పోయాలి
- ▸▸ ప్రభుత్వ సంచులు వెంటనే తెచ్చి డీలర్లకివ్వాలి
- ▸▸ వలంటీర్లకు పౌర సరఫరాల శాఖ ఆదేశాలు
- ▸▸ పర్యావరణానికి ఇబ్బందంటూ కొత్త మెలిక
- ▸▸ శ్రీకాకుళంలో ఇచ్చినవీ సేకరించాలని సూచన
- ▸▸ వీటికోసం ఏటా దాదాపు 700కోట్ల భారం
- ▸▸ ప్యాకింగ్, విద్యుత్, రవాణా ఖర్చులు అదనం
- ▸▸ కాంట్రాక్టర్లకు తప్ప పేదలకు ఉపయోగమేదీ?
- ▸▸ ఈమాత్రం దానికి ప్యాకెట్లెందుకని విమర్శలు



అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ బియ్యం సంచులు అన్నారు.. వాటిపై సీఎం జగన్, వైఎస్ ఫొటోలతో పాటు నవరత్నాల బొమ్మలూ ము ద్రించారు. చివరికి ఆ సంచులు కార్డుదారులకు ఇచ్చేవి కాదని తేల్చేశారు. కొత్తగా ప్రవేశపెట్టిన బియ్యం సంచుల విధానంలో ప్యాకెట్లు కేవలం కార్డుదారుల గడప వరకేనని, అక్కడ వలంటీర్లు కార్డుదారుల సంచుల్లో బియ్యాన్ని పోయాలని పౌరసరఫరాల శాఖ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఆ వెంటనే ప్రభుత్వం ఇచ్చే సంచులను తిరిగి తీసుకురావాలని స్పష్టం చేసింది. ఇంటివద్ద కార్డుదారులకు బియ్యాన్ని చూపించి, వారితో వేలిముద్ర వేయించుకుని, వారి సంచుల్లో పోయాలని వివరించింది. ఇంతమాత్రం దానికి ప్యాకెట్ల విధానం అనే పెద్దవ్యవస్థ పేరిట నానా హడావుడి చేయడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ విధానం ప్రారంభించినప్పుడు మొదట్లో కార్డుదారులకే సంచులు ఇచ్చారు. వలంటీర్లు ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యుల సంఖ్య ఆధారంగా వీటిని ఇస్తున్నారు. అయితే పర్యావరణానికి ఇబ్బంది అంటూ ఇచ్చిన సంచులు కూడా తిరిగి సేకరించాలని ఇప్పుడు వారికి కొత్త పని అప్పగించారు. ఏప్రిల్ నుంచి మిగిలిన 12జిల్లాల్లో ఒక్కో నియోజకవర్గం చొప్పున ఈ విధానం ప్రారంభించనున్న నేపథ్యంలో వలంటీర్లకు జిల్లాల పౌరసరఫరాల అధికారులు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఖాళీ సంచులు వెంటనే తిరిగి తీసుకొచ్చి డీలర్లకు ఇవ్వాలని సూచించారు. ప్యాకెట్లలో బియ్యం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. పంపిణీ వ్యవస్థలో ఇదో కొత్త అధ్యాయం అని, సులభమైన విధానం అంటూ చెప్పుకొచ్చింది. పౌర సరఫరాల శాఖ 5, 10, 20 కిలోల సంచుల్లో బియ్యం పంపిణీ చేస్తోంది. ఒక్కో సంచికి సగటున రూ.12 వెచ్చిస్తోంది. రాష్ట్రంలో 1.47కోట్ల మంది కార్డుదారులకు ఇచ్చేందుకు గాను కేవలం ఈ సంచులకే ఏడాదికి రూ.700కోట్లు అవుతాయని అంచనా. ఇవికాకుండా ప్యాకింగ్ యంత్రాలు, విద్యుత్ ఖర్చు, రవాణా భారం కూడా ప్రభుత్వంపైనే పడుతోంది. అంత ఖర్చు చేసి చివరికి కార్డుదారుడి చేతికి కూడా అందకుండానే సంచులు వెనక్కి తీసేసుకోవాలని ఆదేశించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.










> ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు అంతరాత్మ ఉండదా? మీరు జీతాలు, ఇతరత్రా సౌకర్యాలు పొందుతున్నది ప్రజల సొమ్ముతోనే కదా? ముఖ్యమంత్రులు తమ జేబులో నుంచి ఇవ్వడం లేదు కదా? 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్న రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో కొంతమంది అధికారుల ప్రవర్తన ఉన్న కారణంగానే హైకోర్టుకు పనిభారం పెరిగింది. ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్‌లో బాధితులకు ఉపశమనం కలిగించే ఏకైక వ్యవస్థగా ఉన్నత న్యాయస్థానం నిలబడింది. ప్రభుత్వ నిర్ణయాలు, చర్యలపై గతంలో ఎన్నడూ లేని విధంగా లెక్కకు మించి ఫిర్యాదులు దాఖలు అయ్యాయంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడున్న పరిస్థితులలో హైకోర్టు కూడా ఆదుకోకపోతే దిక్కేమిటి? అని సామాన్య ప్రజలు భావిస్తున్నారు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

■ ఆర్కే RK

కొత్తపలుకు



# సిగ్గు పడాలి!



ఆంధ్రప్రదేశ్‌లో రోజుకో వ్యవస్థ న్యాయస్థానం ముందు చేతులు కట్టుకుని నిలబడుతోంది. కార్యనిర్వాహక వ్యవస్థతోపాటు స్వతంత్రంగా పనిచేయవలసిన ఎన్నికల కమిషన్‌కి కూడా ఈ దుస్థితి ఎందుకు? స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అధికార వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అరాచకాలు పెచ్చరిల్లుతున్నప్పటికీ సంబంధిత వ్యవస్థలు చర్యలు తీసుకోకపోవడంతో కక్షిదారులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన దుస్థితి. మొన్న రాష్ట్ర డీజీపీ, నిన్న ఎన్నికల కమిషన్ హైకోర్టు ధర్మాసనం ముందు దోషిగా నిలబడే స్థితి దాపురించింది. రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ అధికార పార్టీతో చేతులు కలపడం వల్లనే గతంలో ఎన్నడూ లేని విధంగా స్పందించవలసిన పరిస్థితి న్యాయస్థానానికి ఏర్పడుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేస్తున్న ఉన్నతాధికారి ఒకరు అధికార పార్టీ ఉన్నతికి పాటుపడదాం అని ట్వీట్ చేయడం విడ్డూరంగా అనిపించడం లేదా? పరిస్థితులు అరాచకంగా మారినప్పుడు బిహార్‌లా ఉందేమిటి? అని అంటూ ఉంటారు. ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న పరిస్థితులు బిహార్‌ను మరిపిస్తున్నాయి. నిజానికి బిహార్ వంటి వెనుకబడిన రాష్ట్రంలో ఇప్పుడు పరిస్థితులు మెరుగుపడుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచక పాలన సాగుతోంది. చట్టాలకు, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన అఖిల భారత సర్వీసు ఉన్నతాధికారులు కూడా ఈ పాపంలో పాలుపంచుకోవడం విషాదం! ప్రభుత్వ చర్యలను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రతీ రోజూ తప్పుబడుతున్నప్పటికీ దులుపుకెళ్లిపోతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దీవెన ఉంటే చాలు.. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు అన్నట్టుగా అధికార వ్యవస్థ.. ముఖ్యంగా పోలీసులు విర్రవీగుతున్నారు. "ఇది రాష్ట్రమేనా? ఇక్కడ చట్టం అమలవుతోందా?" అని హైకోర్టు ధర్మాసనం రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను ప్రశ్నించడం దేనికి సంకేతం? "కోడ్ అమలులోకి వస్తేనే మీకు అధికారాలు సంక్రమిస్తాయని అన్నారు. ఇప్పుడు కోడ్ అమలులో ఉంది కదా? ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఈ పరిస్థితిని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళతాం" అని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించాక కూడా ప్రతిపక్షాలకు ఉపశమనం లభించని దుస్థితి! నాలుగు రోజుల క్రితం మాచర్ల వెళ్లిన తెలుగుదేశం నాయకులు బొండా ఉమామహేశ్వరావు, బుద్దా వెంకన్నలపై ఏ మాత్రం వెరపు లేకుండా దాడికి తెగబడిన తురకా కిశోర్ అనే వ్యక్తిని మాచర్ల మునిసిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించడం అధికార పార్టీ బరితెగింపునకు నిదర్శనం కాదా? ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలోకి వచ్చిన ఒక రాజకీయ పార్టీ చేయాల్సిన పనేనా ఇది? ఇళ్ల స్థలాల పేరిట అసైన్డ్ భూములలో పంటలను కూడా ధ్వంసం చేసి మరీ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఇందుకు పోలీసులు సహకరించడంపై న్యాయస్థానం కూడా మండిపడింది. ఈ సందర్భంగా డీజీపీ గౌతమ్ సవాంగ్‌కు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌కు కొన్ని ప్రశ్నలు వేసింది. హైకోర్టు ధర్మాసనం ముందు నిలబడి సెక్షన్ 151 అంటే అర్థం ఏమిటో చదవాల్సి రావడం డీజీపీకే కాదు.. మొత్తం పోలీసు వ్యవస్థకే అవమానం కాదా? డీజీపీ పదవి ఇచ్చారన్న కృతజ్ఞత గౌతమ్ సవాంగ్‌కు ఉంటే ఉండవచ్చు గాక! రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత ఆయనపై లేదా? తనపై న్యాయస్థానంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకునే పరిస్థితి తెచ్చుకోవడం సవాంగ్‌కు గౌరవమా? తెలుగుదేశం నాయకులపై దాడి చేసిన వ్యక్తిపై హత్యాయత్నం కింద కేసు పెట్టామని చెప్పి స్టేషన్ బెయిల్ ఇవ్వడాన్ని ఎలా సమర్థించుకుంటారు? ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుంటూ ఉంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం అన్యాయం కాదా? ప్రతిపక్షాల వారిని నామినేషన్లు ఉపసంహరించుకునేలా పోలీసులు బెదిరించడం, కొన్ని ప్రాంతాలలో చిత్రహింసలకు గురిచేయడం ఏమిటి? ప్రత్యర్థుల ఇళ్లల్లో అక్రమంగా మద్యం సీసాలు పెట్టినవారిని వదిలేసి.. అమాయకులపై కేసులు పెట్టడం నాగరిక వ్యవస్థలో పోలీసులు చేయవలసిన పనేనా? నియంతల పాలనలో ఇలాంటి అకృత్యాలు, అఘాయిత్యాలు జరిగాయని విన్నాం. ప్రజాస్వామ్య యుగంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంలో కొలువులు వెలగబెడుతూ ఇలాంటి వాటిని ఎలా ప్రోత్సహిస్తారు? ఈ ప్రశ్నలకు డీజీపీ గౌతమ్ సవాంగ్ వద్ద సమాధానం ఉందా? రాజకీయ పార్టీలు అదుపు తప్పి ప్రవర్తించినప్పుడు శాంతిభద్రతలను కాపాడటం, పౌరులకు రక్షణ కల్పించడం పోలీసుల విధి కాదా? రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలంగాణ పోలీసులను ఆశ్రయించిన జగన్ అండ్ కోకు పోలీసులు దాసోహం కావడం సబబేనా? రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారి అరాచకం పెచ్చరిల్లితే ఏమి జరుగుతుందో తెలియదా? హైకోర్టు వ్యాఖ్యానించినట్టుగా ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి. రూల్ ఆఫ్ లాను అమలు చేయవలసిన బాధ్యత పోలీసులది కాదా? ఇవ్వాళ వైసీపీ అధికారంలో ఉండవచ్చు.. రేపు మరో పార్టీ అధికారంలోకి రావచ్చు. అప్పుడు వారు కూడా ప్రతీకారానికై తెగబడితే పరిస్థితి ఏమిటి? ఇవే పరిస్థితులు కొనసాగితే అధికార పార్టీ పేరు చెప్పి వీధికో రౌడీ తయారు కాడా? ఒకప్పుడు హైదరాబాద్‌లో ప్రాంతానికో రౌడీ చెలరేగిపోయేవారు. ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటి రౌడీల ఆట కట్టించారు. విజయవాడలో కూడా ఒకప్పుడు ఇలాంటి రౌడీయిజమే సాగింది. రౌడీలు రాజ్యమేలితే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ ఉంటుందా? డీజీపీ సవాంగ్ మరో మూడేళ్లపాటు ఆ పదవిలో ఉండవచ్చు. ఆ తర్వాత ఆయన హైదరాబాద్‌లో స్థిరపడిపోతారు కానీ.. ఆంధ్రప్రదేశ్‌లో కాదు. నేను ఇక్కడ ఉండబోవడం లేదు కదా? ఆంధ్రప్రదేశ్ ఏమైతే నాకేంటి? నా పదవి నాకు ముఖ్యం అని ఆయన భావిస్తున్నారేమో తెలియదు! ఇప్పుడు ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్ విషయానికి వద్దాం. స్థానిక ఎన్నికలు నిర్వహించే అవకాశం ఆయనకు లభించింది. మరో ఏడాదిలో ఆయన పదవీ విరమణ చేస్తారు. కనుక ఈ ఎన్నికల తర్వాత ఆయన చేసే పని కూడా ఏమీ ఉండదు. స్థానిక ఎన్నికల సందర్భంగా అధికార పార్టీకి చెందినవారు అరాచకంగా ప్రవర్తిస్తున్న దృశ్యాలను న్యూస్ చానెళ్లు కళ్లకు కట్టినట్టుగా చూపిస్తున్నా రమేశ్‌కుమార్ కళ్లు మూసుకుని కూర్చుంటున్నారు. తాడిపత్రిలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా స్థానిక ఎమ్మెల్యే దుస్తులు పంపిణీ చేసినా క్రిమినల్ కేసు పెట్టకుండా ఆయనను ఒక రోజు ప్రచారానికి దూరంగా పెడుతున్నామని ప్రకటించడానికి ఎన్నికల కమిషన్ సిగ్గుపడటం లేదా? పంచాయతీ భవనాలకు వేయించిన వైసీపీ రంగులను పది రోజుల్లో తొలగించాలని హైకోర్టు ఆదేశించినా.. ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఏమిటి? ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులను కౌన్సెలింగ్ పేరిట ఒంగోలుకు తీసుకెళ్లిన పోలీసులు చితకబాది పంపడంపై చర్యలు తీసుకున్నారా? పోలీసుల సాక్షిగా దుడ్డుకర్రతో దాడి చేసిన వైసీపీ నేతకు స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలివేయడం ఏమిటని పోలీసులను సంజాయిషీ ఎందుకు కోరలేకపోతున్నారు? ఎన్నికలు అంటే ఇలా జరిపించాలని దేశ ప్రజలకు తెలియజేయడమే కాకుండా ఒక భరోసా కల్పించిన ఒకప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ టి.ఎన్.శేషన్‌ను ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటున్నాం. ఇవ్వాళ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్ వ్యవహార శైలి చూసినవారికి ఎన్నికల వ్యవస్థపై నమ్మకం ఏర్పడుతుందా? పదవీ కాలం ముగిసిన తర్వాత రమేశ్ కుమార్ కూడా హైదరాబాద్‌లోనే స్థిరపడతారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు అంతరాత్మ ఉండదా? మీరు జీతాలు, ఇతరత్రా సౌకర్యాలు పొందుతున్నది ప్రజల సొమ్ముతోనే కదా? ముఖ్యమంత్రులు తమ జేబులో నుంచి ఇవ్వడం లేదు కదా? 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్న రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో కొంతమంది అధికారుల ప్రవర్తన ఉన్న కారణంగానే హైకోర్టుకు పనిభారం పెరిగింది. ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్‌లో బాధితులకు ఉపశమనం కలిగించే ఏకైక వ్యవస్థగా ఉన్నత న్యాయస్థానం నిలబడింది. ప్రభుత్వ నిర్ణయాలు, చర్యలపై గతంలో ఎన్నడూ లేని విధంగా లెక్కకు మించి ఫిర్యాదులు దాఖలు అయ్యాయంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడున్న పరిస్థితులలో హైకోర్టు కూడా ఆదుకోకపోతే దిక్కేమిటి? అని సామాన్య ప్రజలు భావిస్తున్నారు. మామూలుగా అయితే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత న్యాయస్థానాలు జోక్యం చేసుకోవు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నెలకొన్న పరిస్థితులను గమనిస్తున్న ఉన్నత న్యాయస్థానం ఇప్పుడు ఎన్నికల కమిషనర్‌కు తన అధికారాలను గుర్తుచేయాల్సిన దుస్థితి. ఈ పరిస్థితి ఏర్పడినందుకు రమేశ్ కుమార్‌కు సిగ్గు అనిపించడం లేదా? ఉన్నత స్థాయికి చేరుకున్న అధికారులు చరిత్రలో నిలిచిపోవాలి గానీ, చరిత్రహీనులుగా మిగిలిపోకూడదు. తమకు పోటీ వస్తారనుకునే వారు టెండర్లు దాఖలు చేయకుండా గతంలో కొందరు కాంట్రాక్టర్లు అడ్డుకునేవారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అధికార పార్టీవారు అడ్డుకుంటున్నారు. ప్రజాస్వామ్యాన్ని బాహాటంగా చెరబడుతున్న వారిపై అధికారాలు ఉండి కూడా చర్యలు తీసుకోని వ్యవస్థలు ఉన్నా ఒక్కటే, లేకపోయినా ఒక్కటే! ఈ పోకడలకు అడ్డుకట్ట పడకపోతే ఆంధ్రప్రదేశ్‌లో అరాచకం రాజ్యమేలే రోజు ఎంతో దూరంలో లేనట్టే. పట్టపగలు నడిరోడ్డుపై హత్యలు చేసినా అడ్డుకునే దిక్కు ఉండదు. ఇవ్వాళ బాధితపక్షంగా తెలుగుదేశం పార్టీ ఉండవచ్చు. రేపు ఆ స్థానంలో సామాన్య ప్రజలు ఉంటారు. ఇవ్వాళ రాజకీయ ప్రత్యర్థులను నామినేషన్లు వేయనివ్వడం లేదు. రేపు ఓటర్లను కూడా పోలింగ్ కేంద్రాలకు రానిస్తారన్న గ్యారంటీ ఏముంది? ఆంధ్రప్రదేశ్‌లో బిహార్‌ను చూస్తున్నాం అన్న వ్యాఖ్యలు రాష్ట్రానికి గర్వకారణమా? రాష్ట్ర ప్రజానీకం భయకంపితులై ఉన్నారు. సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన వాళ్లు కూడా నోరు విప్పడానికి జంకుతున్నారు. భావితరాల గురించి ఆలోచించాల్సిన బాధ్యత అందరిదీ!

> ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే పరిస్థితులు ఎలా ఉంటాయో లీలామాత్రంగా ఊహించాం గానీ.. మొత్తం వైసీపీ నాయకులంతా రౌడీలుగా ప్రవర్తిస్తారని అనుకోలేదు అని బీజేపీకి చెందిన ఒక ముఖ్యుడు కొద్ది రోజుల క్రితం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇప్పుడు చూస్తున్నది ట్రైలర్ మాత్రమేననీ, అసలు సినిమా ముందు ఉంటుందనీ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎప్పుడో చెప్పారు. అసలు సినిమా ఎంత భయానకంగా ఉండబోతుందో ప్రజలకు కూడా ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో అనుసరిస్తున్న విధానాన్ని మున్ముందు సాధారణ ఎన్నికలలో కూడా అనుసరించాలని కోరుకోరా? అందుకే కాబోలు 30 సంవత్సరాలపాటు అధికారం మాదే అని వైసీపీ నాయకులు విర్రవీగుతున్నారు.

## ఈ అరాచకం ఎందాకా?

బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న అధికారులు, వ్యవస్థల వ్యవహార శైలి ఇలా అఘోరిస్తే, అధికారంలో ఉన్న పార్టీ నాయకులకు అడ్డు ఉంటుందా? జగన్మోహన్‌రెడ్డి మరో పాతిక, ముప్పై ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉంటారని వైసీపీ నాయకులు తరచుగా ప్రకటిస్తుంటారు. 30 సంవత్సరాలు ఏమి ఖర్మ.. జీవితాంతం జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నా ఎవరికీ అభ్యంతరం ఉండదు. అయితే ప్రజల మన్ననలు పొంది ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తే, ఉన్నత సంప్రదాయాలను నెలకొల్పితే చరిత్రలో నిలిచిపోతారు. అంతేగానీ, అధికార వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని.. ప్రతిపక్షాలకు చెందిన వారిని చితకబాదుతూ కేసులలో ఇరికిస్తూ పురాణాలలో చెప్పిన రాక్షస పాలన సాగించడం వల్ల ఎంతకాలం అధికారంలో ఉంటే మాత్రం ప్రయోజనం ఏమి ఉంటుంది? వ్యవస్థలో మార్పు తీసుకురావడానికై జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించుకున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. వ్యవస్థలో లొసుగులను కడిగేయడం మంచిదే! అయితే జగన్ అండ్ కో చెబుతున్న మార్పు ఎటువంటిది అన్నదే ప్రశ్న! ఎన్నికలలో మద్యం, డబ్బు పంపిణీ జరగకూడదన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారని హోం మంత్రి సుచరిత చెప్పుకొచ్చారు. ఈ మాటలు అన్నప్పుడు ఆమెకు కూడా నవ్వు వచ్చింది. ప్రత్యర్థుల ఇళ్లల్లో అక్రమంగా మద్యం బాటిళ్లు పెట్టించి ఎదురు కేసులు పెట్టడమే ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ లక్ష్యమా? ఈ ఎన్నికలలో ఇలాంటి దృశ్యాలే ఆవిష్కృతం అవుతాయని నేను పోయిన వారమే చెప్పాను. ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగని వారిని కేసులలో ఇరికిస్తారని రుజువు అవుతోంది. రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు సగం మొత్తాన్ని జీతభత్యాల కింద పొందుతున్న వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల్లో కనీసం పిడికెడు మందికి కూడా ఆత్మసాక్షి లేదా? అధికార పార్టీ మెప్పు కోసం అడ్డమైన పనులు చేయడానికి సిగ్గు అనిపించడం లేదా? స్థానిక సంస్థలలో 90 శాతం గెలుచుకోవాలని ముఖ్యమంత్రి తన మంత్రులను ఆదేశించారు. 90 శాతం ఏమి ఖర్మ.. వంద శాతం కూడా గెలుచుకోవచ్చు. ప్రజల అభిమానం సంపాదించుకోవాలే గానీ, అడ్డదారిలో జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలు గెలుచుకుని ఏమి ప్రయోజనం? దౌర్జన్యకారులకే పదవులు కట్టబెట్టడం దేనికి సంకేతం? మీరు రెచ్చిపోండి.. ప్రత్యర్థులను చితకబాదండి.. పార్టీ నాయకత్వం మీకు అండగా ఉంటుంది.. పదవులు కట్టబెట్టి మిమ్మల్ని సత్కరిస్తాం అని ప్రకటించడం కాదా? రాజకీయ పార్టీలకు కనీస వెరపు ఉండాలి. వైసీపీ నాయకులలో ఈ వెరపు ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యమంత్రి నుంచి కింది స్థాయి వరకు అందరిదీ ఒకే ధోరణి. 'రాజ్యం వీరభోజ్యం' అన్నట్టుగా 'అధికారం వీరభోజ్యం' అని భావిస్తూ కట్టుబాట్లను దాటి మరీ ప్రవర్తిస్తున్నారు. ఒకప్పుడు ఉత్తరాది రాష్ట్రాలలో ఇలాంటి పరిస్థితులు ఉండేవి. స్వాతంత్ర్య సమరయోధులు, అభ్యుదయ భావాలున్నవారు, జాతీయ స్థాయి కమ్యూనిస్టు నాయకులతో పరిఢవిల్లిన ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి పరిస్థితులు చోటుచేసుకోవడం ఏమిటి? జగన్మోహన్‌రెడ్డి లాంటి వ్యక్తి ముఖ్యమంత్రి స్థానంలో కూర్చుంటారని మన రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరు. ఊహించి ఉంటే కట్టుబాట్లు పెట్టి ఉండేవారు. ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధి పొందుతున్న వారంతా మా పార్టీకే ఓటు వేస్తారు అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించుకున్నారు. సంతోషమే! మరి అంత నమ్మకం ఉన్నప్పుడు తన సొంత నియోజకవర్గంలో ప్రతిపక్షాలు నామినేషన్లు వేయకుండా మంత్రి అనుచరులు అడ్డుపడటం ఎందుకు? గతంలో చంద్రబాబు చేసినట్టుగా తాను ఫిరాయింపులను ప్రోత్సహించను అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శాసనసభ సాక్షిగా ప్రకటించినప్పుడు అందరూ శభాష్ అన్నారు. ఆచరణలో జరుగుతున్నది చూస్తుంటే 'ఆడవారి మాటలకు అర్థాలు వేరులే' అని ఒక సినీ కవి అన్నట్టుగా జగన్మోహన్‌రెడ్డి మాటలకు కూడా అర్థాలు వేరులే అని చెప్పుకోవలసిన పరిస్థితి. తెలుగుదేశం పార్టీకి చెందిన శాసనసభ్యులపై సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించి తనవైపు మళ్లించుకోవడాన్ని ఏమనాలి? గ్రామస్థాయి కార్యకర్తల నుంచి తలలు పండిన నాయకులను సైతం భయపెట్టి మందలో కలుపుకోవడం నీతివంతమైన రాజకీయం అని సర్దిచెప్పుకోవాలా? ఏ వ్యవస్థనూ లెక్కచేయకుండా, తాను అనుకున్న విధంగా పాలన సాగించడాన్ని నాగరిక ప్రభుత్వం అనాలా? ప్రభుత్వ నిర్ణయాలను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నిత్యం తప్పుబడుతున్నా దులుపుకొనిపోవడం మంచి ముఖ్యమంత్రినని అనిపించుకుంటానన్న జగన్మోహన్‌రెడ్డికే చెల్లుతుంది. రాజ్యసభలో అవసరాల కోసం జగన్‌కు తెరచాటు నుంచి సహకారం అందిస్తూ వచ్చిన భారతీయ జనతా పార్టీ పెద్దలకు కూడా ఇప్పుడు తత్వం బోధపడినట్టుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో జట్టుగా పోటీ చేస్తున్న జనసేన-బీజేపీ అభ్యర్థులను కూడా అధికార పార్టీ కార్యకర్తలు పలుచోట్ల చితకబాదడాన్ని చూస్తున్నాం. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధుల గురించి తరచుగా సూక్తులు చెబుతూ వచ్చిన బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు కూడా గొంతు సవరించుకోవాల్సి వచ్చింది. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని ఆయనతోపాటు మరో ఇద్దరు ఎంపీలు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కలిసి ఫిర్యాదు చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే కేంద్రం చూస్తూ ఊరుకోదనీ, కఠిన చర్యలు తీసుకుంటుందనీ జీవీఎల్ నరసింహారావు ప్రకటించారు. జగన్ ప్రభుత్వ సెగ తమకు కూడా తగలడంతో ఆయన ఇలా స్పందించి ఉంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధి ఇప్పుడు ఆయనకు గుర్తుకురాలేదేమో? ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే పరిస్థితులు ఎలా ఉంటాయో లీలామాత్రంగా ఊహించాం గానీ.. మొత్తం వైసీపీ నాయకులంతా రౌడీలుగా ప్రవర్తిస్తారని అనుకోలేదు అని బీజేపీకి చెందిన ఒక ముఖ్యుడు కొద్ది రోజుల క్రితం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇప్పుడు చూస్తున్నది ట్రైలర్ మాత్రమేననీ, అసలు సినిమా ముందు ఉంటుందనీ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎప్పుడో చెప్పారు. అసలు సినిమా ఎంత భయానకంగా ఉండబోతుందో ప్రజలకు కూడా ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో అనుసరిస్తున్న విధానాన్ని మున్ముందు సాధారణ ఎన్నికలలో కూడా అనుసరించాలని కోరుకోరా? అందుకే కాబోలు 30 సంవత్సరాలపాటు అధికారం మాదే అని వైసీపీ నాయకులు విర్రవీగుతున్నారు. 'కాకిలా కలకాలం ఉండే బదులు హంసలా ఆరు నెలలు బతికినా చాలు' అని పెద్దలు అంటూ ఉంటారు. జనరంజక పాలన ఎంత కాలమైనా ప్రజలు స్వాగతిస్తారు. మద్దతిస్తారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఎంతో కాలం పాలించలేరు. ఎంతో మంది నియంతలను చరిత్రలో చూశాం. రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలను చూసిన తర్వాత స్థానిక సంస్థలన్నింటినీ అధికార పార్టీ తన ఖాతాలో వేసుకున్నా ప్రజల మద్దతుతోనే విజయం సాధించామని గుండెలపై చేయి వేసుకుని చెప్పగలరా? "దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందకపోవడానికి కారణం అవినీతి రాజకీయ నాయకులు కాదు.. వారిని ఎన్నుకున్న ప్రజలు సరిగా లేకపోవడమే" అని అమెరికా అధ్యక్షుడిగా పనిచేసిన లబ్ధప్రతిష్ఠ నేత జాన్ ఎఫ్.కెన్నడీ అన్న మాటలు ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని చూసినవారికి గుర్తుకు వస్తే తప్పు పట్టాల్సింది ఏమీ లేదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలపైనే ఉంది. రాజకీయాలలో నిప్పులా బతుకుతూ ఆదర్శప్రాయంగా ఉంటున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు మాన్సాస్ ట్రస్ట్ వ్యవహారంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ నిందించగలిగారంటే ఏమనుకోవాలో కూడా ప్రజలు ఆలోచించుకోవాలి!

> ప్రత్యర్థుల ఇళ్లల్లో అక్రమంగా మద్యం బాటిళ్లు పెట్టించి ఎదురు కేసులు పెట్టడమే ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ లక్ష్యమా? ఈ ఎన్నికలలో ఇలాంటి దృశ్యాలే ఆవిష్కృతం అవుతాయని నేను పోయిన వారమే చెప్పాను. ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగని వారిని కేసులలో ఇరికిస్తారని రుజువు అవుతోంది. రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు సగం మొత్తాన్ని జీతభత్యాల కింద పొందుతున్న వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల్లో కనీసం పిడికెడు మందికి కూడా ఆత్మసాక్షి లేదా? అధికార పార్టీ మెప్పు కోసం అడ్డమైన పనులు చేయడానికి సిగ్గు అనిపించడం లేదా?

> స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నెలకొన్న పరిస్థితులను గమనిస్తున్న ఉన్నత న్యాయస్థానం ఇప్పుడు ఎన్నికల కమిషనర్‌కు తన అధికారాలను గుర్తుచేయాల్సిన దుస్థితి. ఈ పరిస్థితి ఏర్పడినందుకు రమేశ్ కుమార్‌కు సిగ్గు అనిపించడం లేదా? ఉన్నత స్థాయికి చేరుకున్న అధికారులు చరిత్రలో నిలిచిపోవాలి గానీ, చరిత్రహీనులుగా మిగిలిపోకూడదు. గతంలో కాంట్రాక్టర్లు తమకు పోటీ వస్తారనుకునే వారు టెండర్లు దాఖలు చేయకుండా అడ్డుకునేవారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అధికార పార్టీవారు అడ్డుకుంటున్నారు. ప్రజాస్వామ్యాన్ని బాహాటంగా చెరబడుతున్న వారిపై అధికారాలు ఉండి కూడా చర్యలు తీసుకోని వ్యవస్థలు ఉన్నా ఒక్కటే, లేకపోయినా ఒక్కటే!

# శ్రీకాకుళ విప్లవ నాయకి



విప్లవ కార్యాచరణలో పాల్గొని, నమ్మిన ఆదర్శాలు, విలువల కోసం జీవితాంతం పోరాడిన ధీర శృంగవరపు జయమ్మ. జయక్క అని గిరిజనులు ప్రేమగా పిల్చుకొనే జయమ్మ తన 68వ ఏట గత నెల 24 వేకువ జామున ఈ లోకాన్ని వీడారు.

శ్రీకాకుళం జిల్లా సోంపేట సమీపంలోని లక్కవరంలో శృంగవరపు నర్సింహులు రెండవ కుమార్తెగా 1953లో జయమ్మ జన్మించారు. నక్సల్బరీ పిలుపు విని తండ్రితో పాటు 1968లోనే దళంలో చేరిన విప్లవ స్ఫూర్తి జయమ్మది. చేరిన నెలరోజులకే తండ్రి నర్సింహులు పంచాది క్రిష్ణమూర్తితో పాటు కాల్చి వేతకు గురయ్యారు (బూటకపు ఎదురు కాల్పుల్లో ప్రాణాలు వదిలిన ఏడుగురు ప్రజావీరుల్లో ఆయన ఒకరు).

ఆ తర్వాత సుబ్బారావు పాణిగ్రాహి, పంచాది నిర్మల పోలీసులకు పట్టుబడ్డ దాడి ఘటన నుండి తప్పించుకున్న సాహసి జయమ్మ. అయితే, ఆ పట్టుబడ్డ వాళ్ళలో జయమ్మ ఉన్నట్లు పార్టీ కరపత్రం వేసిందట. దాన్ని చూసి ఇంట్లో దినవారాలు చేసారట! ఆ తరువాత ఎప్పుడో ఇంటికి వెళితే దయ్యాన్ని చూసినట్లు చూసారట! పాణిగ్రాహి తనతో చనువుగా వుంటూ తనకెంతో ఉత్సాహాన్నిచ్చి రాజకీయాలు చెప్పి తండ్రిలా ఆదరించాడని జయమ్మ తెలిపారు. దళ జీవితాన్నీ, నాయకులనూ గుర్తుకు తెచ్చుకున్నప్పుడల్లా జయమ్మ కన్నీటి పర్యమంతమయ్యే వారు. శ్రీకాకుళ విప్లవోద్యమ వివరాలను ఆమె నుంచి వినడం ఒక అనుభవం!

దళసభ్యుల సంఖ్య తగ్గుతూ పోయినా, నిలకడగా దళ జీవితాన్ని అంటిపెట్టుకొనే ఉన్నారు జయమ్మ. ఆ క్రమంలో ఒరియా, సవర భాషలు నేర్చుకోవడంలో పడిన పాట్లు, గిరిజనులు పెట్టిన పరీక్షలు, వాటిలో నెగ్గిన తీరు అన్నింటిని ఆమె ఆసక్తికరంగా వివరించేవారు. అలా సవర, ఒరియా భాషల్లో మాట్లాడ గలిగే సామర్థ్యాన్ని ఆమె సంపాదించుకున్నారు. గిరిజనులు ఆ రెండు భాషలు మాట్లాడతారు. ఇంకో విశేషమేమంటే జయమ్మ పూర్తిగా గిరిజనులతో కలిసిపోయేవారు. ఆమె కట్టూబొట్టూ, తీరూ, భాష అన్నీ గిరిజనుల జీవనశైలిలో వుండేవి.

శ్రీకాకుళ విప్లవోద్యమ చివరిరోజుల్లో దళనాయకుడైన డాక్టరు దేవినేని మల్లిఖార్జున్‌ను జయమ్మ పెళ్ళి చేసుకున్నారు. డాక్టర్ మల్లిఖార్జున్ హాస్య చతురత, సామెతలతో మాట్లాడుతూ సంభాషించే తీరును జయక్క తరచు మననం చేసుకునేవారు. 'తాను గర్భవతిని' అని తెలుసుకొని అప్పటి దళం మనుగడ రీత్యా (పిల్లల ఏడుపు దళాన్ని పట్టిస్తుందని), పెరుగుతూ పోతున్న నిర్బంధం రీత్యా గర్భాన్ని తీసివేయించుకున్న త్యాగశీలి జయమ్మ. అజ్ఞాత జీవితంలో సానుభూతి పరుల సహాయంతో ఆసుపత్రిలో ఉన్నపుడే డాక్టర్ దేవినేని మల్లిఖార్జున్ రామరాయి కొండల్లో (1970 జూలై 30న) ఎన్‌కౌంటర్ అయిన వార్త జయమ్మకు పిడుగుపాటు అయింది. అయితే చంద్రమ్మ లాంటి సహచరుల ఓదార్పుతో అతి కష్టమ్మీద మనిషి కాగలిగారు.

మరోసారి, భరించరాని కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరారు. సవరలు తినే పందిమాంసం తినడం వల్ల ప్రేవుల్లో బద్దెపురుగులు పెరిగి ఆమె బలహీనమై, అవి బలుస్తూ భరించరాని బాధపెడుతున్నాయని రిపోర్టుల్లో తేలింది. చికిత్స చేయించుకున్నాక తిరిగి ఉద్యమంలోకే వచ్చారు. సవరలు ఏది పెడితే అదే తినాలి, వేరే తిండి దొరకదు. వారితోనే జీవితం, కనాకష్టం. వారు 'క్రియారాహిత్యం' జనాలు కాదన్నది జయమ్మ నమ్మకం.

ఆ కఠోర దళ జీవితంలోనే పోతనపల్లి అప్పలస్వామి (కుమార్) జైలు నుంచి దళంలోకి వచ్చాడు. జయమ్మ తండ్రి నర్సింహులు త్యాగాన్ని, పోరాటాన్ని ఎరిగినవాడు, సన్నిహితంగా ఉండసాగాడు. ఇలా ఉండగా ఒకరోజు దళంతో నడుస్తున్నపుడు చేతిలోని బాంబుల సంచి పేలి ఒళ్ళంతా గాయాలయ్యాయి. గాజు పెంకులు ఒళ్ళంతా గుచ్చుకున్నాయి. తీస్తే మరి బతకడం కష్టమే... అప్పుడు విప్లవకారుల్ని ప్రభుత్వాలు వేటాడుతున్నాయి. వెంటాడుతున్నా చికిత్స కోసం ఏదో ఒకటి చేయాల్సిందే! ఒరిస్సాలోనూ పరిస్థితి అంతే.. ఎలాగో ప్రయత్నాలు చేసి వైద్యుడినే దళం దగ్గరకు రప్పించారు. ఆయన మందులు ఇచ్చేవారు. తోటి కామ్రేడ్స్ బైరాగి, విద్యాధర్, పండాలు జయమ్మకు ఆ మందులు వేసి చికిత్స చేసే బాధ్యత తీసుకున్నారు. గాయాల మంటలు చాలా వేధించేవి. చాలా కాలానికి గానీ జయమ్మ కోలుకోలేక పోయారు. కోలుకున్న వెంటనే మళ్ళీ దళ జీవితంలోకి వెళ్ళారు.

> శ్రీకాకుళ ఉద్యమ తొలితరం నాయకురాలు శృంగవరపు జయమ్మ. గిరిజనంలో జయక్కగా ప్రేమాదరాలు పొందిన జయమ్మ జీవితాంతం నమ్మిన విలువలు, ఆదర్శాల కోసం పోరాడారు.

1972లో జయమ్మ కుమార్‌ను వివాహం చేసుకున్నారు. గుంపు జీవితం, కలయికలు, విడివడడాలు; ఎప్పుడూ కన్నుమూయ వీల్లేని నిఘా! ఇక గిరిజనుల మధ్య.. వారి కోసం ఎన్నో పోరాటాలు.. ఎన్నో తప్పులు.. కొన్నే విజయాలు.. ఎన్నో అనారోగ్యాలు.. ఎంతో సంఘర్షణ.. ఎప్పుడూ సంచారమే జీవితం. సవర గూడేల మధ్య వాళ్ళను సంరక్షిస్తూ సంఘర్షణాత్మక జీవితం. సమావేశాలు, దళ సభ్యుల కదలికలు, శత్రువు నిఘా కన్ను లాంటి వేలాడే ఖడ్గం లాంటి రాజ్య నిర్బంధం కింద బతుకు. క్షణక్షణ గండం ! జయక్క అన్నిటినీ తట్టుకుని నిలిచారు. విప్లవాన్ని తలపై మోశారు. ఈ ఐదు దశాబ్దాల్లో, విప్లవ రాజకీయ పార్టీ కల్లోలాల్లో కూడా ఆమె పార్టీలో మిగిలి ఉండటమే అనూహ్యం.

కుమార్‌తో పెళ్ళి తర్వాత జయమ్మకు పాప పుట్టింది. పాపకు లక్ష్మి అని పేరు పెట్టారు. సంచార దళ జీవితంలో శిశువును పెంచడం సాధ్యం కాదు. ఏం చేద్దామన్న ప్రశ్న. కమిటీలో చర్చ జరిగింది. చివరికి పిల్లలు లేని సవర దంపతులకి లక్ష్మిని ఇచ్చేయాలన్న నిర్ణయం జరిగింది. అలా తొలిచూలు బిడ్డను అప్పజెప్పిన కన్నకడుపు జయమ్మది. ఆ పిల్లకు చదువుకునే అవకాశంలేదు. దట్టమైన కొండల మధ్య జీవితం. సవరల మధ్య సవరగా పెరిగి పెద్దదై సవర యువకుడిని పెండ్లి చేసుకున్నది. మళ్ళీ కొడుకు పుట్టినపుడూ ఎవరికో ఇచ్చేయడమే! అన్నట్లు ఆ పిల్లవాని పేరు తెలుసా? మల్లిఖార్జున్. భార్యాభర్తలిద్దరూ ఆ పేరును ఇష్టపడి కొడుక్కిపెట్టుకున్నారు.

కుమార్, జయమ్మల మార్గదర్శకత్వంలో కొండలోగాం, కొంకడపుట్టి, లొత్తూరు, అక్కుపల్లి దగ్గర దిబ్బలు, 300 ఎకరాల గిరిజనేతరుల భూములను గిరిజనులు, పేదలు సాధించుకొని నేటికీ అనుభవిస్తున్నారు. ఆ భూపోరాటాల క్రమంలోనే 1998 సెప్టెంబరు 10న కుమార్ 'ఎదురు కాల్పుల' కు గురయ్యాడు. అంతకు కొంతకాలం ముందు నుంచి జయమ్మ బహిరంగంగా ఉంటూ పార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. జీవితాంతం పార్టీలోనే ఉన్నారు. ప్రజల కోసం నిలబడే ఉన్నారు. విప్లవ లక్ష్యం కోసం చివరికంటా పోరాడిన శ్రీకాకుళం తొలితరం విప్లవ నాయకురాలు జయమ్మకు విప్లవ జోహార్లు.

□ డాక్టర్ ముత్యం

(నేడు శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడులో జయమ్మ స్మారక సభ)

## అమరజీవి స్ఫూర్తితో ..



స్వాతంత్ర్య సమరయోధుడు జతిన్ దాస్ తరువాత అత్యంత సుదీర్ఘ కాలం నిరాహార దీక్ష చేసిన వారు అమరజీవి పొట్టి శ్రీరాములు ఒక్కరే. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేశారాయన. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే ప్రత్యేక ఆంధ్ర ఉద్యమానికి పునాదులు పడ్డాయి. 1912లో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ప్రస్తావన వచ్చింది. 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాష్ట్రాల విభజనను ఏ ప్రాతిపదికన నిర్ణయించాలనే అంశంపై నాటి కేంద్ర ప్రభుత్వం చర్చలు చేసింది. అవిభక్త మద్రాసులో వున్న తెలుగు వారు ఎప్పటినుంచో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోరుకుంటున్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకొని కొందరు జాతీయ నాయకులు ప్రత్యేకాంధ్ర వైపు మొగ్గుచూపారు. అయితే, నాయకుల మధ్య అనైక్యత వల్ల 1952 వరకు ప్రత్యేకాంధ్ర కార్యరూపం దాల్చలేదు. పొట్టిశ్రీరాములు గాంధీజీ మార్గంలో పయనించి 1952 అక్టోబర్ 19న మద్రాసులో మహర్షి బులుసు సాంబమూర్తి ఇంటి వద్ద ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. దేశవ్యాప్తంగా ఎందరో జాతీయోద్యమనాయకులు ఈ దీక్షను సందర్శించారు. మద్దతుగా మరెంతో మంది ఆందోళనలు చేశారు. అయినా ప్రభుత్వం తేల్చలేదు. 58 రోజుల పాటు దీక్ష కొనసాగించి డిసెంబర్ 15న అసువులు బాశారు. ఆయన ప్రాణ త్యాగంతో దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరిచింది. కర్నూలులో రాష్ట్ర రాజధాని ఏర్పాటు చేయగా, గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేశారు. భాషా ప్రాతిపదికన ఏర్పడిన తొలి రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం ప్రసిద్ధి పొందింది. 1956లో ఆంధ్ర, తెలంగాణలను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. పొట్టి శ్రీరాములు చిన్నతనంనుండే గాంధీజీ ఆశయాలను పుణికిపుచ్చుకుని దేశభక్తితో ఉద్యమాల్లో పాల్గొన్నారు. 'శ్రీరాములు వంటి మరో పది మంది సహచరులు నాకు లభిస్తే ఒక్క సంవత్సరం లోనే బ్రిటిష్ వారి నుండి భారతదేశానికి విముక్తి కల్గించగలనని' గాంధీజీ అన్నారంటే ఆయన ఎంతటి ఉద్యమశీలి అనేది అర్థమవుతుంది. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి నడుం బిగించాలి.

– యం. రాంప్రదీప్

(మార్చి 16న పొట్టి శ్రీరాములు జయంతి)

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
ఆదివారం ● 15 మార్చి 2020
navya@andhrajyothy.com

Star Talk

# నేనూ... కొన్ని తప్పులు చేశా!

**పదిహేనేళ్ళ క్రితం... ఆమె ఓ వర్ధమాన హీరోయిన్.**
**హైదరాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్ పెంట్ హౌస్ నివాసం.**
**వానలో తడిసొచ్చిన అపరిచిత అతిథికి స్వయంగా వేడి టీ చేసి ఇచ్చిన మంచితనం.**
**కట్ చేస్తే... ఇప్పుడామె దేశమంతటికీ తెలిసిన దేవసేన... తెలుగింటి రుద్రమదేవి... బాక్సాఫీస్ భాగమతి.**
**నాయికా ప్రధాన చిత్రాలంటే... అందరూ చూపించే అరుంధతి.**
**పెరిగిన వయసు, వచ్చిన సూపర్ స్టార్‌డమ్... ఆమె పలకరింపులో మార్పు తేలేదు.**
**మునుపటి ఆప్యాయత, ఆతిథ్యం మారలేదు. అహంకారం అసలే రాలేదు.**
**అనుష్కా శెట్టి...**
**మంచితనం... స్టార్ హోదా మింగేయని సంస్కారం మేళవించిన అరుదైన నటి.**
**పదిహేనేళ్ళలో... ఎన్నో పాత్రలు, ఎందరో మంచి వ్యక్తులు, ఎన్నో జయాపజయాలు...**
**అన్నిటి నుంచి ఎంతో నేర్చుకున్నా అంటారామె. ఎదురైతే తానే పలకరించి యోగక్షేమాలు కనుక్కుంటారు.**
**మంచి నటిగా కన్నా మంచి మనిషిగా బతకడం ముఖ్యమంటున్న 'స్వీటీ'తో...**
**సమయం తెలియకుండా.. గడిచిపోయిన ఓ సాయంకాలపు భేటీ... ఈ వారం 'నవ్య' స్పెషల్.**

● రెంటాల జయదేవ, సత్య పులగం



**అనుష్క:** హాయ్ అండీ! బాగున్నారా... చాలా రోజులైంది కలసి!

**బాగున్నాం. మీరెలా ఉన్నారు? ఈ మధ్య బొత్తిగా జర్నలిస్టులతో ఇంటర్వ్యూలు లేవు.**

(నవ్వేస్తూ...) ఆ మధ్య వర్క్ నుంచి కొద్దిగా బ్రేక్ తీసుకున్నా. అందుకే, కనపడలేదు. దురదృష్టం ఏమిటంటే, ఇవాళ ఎవరూ అవతలివాళ్ళను ఆప్యాయంగా పలకరించడం కరవైంది. కనపడితే చాలు... వృత్తి ఉద్యోగాల కబుర్లు, ఆ సక్సెస్‌లు ఫెయిల్యూర్ల ప్లాస్టిక్ ముచ్చట్లే. అవతలివాళ్ళ గురించి అక్కర తగ్గిపోయింది. మళ్ళీ మనం వెనక్కి వెళ్ళి, యోగక్షేమాలు కనుక్కొనే పద్ధతిలోకి వెళ్ళాలి.

**మీ దృష్టిలో ఆరోగ్యం అంటే...?**

శారీరకంగా, మానసికంగా, భావోద్వేగాల పరంగా సమతూకంతో ఉంటేనే ఆరోగ్యంగా ఉన్నట్టు లెక్క. యోగా కూడా చెప్పేది అదే. మనం తీరిక లేని జీవితం గడుపుతూ, ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తే, చివరకు ఏదైనా జరిగితే అది మన కుటుంబానికే నష్టం. అందుకే, ఆరోగ్యం పట్ల చైతన్యం, రోగ నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యం. పిల్లలకవి నేర్పించాలి.

**ఇటీవల ఆరోగ్యానికి సంబంధించి ఇంగ్లీషు పుస్తకానికి మీరు సహరచయితగా వ్యవహరించారు.**

లూక్ కుటీనో ప్రముఖ హోలిస్టిక్ లైఫ్‌స్టైల్ కోచ్. హోలిస్టిక్ న్యూట్రిషనిస్టు. ఇవాళ ప్రపంచమంతటా ఒకటే మాట - 'బరువు తగ్గాలి' అని. 'సైజ్ జీరో' చిత్రం కోసం నేను ఏకంగా 20 కిలోలు పెరిగా. సహజమైన పద్ధతిలో, కేవలం జీవనశైలిని మార్చుకోవడం ద్వారా ఎలా బరువు తగ్గవచ్చో చెప్పడానికి 'ది మ్యాజిక్ వెయిట్ లాస్ పిల్' పుస్తకం రాశాం. అందులో నా అనుభవాలను పంచుకున్నా.



**చాలామంది తారలను అనుసరించాలని చూస్తుంటారు..**

ప్రతి ఒక్కరికీ తమదైన పర్సనాలిటీ ఉంటుంది. అది మర్చిపోయి, ఫలానా నటిలానో, నటుడిలానో ఉండాలనుకోవడం తప్పు. నటన నా వృత్తి. అయితే, నేను బయట కూడా హీరోయిన్‌లా ఉంటాననీ, ఉండాలనీ అనుకొంటే పొరపాటు. నాతో సహా ప్రతి మనిషికీ కష్టం, సుఖం, డిప్రెషన్ సహజం. అది గ్రహించక, ప్రతి ఒక్కళ్ళూ అవతలి వాళ్ళలా ఉండాలనుకోవడం మూర్ఖత్వం.

**స్టార్‌డమ్ వచ్చినా మీరిలా ఉన్నారే!**

తొలిచిత్రం 'సూపర్' చేస్తున్నప్పుడే, హీరో నాగార్జున గారు జీవితంలోనూ, కెరీర్‌లోనూ ఎన్నో అప్స్ అండ్ డౌన్స్ వస్తాయి. సక్సెస్ వచ్చిందని గాలిలో తేలిపోకుండా, ఫెయిల్యూర్ ఎదురైందని కుంగిపోకుండా నేల మీద నడవాలని చెప్పారు. ఆ మాట పాటిస్తుంటా. 'అరుంధతి' పాత్ర చూసి, నేను అలా ఉంటాననుకొంటే ఎలా? తెరపై చూసినది దర్శక, రచయితలు రాసిన ఆ పాత్ర తాలూకు బలం. అంతే తప్ప, అది నేను కాదు. ఆ పాత్ర నుంచి నేనెంత హుందాగా బయటకు వచ్చి, అన్నిటినీ ఎంత పాజిటివ్‌గా ఎదుర్కొంటానన్నది కీలకం. ఎప్పటి కప్పుడు అలా ఉన్నదీ లేనిదీ రియాలిటీ చెక్ చేసుకుంటా. అయితే, అది చెప్పినంత సులభం కాదు. ఆచరణలో పెట్టడానికి ఆత్మీయుల సపోర్ట్ సిస్టమ్ కావాలి.



## స్టార్‌ను కాదు... స్వీటీని!

**మీ ఫ్యామిలీ గురించి...**

నాకు ఇద్దరు అన్నయ్యలు. ఇంట్లో నేనే చిన్నదాన్ని. నా బ్రదర్ ఒకరు డెంటిస్ట్. చిన్నప్పుడు ప్రతి ఆడపిల్లలానే నాకూ మా నాన్న గారు హీరో. పరిణతి వచ్చాక అమ్మను అమ్మగా, నాన్నను నాన్నగా - ఎవరి ప్రాధాన్యం వారిదేనని అర్థం చేసుకున్నా. మా ఫ్యామిలీ అంతా కలిసినప్పుడు కబుర్లు చెప్పుకుంటాం. అన్ని విషయాలూ మాట్లాడుకుంటాం... సినిమా గురించి తప్ప! నా సినిమాలు, పనిలో మా ఫ్యామిలీ జోక్యం చేసుకోదు. వాళ్ళ దృష్టిలో నేను స్టార్‌ను కాదు... ఇంట్లోని స్వీటీని!

**'బాహుబలి' లాంటివి చూసినప్పుడు ఏమంటారు?**

'అరుంధతి'లో, 'బాహుబలి'లో యంగ్ దేవసేన పాత్రలో చూడడం అమ్మకు ఇష్టం. చిన్నతనం నుండి నన్ను అందంగా ముస్తాబు చేసి, నగలు పెట్టాలనుకునేది. కానీ ఎక్కువ నగలు వేసుకోవడం నాకిష్టం ఉండదు. అందుకని, వేసుకునేదాన్ని కాదు. అటువంటి పాత్రల్లో నన్ను చూడగానే 'చిన్నప్పుడు వద్దనేదానివి. ఇప్పుడు వేసుకుంటున్నావ్ చూడు' అంటుంది. తల్లులు ఎవరికైనా పిల్లలు అలా కనిపిస్తే ఇష్టమేగా!

**కష్టమొచ్చినా, సుఖమొచ్చినా ఎవరితో పంచుకుంటారు?**

నా కుటుంబ సభ్యులు, యోగా మిత్రులు, నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి, అన్నపూర్ణా స్టూడియోస్ సుప్రియ, స్టైలిస్ట్ ప్రశాంతి తిపిర్నేని, రాజమౌళి భార్య రమ, కీరవాణి గారి సతీమణి వల్లి, యు.వి. క్రియేషన్స్ ప్రమోద్, వంశీ, హీరో రానా - ఇలా చాలామంది ఆత్మీయులు. నా కష్టసుఖాల్లో వాళ్ళు నాకు అండగా ఉంటారు.

**ముందు మీరు యోగా టీచర్. ఇప్పటికీ టచ్‌లో ఉన్నారా?**

ఇప్పటికీ గురువు భరత్ ఠాకూర్ యోగా స్టూడెంట్‌నే! ఆయన నేతృత్వంలో యోగా నేర్పేదాన్ని. ఇప్పటికీ యోగా మిత్రులను కలుస్తుంటా. వీలున్నప్పుడు మా గురువు గారిని చూస్తా. దుబాయ్‌లో, ముంబయ్‌లో ఉన్న ప్రేరణ, ప్రియాంక లాంటి నా యోగా మిత్రులతో టచ్‌లో ఉన్నా. సినిమాల్లో నటించడం కోసం హైదరాబాద్‌కు రాగానే నన్ను వాళ్ళ ఇంట్లో పెట్టుకున్న నా యోగా ఫ్రెండ్ వందన, ఆమె భర్త అమిత్‌లను ఎప్పటికీ మర్చిపోలేను.

**ఇప్పటికీ యోగాభ్యాసం చేస్తుంటారా?**

ధ్యానం, యోగాసనాలు చేస్తూనే ఉంటా. ఆత్మావలోకనం చేసుకుంటూ ఉంటా. జీవితంలో మన అంతరంగంతో మనం పోరాడడం కష్టం. పరిపూర్ణత సాధించకపోయినా, ఆ మార్గంలో పయనిస్తున్నా.

**సినిమాల్లో పదిహేనేళ్ళ ప్రయాణం ఎలా ఉంది?**

జీవితంలో పదిహేనేళ్ళంటే పెద్ద భాగం. తలచుకుంటే ఆశ్చర్యం, భయం వేస్తున్నాయి. మాది సంప్రదాయ కుటుంబం. సినీ రంగంలోకి వస్తానని అనుకోలేదు. వచ్చేటప్పటికి నాకు ఏమీ తెలీదు. అంతా కొత్తే. కానీ, ఈ టైమ్‌లో ఎంతోమందిని కలిశా. ఎంతో నేర్చుకున్నా. అందరూ నాకెంతో అండగా నిలిచారు. మొదటి సినిమాకు తొలిసారి ఫోటోషూట్ చేస్తున్నప్పుడు, 'తల పై కెత్తండి' (ఛిన్ అప్) అని కెమెరామన్ చెబితే, యోగాలో లాగా మెడ పూర్తిగా పైకెత్తి ఆకాశంలోకి చూశా. సినిమాల గురించి ఏమీ తెలియని అంత అమాయకంగా ఉండేదాన్ని. అలాంటి అమ్మాయిని ఇంత దూరం రావడం నాకే ఆశ్చర్యంగా ఉంది.

**ఈ క్రమంలో మీకు మరపురాని తీపి, చేదు జ్ఞాపకాలు?**

జేజమ్మ (అరుంధతి), దేవసేన (బాహుబలి), రుద్రమ దేవి లాంటి పాత్రలు, 'సైజ్ జీరో', 'వేదం' లాంటి సినిమాలు చేయడం మరపురాని అంశాలు. అదే సమయంలో కొన్నిసార్లు సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఉత్సాహంగా చేసిన పనులతో గాయాల పాలయ్యా. తమిళ 'సింగం' చిత్రం చేస్తున్నప్పుడు మంచులో కాలు ఇరుక్కు పోయి, బ్యాక్ ఇంజ్యూరీ అయింది. అదే సమయంలో 'బాహుబలి', 'రుద్రమదేవి' లాంటి చిత్రాలు చేస్తున్నా. కొన్నిసార్లు మన శారీరక సామర్థ్యం తగ్గిపోయినా, తప్పక చేయాల్సి వస్తుంది. ఉదాహరణకు, కత్తితో యుద్ధం చేసే సన్నివేశాలు చేయాల్సి వస్తుందనుకున్నప్పుడు, మణికట్టు బలంగా ఉండేలా ముందుగా కసరత్తులు చేయాలి. లేదంటే గాయం పాలవుతాం. బెటర్ సెన్స్ ఆఫ్ అండర్ స్టాండింగ్ లేకుండా బరిలోకి దిగితే, ఇబ్బందే అని గ్రహించా. అవి జరిగినప్పుడు నిస్పృహలోకి జారిపోతాం. కానీ, ఇదేమీ జగత్ప్రళయం కాదనే అవగాహనతో, బయటకు రావాలి. అవగాహన లేక, తెలియనితనంతో కొన్ని తప్పులు నేనూ చేశా. (నవ్వుతూ...) తప్పు చేస్తేనే కదా... ఒప్పు ఏదో తెలుస్తుంది.

**ఈ క్రమంలో భావోద్వేగానికి గురైన సందర్భాలున్నాయా?**

స్వతహాగా సున్నిత మనస్కురాలిని. ఒడుదొడుకులు ఎదురైనప్పుడు ఎమోషనల్‌గా బ్రేక్ డౌన్ అయిన సందర్భాలున్నాయి. హోదా, వయసు, జెండర్‌తో సంబంధం లేకుండా ఎవరికైనా జీవితంలో అలాంటి క్షణాలుంటాయి. వాటి నుంచి మనకు మనమే బయటకు రావాలి.

**'బాహుబలి' తరువాత ఆశ్చర్యంగా సినిమాలు తగ్గించారే?**

పరుగు కొద్దిగా ఆపి, విరామం తీసుకోవాలనుకున్నా. నాతో నేను, నా వాళ్ళతో నేను గడపాలనుకున్నా. నా గాయాలు, నా ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలనుకున్నా. కానీ, స్టార్ హోదా నుంచి లబ్ధి పొందాల్సిన టైమ్ ఇదే కదా అని చాలామంది నన్ను మందలించారు. కానీ, నా దృష్టిలో ఒకటే - నాకు ఇంత పేరు, ప్రేమ, జీవనోపాధి ఇచ్చిన సెట్ పవిత్ర స్థలం. అక్కడకు పూర్తి సామర్థ్యంతో, ఆనందంగా వెళ్ళాలి. అన్ని విషయాలూ మర్చిపోయి, హ్యాపీగా పని చేయాలి. అంతేకానీ, మొక్కుబడిగా కాదు. తెలిసి ఏ తప్పూ చేయకూడదు. చేసే పనిలో మానసిక ఆనందం లేనప్పుడు ఆ పని వదిలేసి, కొత్తది వెతుక్కోవాలి అనేది నా సిద్ధాంతం.

**కానీ, కెరీర్, సంపాదన ముఖ్యం కాదంటారా?**

ముఖ్యమే. సంపాదన కూడా ముఖ్యం. ఒంట్లో బాగా లేకపోయినా, మనసు బాగా లేకపోయినా కేవలం ఆర్థిక సమస్యల రీత్యా పనిచేయాల్సి వచ్చే ఎంతోమంది ఉన్నారు. అందుకే, ప్రతి ఒక్కరికీ కనీసపాటి సోషల్ సెక్యూరిటీ ఉండాలి. కూడు, గూడు, ఆరోగ్యం లాంటి కనీస అవసరాలు తీరాలి. అవి తీరాక దేని వెనుకో పరుగులు తీయవద్దు.



**అవసరాలు తీరనివారిని చూసినప్పుడు ఏమనిపిస్తుంది?**

బాధ కలుగుతుంది. ఏమైనా చేయాలనే ఆలోచనలు వస్తాయి. కానీ, పరిస్థితిని పూర్తిగా మార్చే శక్తి సామర్థ్యాలు నాకు లేవు. నా పరిమితులు నాకున్నాయి. అయితే, నా దృష్టికి వచ్చినవారికి కుదిరితే సాయం చేస్తా. అయితే, ఐ బిలీవ్ ఇన్ ఎంపవరింగ్ పీపుల్. పిల్లలను స్పందించే హృదయమున్న వ్యక్తులుగా తీర్చిదిద్దాలనుకుంటాను.

**మీ పిల్లల్ని అలా తీర్చిదిద్దుతారా?**

నేను గనక తల్లిని అయితే, కచ్చితంగా పిల్లల్ని అలానే పెంచుతా. మా అమ్మానాన్న నన్ను అలానే పెంచారు.

**మరి మీ పెళ్ళి గురించి, మీ ఆరోగ్యం గురించి రకరకాల వార్తలు వచ్చినప్పుడు మీ మానసిక స్థితి?**

(గంభీరంగా...) ఎవరి గురించైనా రాసే ముందు... అలా ఎవరైనా మీ గురించి రాస్తే ఎలా ఉంటుందో ఊహించుకోండి. అవతలివాళ్ళకు నువ్వు చేసినది నీకు జరిగితే ఎలా ఉంటుందో ఆలోచించుకొమ్మని చిన్నప్పటి నుంచి మా నాన్న గారు చెప్పేవారు. అదే నేను పాటిస్తుంటా. అందుకే, నేను పేపర్లు చదవను. టీవీ చూడను. నెగటివ్ వార్తలు చదవాలనుకోను. ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి దేనిలోనూ లేను. నా సంగతి తెలిసిన నా మిత్రులెవరూ నాకు అలాంటివి వాట్సప్‌లో కూడా పంపరు. వాళ్ళ ఇంట్లో ఎవరికి ఆరోగ్యం బాగలేదో పట్టదు కానీ, అనుష్క ఆరోగ్యం బాలేదట లాంటివి రాయడం, చదవడం దురదృష్టకరం.

**రాఘవేంద్రరావు కుమారుడు ప్రకాశ్‌తో మీ పెళ్ళట!**

బబ్లూ (ప్రకాశ్) నాకు ఫ్రెండ్. పెళ్ళి అని రాసేస్తే ఎలా? అంతకు ముందు హీరోలతో, క్రికెటర్లతో పెళ్ళని రాశారు.

**నిప్పు లేకుండా పొగ రాదుగా!**

కానీ, (నవ్వుతూ...) ఇక్కడ నిప్పు లేకపోయినా పొగ కూడా వాళ్ళే పుట్టించేస్తున్నారు.

**నిజమేమిటో మీరే చెప్పండి. మీ పెళ్ళెప్పుడు?**

పెళ్ళి చేసుకుంటున్నప్పుడు కచ్చితంగా తెలియజేస్తా. అందరినీ పిలిచి బాహాటంగా జరగకపోవచ్చేమో కానీ, దొంగ చాటుగా అయితే నా పెళ్ళి జరగదు. ఇద్దరు కలసి జీవించే వివాహ బంధమనేది అందమైన రిలేషన్ షిప్. బ్యూటిఫుల్ ఎమోషన్. ఆ బంధం మీద నాకు నమ్మకం ఉంది. కానీ, నాకు నచ్చిన, తగిన మనిషి ఎదురవ్వాలి కదా! అలాంటి వ్యక్తి తారసపడినప్పుడు తప్పక చేసుకుంటా.

**అమ్మానాన్న చూపించినవాణ్ణే చేసుకుంటానన్నారట!**

అది కూడా గాలి వార్తే. నేను ఆ మాట అనలేదు. ఎక్కడెక్కడో ఏవేవో మాటల్ని కలిపి, నేను అన్నట్టుగా రాసేశారు. మా కజిన్స్‌కు 20 - 24 ఏళ్ళకే పెళ్ళి అయిపోయింది. ఆ లెక్కన నాకు ఇరవైకే చేసేసేవారు. నా అభిప్రాయం తెలిసి, వాళ్ళూ బలవంత పెట్టడం లేదు. లేదంటే, అందరూ బలవంతపెట్టారని గ్రీన్ మ్యాట్ ముందు నిలబడి, ఫోటోలకు పోజులిచ్చి, మీకు నచ్చిన వరుడి బొమ్మ పెట్టుకోమనాలి (నవ్వులు...).

**కానీ 'సైజ్ జీరో' తరువాత వెయిట్ లాస్ కోసం విదేశాలు వెళ్ళారని వార్త. లూక్‌తో పుస్తకం అందువల్లే...**

దానికీ, లూక్‌తో పుస్తకానికీ సంబంధం లేదు. ఆరోగ్యం గురించి మా ఇద్దరి ఆలోచన, అభిప్రాయాలు ఒకటే. అప్పుడు ఆయన తన పుస్తక రచనలో భాగమవుతారా అడిగితే, నేను అందులో నా అనుభవాలు పంచుకున్నా. అంతే.



"సక్సెస్ ఫార్ములా నాకు తెలుసనుకోవడం లేదు. సినిమా సక్సెస్ అవుతుందా! డిజాస్టరా అనేది ఎవరికీ తెలీదు. కానీ, నిజాయతీగా కష్టపడి పని చేయడాన్ని నమ్ముతా. మన ఉద్దేశం సరైనదై ఉండాలి. చేసే ప్రయత్నం సరిగ్గా ఉండాలి. అన్నిటికీ మించి కష్టపడి పని చేయాలి. అప్పుడు కచ్చితంగా దానికి ఫలితం ఉంటుంది."

### వాళ్ళే లేకపోతే...!

"ఇన్నేళ్ళున్నానంటే నాకు మంచి అవకాశాలిచ్చిన ప్రతి ఒక్క దర్శకుడి పాత్రా ఉంది. నాటి పూరీ నుంచి నేటి హేమంత్ దాకా అందరూ నన్ను తీర్చిదిద్దారు. వాళ్ళే లేకపోతే నేను లేను!"

**షూటింగు లేనప్పుడు ఏం చేస్తుంటారు?**

ట్రావెలింగ్ అంటే ఇష్టం. సన్నిహిత వ్యక్తులను కలుస్తుంటా. సినిమాలు చూస్తా. కొన్నిసార్లు ఏమీ చేయను... ఖాళీగా కూర్చొని ఉంటా. కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తా. వ్యక్తిగత విషయాలు కొన్నిటిని బయటకు చెప్పడానికి ఇష్టపడను.

**పదిహేనేళ్ళ క్రితం మీ శ్రీనగర్ కాలనీ అపార్ట్‌మెంట్లో చాలా పుస్తకాలు కనపడేవి. ఇప్పటికీ బాగా చదువుతారా?**

పుస్తకాలు చదువుతా. అయితే... అవన్నీ నాన్ ఫిక్షన్ బుక్స్. నేను చదివిన సెమీ ఫిక్షన్ బుక్ 'ది ఆల్కెమిస్ట్'. ప్రకాష్ కోవెలమూడి మాజీ సహచరి కణికా ధిల్లాన్ రాసిన 'డ్యాన్స్ ఆఫ్ దుర్గ' చదివా. ప్రస్తుతం రెండు, మూడు పుస్తకాలు చదువుతున్నా. ఎక్కువ కిండిల్‌లో చదువుతా. (నవ్వుతూ...) ఆ పుస్తకంలో కొన్ని, ఈ పుస్తకంలో కొన్ని పేజీలు అందులో సేవ్ చేసుకుంటా.

**హిందీ చిత్రాలకు కణికా కథలు అందిస్తున్నారు. ఆవిడ మీ స్నేహితురాలే. హిందీలో నటించమని అడగలేదా?**

నో! ఇట్స్ ఎగైన్ కంటెంట్ కదా! అన్నిటి కంటే ముందు... 'బాహుబలి' పూర్తయ్యాక బ్రేక్ తీసుకున్నా. ఏదైనా మంచి కథ వస్తే హిందీలో నటించడానికి సిద్ధమే. బాలీవుడ్‌కే కాదు హాలీవుడ్‌కూ నేను వ్యతిరేకం కాదు (నవ్వులు).

**తెలుగు, తమిళం తప్ప మీరు సినిమాలు చేసినట్టు లేరు!**

టైమ్ లేదండి! నా దృష్టిలో సినిమా అంటే - ఓ మంచి కథ చెప్పడం! ఆ కథను చెబుతూ ఎంతోమంది ప్రేక్షకులకు చేరువ కావాలి. అందుకే, బాలీవుడ్, కాలీవుడ్, టాలీవుడ్ అనేవి నమ్మను. మంచి కథలలో నటించాలను కుంటా. ఎంత ఎక్కువమందికి చేరువ కాగలననేది చూస్తా.

**చాలాసార్లు మీకు షాట్ లేకున్నా అబ్జర్వ్ చేస్తుంటారే!**

నాకు అబ్జర్వ్ చేయడం, అలా చూస్తూ ఉండడం ఇష్టం. సినిమా మేకింగ్ అనేది మ్యాజికల్. షూటింగ్‌లో 24 క్రాఫ్టుల వాళ్ళూ కలిసి పని చేస్తారు. అవన్నీ అబ్జర్వ్ చేస్తా. షూటింగులో ఎంతసేపు కూర్చున్నా నాకు బోర్ కొట్టదు.

**ఆ ఆసక్తిని ముందుకు తీసుకువెళ్ళి డైరెక్టరవుతారా?**

ఫస్ట్... నేను యాక్టర్‌ని. నా మొదటి ఎజెండా అదే. అంతేకానీ, తెరపై కథలు చెప్పాలని అనుకోవడం లేదు.

**ఇంతకీ, మరో పదిహేనేళ్ళ తర్వాత అనుష్కను ఎలా చూడొచ్చు? నటిగా, నిర్మాతగా, కేవలం గృహిణిగా?**

(ఒక్క క్షణం ఆగి...) ఏమోనండీ! నటిగానే చూస్తారని ఆశిస్తున్నా. ఒకటి మాత్రం తెలుసు... నేను ఏం చేసినా ఎంజాయ్ చేస్తూ చేస్తా. చేస్తున్న పనిలో సంతోషం లేకపోతే... నన్ను సంతోషపెట్టే పని మరొకటి చేస్తా.

**నటనలో సంతోషం తగ్గితే, సినిమాలు మానేస్తారా?**

ఒకవేళ నేను ఎంజాయ్ చేయలేకపోతే... ఇదే కాదు, ఏ పనీ చేయను. నేను యోగాకి వెళ్ళినప్పుడు జీవితాంతం అదే చేద్దామను కున్నా. ఇంట్లో కూడా 'నేను యోగా టీచర్‌ని కావాలను కుంటున్నా' అని చెప్పా. ఇంతలో సినిమాలు చేసే అదృష్టం దక్కింది. ఇప్పుడు యాక్టింగ్ ఎంజాయ్ చేస్తున్నా. వేరే విషయాల గురించి ఆలోచించడం లేదు. వ్యక్తిగతంగా చాలా నేర్చుకోవాలనుకుంటున్నా. వృత్తి మాత్రం నటనే!

**ఏం నేర్చుకోవాలనుకుంటున్నారు?**

కొన్నిసార్లు ఫోటోగ్రఫీ నేర్చుకోవాలని ఉంది.

**'నిశ్శబ్దం' చిత్రంలోని మూగ, చెవుడు చిత్రకారిణి పాత్ర కోసం పెయింటింగ్ నేర్చుకున్నారట?**

క్యారెక్టర్‌కి అవసరమైనంత మేర పెయింటింగ్‌తో పాటు సైన్ లాంగ్వేజ్ (సైగలతో మాట్లాడడం) నేర్చుకున్నా. ఇప్పుడు పూర్తిగా సైన్ లాంగ్వేజ్ నేర్చుకోవాలనుకుంటున్నా. మాటలు రాని వాళ్ళతో మాట్లాడడానికి అదొక అందమైన భాష. వ్యక్తిగత సంతృప్తి కోసం తప్పక నేర్చుకుంటా.

**'వేదం'లో వేశ్య. 'రుద్రమదేవి'లో వీరనారి. 'నిశ్శబ్దం'లో చెవిటిమూగ అమ్మాయి. 'సైజ్ జీరో'లో లావాటి అమ్మాయి. ఇలాంటి పాత్రలు చేయడానికి మీ ధైర్యం ఏంటి?**

(వెంటనే అందుకొని...) అది ధైర్యం అంటారా? స్టుపిడిటీ అంటారా? (నవ్వులు). ఏమో... నాకు ఏమీ తెలీదు. నేను వెళ్ళి నటించాను అంతే. అలా చేయడం వల్ల నాకు మంచి జరిగిందా? లేక నేను కిందకు జారానా? తెలియదు! సైజ్ జీరో చేసినప్పుడు ఆ పాత్ర కోసం 20 కిలోలు పెరిగా.

## వీటిలో ఏవీ మరచిపోలేను!

"జయాపజయాలతో సంబంధం లేకుండా నాకు గుర్తుండిపోయిన పాత్రలు చాలానే ఉన్నాయి. తొలి చిత్రం 'సూపర్'లోని గ్లామర్ పాత్ర సాషా నుంచి రానున్న 'నిశ్శబ్దం'లోని చెవిటి, మూగ అమ్మాయి పాత్ర సాక్షి వరకు ఆ జాబితా పెద్దదే. 'అరుంధతి'లో జేజమ్మ, 'వేదం'లో వేసిన వేశ్య పాత్ర సరోజ, 'పంచాక్షరి'లో, 'భాగమతి'లో టైటిల్ రోల్స్, 'బాహుబలి'లో దేవసేన - ఇలా ఎన్నో! వీటిలో ఏవీ నేను మరచిపోలేను. ఈ పదిహేనేళ్ళ ప్రయాణం, అందులో నాకు దక్కిన ఈ గుర్తింపు ఈ పాత్రలు, సినిమాలన్నిటి సమ్మేళనమే!"

చాలామంది 'నీకు పిచ్చి పట్టిందా? ఆరోగ్యం పాడవుతుంది' అని చెప్పారు. కానీ, నేను ఆ సినిమా చేశా. నా మనసు చెప్పిన మాట విన్నాను. సినిమా చేసినందుకు నేనేమీ చింతించడం లేదు. ఎటువంటి బాధా లేదు.

**కానీ, వచ్చే పరిణామాల తాలూకు బాధ మాటేమిటి?**

ఆ సినిమా చేయాలనే నిర్ణయం నేను స్వయంగా తీసుకున్నది. ఆ నిర్ణయం వల్ల వచ్చే పరిణామాలకు నేనే బాధ్యత వహించాలి. వేరొకరిపై నిందలు వేయలేను. ఏ సినిమా విషయంలోనూ నాకు రిగ్రెట్స్ లేవు. ఆ క్షణాల్లో ఆ చిత్రాలు చేయాలనిపించి చేశాను. వాటి తదనంతర పరిణామాలు నేనే సహించాలి, భరించాలి.

**'అరుంధతి', 'బాహుబలి', 'సైజ్ జీరో'కు బాడీతో ప్రయోగాలు చేశారు. మహిళగా ఇది కష్టమే!**

అవును. మీరు చెప్పింది నిజమే. అప్పుడలా చేయాలనిపించింది. క్యారెక్టర్స్ డిమాండ్ చేశాయి. ఆలోచించకుండా చేసేశా. కానీ, భవిష్యత్తులో అలాంటివి చేయాల్సి వస్తే మాత్రం జాగ్రత్తగా ఎలా చేయాలని ఆలోచించి మరీ ముందడుగు వేస్తా. అవకాశం వచ్చింది కదా అని వెంటనే షూటింగ్‌లోకి దిగను. ఆచితూచి చేస్తా.

**'సైరా'లో గెస్ట్ పాత్ర లాంటి నిర్ణయాలకు ఆలోచిస్తారా?**

చిరంజీవి గారు లెజెండ్. సినిమాలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్రను పరిచయం చేసే ఝాన్సీ లక్ష్మీబాయి పాత్ర చేయమని వాళ్ళు అడగడం ఎంత మంచి విషయం.

**చిరంజీవితో ఫుల్ లెంగ్త్ రోల్ చేయలేదేం!**

మధ్యలో ఒక సినిమా అనుకున్నాం. 'ఖైదీ నంబర్ వన్ ఫిఫ్టీ'కి అనుకుంటా. అయితే నేను 'బాహుబలి'తో బిజీగా ఉండడంతో డిస్కషన్స్ ముందుకు వెళ్ళలేదు.

## అన్నీ చిన్న చిన్న సంతోషాలే!

"నావన్నీ చిన్న చిన్న సంతోషాలే. జీవితంలో చాలా చిన్న చిన్న విషయాలను ఎంజాయ్ చేస్తా. వర్షం పడినప్పుడు మట్టి వాసన చాలా సంతోషిస్తా. స్నేహితులతో కలిసి పార్టీ అంటే సంబరపడతా. కొత్త మనుషులను కలవడం నాకెంతో ఇష్టం. అందులో సంతోషాన్ని వెతుకుతా. తిండి సంగతికొస్తే ముద్ద పప్పు, అన్నం! చికెన్, రొయ్యలు ఇష్టం."

**అమెజాన్‌లో సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తుంటారా?**

ఓ... అన్ని రకాల సినిమాలూ, అన్ని భాషల సినిమాలూ చూస్తా. సబ్ టైటిల్స్ ఉంటాయి కదా! కొరియన్ సినిమాలు ఎక్కువ చూస్తా. కొన్ని రోజులు ఉన్నట్లుండి బయటకు వచ్చి సినిమాలు చూడాలనిపిస్తుంది. (నవ్వుతూ...) హైదరాబాద్‌లో ఏ సినీమ్యాక్స్‌కో, జి.వి.కె. మాల్‌కో థియేటర్లకు వెళ్ళి ఒకే రోజు నాలుగు సినిమాలు చూసేస్తా.

**వృత్తిపరంగా, నటన పరంగా మీకు ఆదర్శం, స్ఫూర్తి?**

పెద్ద యన్టీఆర్, ఏయన్నార్, సావిత్రి, భానుమతి లాంటి మహామహులు ఇండస్ట్రీ పై చెరగని ముద్ర వేశారు. నేను సినిమాలు చూస్తూ పెరగలేదు. కాబట్టి... వాళ్ళ సినిమాలు అన్నీ చూడలేదు. కానీ, ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత చరిత్రలో భాగం కావడం సులభం కాదని తెలిసింది. నటన మాత్రమే వాళ్ళను ఆ స్థాయికి తీసుకు రాలేదు. వ్యక్తిత్వమూ, విలువలు అంతటి వాళ్ళను చేశాయి. భారతీయ చలనచిత్ర చరిత్రలో వాళ్ళు ఒక భాగం. వాళ్ళతో పని చేయకపోయినా వాళ్ల గురించి చాలా విన్నాను. వాళ్ళు నాకు ఆదర్శం. ఇక, నేను పని చేసిన వ్యక్తుల నుండి స్ఫూర్తి పొందాను.

**ఎవరి నుంచైనా మీరు స్ఫూర్తి పొందే విషయం ఏమిటి?**

శ్యామ్ (నిర్మాత ఎం. శ్యామ్ ప్రసాద్ రెడ్డి) గారికి సినిమా అంటే ఎంతో ప్రేమ, గౌరవం. నాతో 'అరుంధతి' తీశారని చెప్పడం లేదు. చేసే పని మీద ప్రాణం పెడతారు. రాజమౌళి అంతే. చేసే పని మీద చాలా ప్యాషనేట్ గా ఉంటారు. ఏ రంగంలోని వారైనా సరే అలా తమ పని మీద ప్రాణం పెడుతుంటే, వాళ్ళతో నేను కనెక్ట్ అవుతా. నా దృష్టిలో ప్యాషన్ ప్లస్ హార్డ్‌వర్క్ ఈజ్ ఇంపార్టెంట్. హాలీవుడ్ ప్రముఖుడు క్వెంటిన్ టరంటినో వయసెంత? ఆయన ఏం చేస్తున్నారో చూడండి. ఫలానా వయసు తర్వాత రిటైర్ కావాలి వంటి మూసను బద్దలు కొడుతున్నారు. సినిమాను కొత్తగా ఆవిష్కరిస్తున్నారు. అలాంటి వ్యక్తులు, వాళ్ళ కథలు నాలో ఆసక్తి కలిగిస్తాయి. మనకు కొంతమంది తెలియచ్చు. కొందరు తెలియక పోవచ్చు. అందుకని, బయోగ్రఫీలు చూస్తా. వ్యక్తుల గురించి తెలుసుకోవడానికి. నాకు బయోగ్రఫీ చిత్రాలు చూడడం ఇష్టం.

(మిగతా చిత్రజ్యోతి పేజీలో...)

# కరోనా కోరల్లో చిత్రసీమ!




**కరోనా ఎఫెక్ట్ ఇప్పుడు డైరెక్ట్‌గా తెలుగు సినిమా మీద పడింది. పదిహేను రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని సినిమా థియేటర్లు మూసి వేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడంతో తెలుగు చిత్రపరిశ్రమలో ఆందోళన మొదలైంది. ఏకంగా రెండు వారాల పాటు థియేటర్లు మూత పడడంతో శుక్రవారం విడుదలైన చిత్రాల పరిస్థితి అగమ్యగోచరం కాగా, వచ్చే వారం విడుదల చేయడానికి ప్లాన్ చేసుకొన్న నిర్మాతలకు ఈ నిర్ణయం పిడుగుపాటే అయింది. ఈ నెల 20న ఐదు చిన్న చిత్రాలు విడుదలకు సిద్ధమయ్యాయి. అలాగే ఉగాది సందర్భంగా ఈ నెల 25న మరో మూడు చిత్రాల్ని విడుదల చేసేందుకు నిర్మాతలు ప్లాన్ చేసుకొన్నారు. కరోనా కారణంగా వారి ప్లాన్స్ అన్నీ తలకిందులయ్యాయి.**

### పెద్ద సినిమాల పరిస్థితి ఏమిటి?

ఈ నెల 25న విడుదల కావాల్సిన 'వి' చిత్రం ఏప్రిల్‌కు వెళ్లిపోయింది. "కరోనా కారణంగా ఈసారి మనం ఉగాది పండుగను ఏప్రిల్‌లో చేసుకొందాం' అని ఆ చిత్రంలో విలన్‌గా నటించిన నాని ట్వీట్ చేశారు. ఏప్రిల్ వరకూ పెద్ద సినిమాలు లేకపోవడంతో థియేటర్ల బంద్ ప్రభావం వాటి మీద ఉండదనే చెప్పాలి. అయితే పరిస్థితి ఇలాగే కొనసాగితే ఏం చెయ్యాలన్న సందేహం అందరిలోనూ ఉంది. 'ఏప్రిల్ రెండున మా సినిమా విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ లోపు పరిస్థితులు చక్కబడతాయనే ఆశాభావం ఉంది' అని 'నిశ్శబ్దం' చిత్ర ఎగ్జిక్యూటివ్ నిర్మాత వివేక్ కూచిభొట్ల చెప్పారు. ఏప్రిల్‌లో విడుదల కావాల్సిన రానా బహుభాషా చిత్రం 'అరణ్య' మాత్రం కరోనా కారణంగానే వాయిదా పడింది. థియేటర్ల మూసివేత కొనసాగితే వేసవిలో విడుదల కావాల్సిన పెద్ద సినిమాల విడుదల షెడ్యూల్స్ మారే అవకాశం ఉంటుంది.

### వాళ్లు కోరుకొన్నదే జరిగిందా?

ప్రస్తుతం థియేటర్లలో కలెక్షన్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. నష్టాలు భరిస్తూ థియేటర్లు నడపడం కంటే ఓ పది రోజులు వాటిని మూసేస్తే బాగుంటుందనే ఆలోచన ఆ మధ్య ఎగ్జిబిటర్స్‌కు వచ్చినా, వివాదస్పదం అవుతుందని చివరి క్షణంలో వెనక్కి తగ్గారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం పదిహేను రోజుల పాటు థియేటర్లు మూసేస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఇదీ మన మంచికే అని కొందరు ఎగ్జిబిటర్లు అనుకొంటున్నారు.

### చిన్న నిర్మాతలకు పెద్ద దెబ్బే

ఒక పక్క పరీక్షలు, మరో పక్క కరోనా ఎఫెక్ట్ కారణంగా పదిహేను రోజుల నుంచి థియేటర్లలో ఎక్కువ టిక్కెట్లు తెగడం లేదు. అయినా పెద్ద సినిమాల పోటీ లేదు కనుక మంచి థియేటర్లు దొరికాయనే సంబరంతో రిలీజ్ ప్లాన్ చేసుకొన్న చిన్న నిర్మాతలు ప్రభుత్వ నిర్ణయంతో తలలు పట్టుకొని కూర్చున్నారు. కరోనాను కట్టడి చేయడానికి ప్రభుత్వానికి సహకరించేందుకు సిద్ధమైనా తమ చిత్రాలను మళ్లీ ఎప్పుడు విడుదల చేయాలో, ఈ సారి మంచి థియేటర్లు దొరకుతాయో లేదో అనే ఆందోళనతో ఉన్నారు. పైగా ఏప్రిల్ నుంచి పెద్ద సినిమాల తాకిడి మొదలవుతుంది కనుక వాటి మధ్య తమ చిత్రాల పరిస్థితి ఏమిటన్న భయం వారిది. ప్రయారిటీ ప్రకారం తిరిగి థియేటర్లను కేటాయిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదనీ, అలా కాకుండా పెద్ద సినిమాలకు ప్రాధాన్యం ఇచ్చి, చిన్న సినిమాలకు అన్యాయం చేస్తే ఆందోళన చేయక తప్పదని చిన్న నిర్మాతలు అంటున్నారు. ఈ విషయంలో ఫిల్మ్ చాంబర్, నిర్మాతల మండలి చొరవ తీసుకొని న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

### ఏపీలో పరిస్థితి ఏంటి?

తెలంగాణ ప్రభుత్వం థియేటర్లు మూసివేస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని పరిశ్రమ వర్గాలతో పాటు సామాన్య ప్రజలూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే నెల్లూరులో థియేటర్లను బంద్ చేశారు. నెల్లూరువాసికి కరోనా పాజిటివ్ రావడంతో ఆ నిర్ణయం తీసుకున్నారు. తెలుగు చిత్రాలకు రెండు రాష్ట్రాలు రెండు కళ్ల వంటివి. ఒక కంటికి కొత్త సినిమా చూపించి, మరో కంటికి చూపించకుండా ఉండలేరు కదా! అందుకని, ఒక తెలుగు రాష్ట్రంలో చిత్రాన్ని విడుదల చేయలేని పరిస్థితి ఉండటంతో... పొరుగు రాష్ట్రంలో విడుదల చేసే సాహసం ఎవరూ చేయకపోవచ్చు.

### ఢిల్లీలో థియేటర్లు బంద్... హిందీ చిత్రాలకు గట్టి దెబ్బే!

తాప్సీ ప్రధాన పాత్రలో నటించిన 'థప్పడ్' ఫిబ్రవరి 28న విడుదలైంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం... ఈ నెల 11కి ఇండియాలో రూ.30.53 కోట్లు వసూలు చేసింది. తమ సినిమా వసూళ్లలో 15 శాతం వసూళ్లు (సుమారు రూ.5కోట్లు) ఢిల్లీ నుంచి వచ్చాయని చిత్రదర్శకుడు అనుభవ్ సిన్హా చెప్పారు. హిందీ చిత్రాలకు దేశరాజధాని ఢిల్లీ నుండి ఎంత డబ్బు వస్తుందనేది చెప్పడానికి ఇదొక ఉదాహరణ. కరోనా కారణంగా మార్చి 31 వరకు రాష్ట్రంలో థియేటర్లు మూసివేస్తూ ఢిల్లీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బాలీవుడ్ వసూళ్లపై గట్టి ప్రభావం చూపిస్తోంది. ఇర్ఫాన్ ఖాన్, రాధికా మదన్, కరీనా కపూర్ ఖాన్ నటించిన 'అంగ్రేజీ మీడియమ్' శుక్రవారం విడుదలైంది. తొలి రోజు ఈ చిత్రానికి సుమారు రూ.4 కోట్లు వచ్చాయట. అదే ఢిల్లీలో విడుదలై ఉంటే... మరో రూ.50 లక్షలు ఎక్కువ వచ్చేవని డిస్ట్రిబ్యూటర్ అభిప్రాయపడ్డారు. కరోనా కారణంగా ఇతర రాష్ట్రాల్లోనూ ఈ చిత్రాన్ని చూడటానికి వచ్చే ప్రేక్షకులు తగ్గారు. టైగర్ ష్రాఫ్ హీరోగా నటించిన 'బాఘీ 3' తొలి వారంలో మంచి వసూళ్లు రాబట్టింది. కరోనా ప్రభావం ఉన్నప్పటికీ... రూ.90 కోట్లు కలెక్ట్ చేసింది. ఢిల్లీలో థియేటర్లు బంద్ చేయడం వల్ల తమ సినిమా వసూళ్లపై ప్రభావం పడుతుందని దర్శకుడు అహ్మద్ ఖాన్ తెలిపారు.





### ప్రేక్షకులు నోయిడాకు వెళతారా?

ఢిల్లీలో థియేటర్లు బంద్ చేసినప్పటికీ... నోయిడా, గుర్‌గ్రామ్ నగరాల్లో బంద్ చేయలేదు. అవి ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో ఉన్నాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా థియేటర్లను మూసివేసే విషయమై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే... ప్రేక్షకులు ఢిల్లీ నుండి నోయిడా, గుర్‌గ్రామ్‌కు వెళతారా అనేది అనుమానమే.

### ఇతర భాషల్లోనూ... తర్వాత కలుద్దాం మరి!

కరోనా దెబ్బకు థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గిందనేది వాస్తవం. మున్ముందు అసలు థియేటర్లకు వస్తారా? రారా? భయాలు నిర్మాతల్లో ఒక వైపు... థియేటర్లకు వెళితే కరోనా ఎక్కడ సోకుతుందోననే అనుమానాలు ప్రేక్షకుల్లో మరో వైపు... వెరసి సినిమాలు వాయిదా పడుతున్నాయి. హిందీలో మార్చి 20న విడుదలకు సిద్ధమైన అర్జున్ కపూర్, పరిణీతీ చోప్రాల 'సందీప్ ఔర్ పింకీ ఫరార్', 24న రావాల్సిన అక్షయ్ కుమార్ 'సూర్యవన్షీ' చిత్రాలను వాయిదా వేశారు. హాలీవుడ్‌లో 'ములాన్', 'ది లవ్ బర్డ్స్', 'ది న్యూ మ్యూటెంట్స్', 'నో టైమ్ టు డై' (జేమ్స్ బాండ్ ఫ్రాంచైజీలో 25వ సినిమా), 'ది రన్ అవే', 'ఎ క్వైట్ ప్లేస్ 2', 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్ 9', 'బ్లూ స్టోరీ' చిత్రాలను వాయిదా వేశారు. కేరళలో థియేటర్లు బంద్ చేయడంతో ఈ నెల 25న విడుదల కావాల్సిన మోహన్‌లాల్ 'మరక్కార్: అరేబియా సముద్ర సింహం' చిత్రాన్ని వాయిదా వేయక తప్పలేదు.






### పది డిగ్రీల చలిలో... జోరున కురిసే వర్షంలో!

ప్రస్తుతం కరోనా విశ్వవ్యాప్తంగా భయపెడుతున్న పరిస్థితుల దృష్ట్యా... చాలామంది ఇండియాలో షూటింగులు చేయడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. విదేశాల నుండి పలువురు తిరిగొస్తున్నారు. ప్రభాస్20 చిత్రబృందం ధైర్యంగా చిత్రీకరణ చేస్తోంది. అదీ విదేశాల్లో! చలిలో, వర్షంలో!! ప్రభాస్ కథానాయకుడిగా 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో యువి క్రియేషన్స్, గోపీకృష్ణా మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా చిత్రీకరణ కొన్నిరోజులుగా జార్జియాలో జరుగుతోంది. శుక్రవారం చిత్రబృందంతో పూజా హెగ్డే జత కలిశారు. మాస్క్ ధరించి ఆమె విమాన ప్రయాణం చేశారు. హీరో హీరోయిన్లపై రొమాంటిక్, క్యూట్ సీన్స్ తీస్తున్నారట! "పది డిగ్రీల చలి, జోరుగా కురిసే వర్షం, కరోనా ముప్పు... ఏదీ మా చిత్రబృందంలోని స్పిరిట్‌ని ఆపడం లేదు" అని దర్శకుడు శనివారం సాయంత్రం ట్వీట్ చేశారు.

### నో టూర్స్... నో షూటింగ్స్!

కరోనా దెబ్బకు కొత్త సినిమాలను విడుదల చేయడానికి మాత్రమే వివిధ భాషల్లో నిర్మాతలు భయపడుతున్నారని అనుకుంటే పొరపాటే! షూటింగులు చేయడానికీ భయపడుతున్నారు. విదేశాలు వెళ్లడానికి ఆలోచిస్తున్నారు. చిత్రీకరణలు, ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. చండీగఢ్‌లో షాహిద్ కపూర్ హీరోగా నటిస్తున్న 'జెర్సీ' హిందీ రీమేక్ షూటింగ్‌ను కరోనా కారణంగా ఆపేశారు. శనివారం చిత్రబృందం ముంబయ్ తిరిగొచ్చింది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్, అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హిందీ చిత్రం 'బ్రహ్మాస్త్ర'. నిన్న మొన్నటి వరకూ ముంబయ్‌లో షూటింగ్ చేశారు. ఇప్పుడీ సినిమా షూటింగ్‌ను క్యాన్సిల్ చేశారు. కరోనా కారణంగా విదేశీ రాకపోకలపై రష్యా ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో విక్రమ్ హీరోగా నటిస్తున్న తమిళ సినిమా 'కోబ్రా' చిత్రబృందం అర్థంతరంగా వెనక్కి తిరిగిరావాల్సి వచ్చింది. ఇప్పటికే ప్యారిస్ టూర్ వెళ్లాల్సిన దీపికా పదుకోన్ కరోనా కారణంగా తన పర్యటనను రద్దు చేసుకున్నారు. ప్రయాణాలను రద్దు చేసుకున్న తారల జాబితాలో సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్ చేరారు. ఏప్రిల్‌లో 10 నుండి 19 వరకూ హృతిక్, 3 నుండి 12 వరకూ సల్మాన్... అమెరికాలో వివిధ నగరాల్లో టూర్స్ ప్లాన్ చేసుకున్నారు. ఇప్పుడు ఇద్దరూ తమ పర్యటనలు రద్దు చేసుకున్నారు.

### సినిమా వేడుకలకూ సెగ తగిలింది!




తమిళ హీరో విజయ్ తాజా సినిమా 'మాస్టర్' ఆడియో వేడుక అభిమానుల సమక్షంలో ఈ నెల 15న జరగాల్సి ఉంది. రోజు రోజుకూ కరోనా వ్యాప్తి చెందుతుండటంతో చిత్రబృందం ముందు జాగ్రత్త వహించింది. యూనిట్ సభ్యుల సమక్షంలో వేడుక నిర్వహించాలని నిర్ణయించారు. వారం రోజుల క్రితమే ప్రేక్షకులకు ఈ సంగతి తెలియజేశారు. టీవీల్లో లైవ్ చూడమని విజ్ఞప్తి చేస్తూ, క్రియేటివ్‌గా ఒక వీడియో విడుదల చేశారు. ప్రముఖ ఛానల్స్‌లో ఒకటైన 'జీ' సంస్థ ప్రతి ఏటా నిర్వహించే అవార్డు వేడుకను, ఈసారి ప్రేక్షకులు లేకుండా స్టార్స్ మధ్య మాత్రమే నిర్వహించారు. ప్రతి ఏడాది ఫ్రాన్స్‌లో హాలీవుడ్ తారలతో కళకళలాడే కాన్ తీరం ఈ ఏడాది వెలవెలబోతుందేమో అనే అనుమానం ఏర్పడింది. "కరోనా తగ్గుముఖం పట్టకపోతే కాన్ చలనచిత్రోత్సవాన్ని రద్దు చేస్తాం" అని చిత్రోత్సవం నిర్వహణ అధ్యక్షుడు పియర్రే లెస్కురే అన్నారు. దీనిబట్టి పరిస్థితి ఎలా ఉందో ఊహించవచ్చు. నిజానికి ఈ ఏడాది మే 12 నుండి 23 వరకూ 73వ కాన్ చిత్రోత్సవం నిర్వహించాలి. దీనికి సుమారు 40 వేల మంది హాజరవుతారు. ఫ్రాన్స్‌లో 1000మంది కంటే ఎక్కువమంది హాజరయ్యే సమావేశాలపై ప్రభుత్వం నిషేధం విధించింది.

### ఈ రాష్ట్రాల్లో థియేటర్లు మూసేశారు!

1) కేరళ
2) ఢిల్లీ
3) జమ్మూ కశ్మీర్
4) ఒడిశా
5) కర్ణాటక
6) మహారాష్ట్ర
7) తెలంగాణ

### కోటి రూపాయల నష్టం

"కరోనా ప్రభావం నెలాఖరులోపు తగ్గుతుందనుకొని 'ఉప్పెన' సినిమాను ఏప్రిల్ 2న విడుదల చేయాలనుకున్నాం. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టాం. అయితే థియేటర్ల మూసివేత నిర్ణయంతో మా సినిమా విడుదల వాయిదా వేశాం. దీని వల్ల మాకు రూ.కోటి వరకూ నష్టం వాటిల్లుతుంది. అయినా తప్పదు. విడుదల వాయిదా పడిన సినిమా నిర్మాతలంతా నిర్మాతల మండలి, గిల్డ్ సభ్యులతో చర్చించి ఎప్పుడు, ఏ సినిమా విడుదల కావాలన్నది నిర్ణయించుకుంటాం. ఇలాంటి సమయంలో కూడా 'మేం ఫలానా తేదీన విడుదల చేయాలనుకున్నాం.. ఆ రోజునే వస్తాం' అనకూడదు. షూటింగ్‌ల విషయం గురించి కూడా చర్చిస్తాం."

- యలమంచిలి రవిశంకర్, 'ఉప్పెన' నిర్మాత (మైత్రీ మూవీ మేకర్స్)

### అందరికీ న్యాయం చేయాలి

"రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యాక సినిమా విడుదల వాయిదా వేయడం నిర్మాతకు ఇబ్బందే. అయితే ఆరోగ్యానికి సంబంధించిన విషయం కాబట్టి అందరూ దీనికి సహకరించాలి. త్వరలోనే గిల్డ్‌లో ఈ సమస్య గురించి చర్చించి 'ఒరేయ్ బుజ్జిగా' సినిమా కొత్త విడుదల తేదీను ప్రకటిస్తాం. నెలాఖర్లోగా అంతా సర్దుకుంటే 25న విడుదల కావలసిన సినిమాలను ఏప్రిల్ రెండున, రెండో తేదీ సినిమాలు మరో వారం తర్వాత విడుదలయ్యేలా చూడమని నిర్మాతల మండలిని రిక్వెస్ట్ చేస్తాం. అలా చేస్తే అందరికీ న్యాయం జరుగుతుందని నా అభిప్రాయం.

- కె.కె.రాధామోహన్, 'ఒరేయ్ బుజ్జిగా' నిర్మాత

### ఇదంతా నిర్మాతల కర్మ

"థియేటర్లు మూసివేయడం, సినిమా విడుదల వాయిదా పడటం నిర్మాతల కర్మ అనుకోవాలి. అలాగని ప్రభుత్వ నిర్ణయాన్ని ధిక్కరించలేం కదా! ఇలాంటి నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుందని నాలుగు రోజుల క్రితం నుంచే నాకు అనుమానంగా ఉంది. అందుకే డిస్ట్రిబ్యూటర్లకు డబ్బులు కూడా చెల్లించలేదు. ఒకవేళ థియేటర్లు ఉన్నా.. కరోనా భయంతో జనాలు బయటకు రావడం లేదు. పరిస్థితులు అనుకూలిస్తే ఏప్రిల్ 2న 'అన్నపూర్ణమ్మగారి మనవడు' సినిమాను విడుదల చేస్తాం. నిర్మాతలంతా ఆలోచించుకుని అందరికీ న్యాయం జరిగేలా విడుదల తేదీలు ప్రకటించాలి".

- ఎమ్మెన్నార్ చౌదరి, 'అన్నపూర్ణమ్మగారి మనవడు' నిర్మాత

# 'సీతాయణం'లో...



అక్షిత్, అనహిత

తెలుగు, తమిళ, కన్నడ ప్రేక్షకులకు సుపరిచితులైన కన్నడ హీరో శశికుమార్ తనయుడు అక్షిత్ శశికుమార్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'సీతాయణం'. అనహిత భూషణ్ కథానాయిక. ప్రభాకర్ ఆరిపాక దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రోహన్ భరద్వాజ్ సమర్పణలో శ్రీమతి లలితా రాజ్యలక్ష్మి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలుగు, కన్నడ భాషల్లో రూపొందుతోన్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను ఇటీవల విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "మహిళలను గౌరవించండి... అనేది ఉపశీర్షిక. ప్రేమ, నేరం నేపథ్యంలో నడిచే చిత్రమిది. ఈ నెలలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం" అన్నారు. "నేటి తరానికి నచ్చేలా హృద్యమైన అంశాలు, సన్నివేశాలతో తీసిన చిత్రమిది. అక్షిత్, అనహిత జోడీ బాగా కుదిరింది. ఇద్దరూ చక్కగా నటించారు" అని దర్శకుడు అన్నారు. అజయ్ ఘోష్, మధునందన్, విద్యులేఖా రామన్, 'బిత్తిరి' సత్తి తదితరులు నటించిన ఈ చిత్రానికి సాహిత్యం: చంద్రబోస్, అనంత శ్రీరామ్, సంగీతం: పద్మనాభ్ భరద్వాజ్.

# యాంకర్ రవి యాక్షన్ థ్రిల్లర్



అంజి దేవండ్ల, ఎన్.శంకర్

యాంకర్ రవి మరో చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. గౌతమి కథానాయిక. అంజి దేవండ్ల దర్శకత్వంలో ఆలూర్ ప్రకాశ్ గౌడ్ నిర్మిస్తున్న ఆ చిత్రం పేరు 'తోటబావి'. చిన్న స్వామి, అభినేష్ సహ నిర్మాతలు. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు ఎన్.శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ 'యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. కథ, కథనాలు ఆసక్తికరంగా ఉంటాయి. మా దర్శకుడు ఆసక్తికరంగా తెరకు ఎక్కించారు. అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు.

# అంగుళీక కథతో...

ఆరువందల ఏళ్ల క్రితం జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా, కొన్ని కల్పిత పాత్రలతో రూపొందిన చిత్రం 'అంగుళీక'. దీపక్, శేఖర్ వర్మ, విన్యా సంత్ హీరో హీరోయిన్లుగా నటించారు. ప్రేమ్ ఆర్యన్ దర్శకుడు. కోటి తూముల, ఎ.జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాతలు. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. శనివారం ఫిల్మ్ ఛాంబర్‌లో ఈ చిత్రం ట్రైలర్‌ను టి.ప్రసన్న కుమార్, దామోదర్ ప్రసాద్, ముత్యాల రాందాస్ విడుదల చేశారు. దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ "పాటలు, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉన్నాయి. గ్రాఫిక్స్ క్వాలిటీ చూశాక మంచి సినిమా అవుతుందనిపించింది" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "సూర్య భగవానుడి అంశతో పుట్టిన ఒక అమ్మాయికి, అంగుళీక సూర్య గ్రహణానికి ఉన్న సంబంధం ఏంటనేది ఈ సినిమా కథ. ఆరు వందల ఏళ్లకు ఒకసారి వచ్చే అంగుళీక సూర్యగ్రహణం ఈ ఏడాది రానుండటం విశేషం" అని చెప్పారు. "పలు బాలీవుడ్ చిత్రాలకు గ్రాఫిక్స్ విభాగంలో పనిచేసిన అనుభవం ఉండటంతో విజువల్ వండర్‌లా ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు దర్శకుడు. పాటలకు చక్కని స్పందన వచ్చింది" అని నిర్మాతలు తెలిపారు.



శేఖర్ వర్మ, విన్యా సంత్



'నిశ్శబ్దం' చిత్రంలో అనుష్క

# దేవుడు కనిపిస్తే... థ్యాంక్యూ చెబుతా!

('నవ్య' మొదటి పేజీ తరువాయి...)

**మీరు ఈమధ్య కాలంలో చూసిన బయోపిక్?**

సావిత్రి గారి మీద వచ్చిన 'మహానటి'. కీర్తి సురేష్, దుల్కర్ సల్మాన్‌ల కాంబినేషన్ ఎమేజింగ్. ఇద్దరూ అద్భుతంగా చేశారు. నాగి (దర్శకుడు నాగ అశ్విన్) బాగా చేయించారు.

**ఫలానా బయోగ్రఫికల్ ఫిల్మ్ ఏదైనా చేయాలని మీకుందా?**

(ఒక్క క్షణం ఆలోచించి) బయోపిక్స్ చేయడం నాకిష్టమే. అయితే ఫలానా బయోపిక్ చేయాలని అనుకోలేదు. బయోగ్రఫీలో ఒక వ్యక్తి ప్రయాణం, నిజమైన భావోద్వేగాలు ఉండాలి. జెన్యూనిటీ ముఖ్యం. మనం బయోగ్రఫీ చేస్తున్నామంటే... ఆ అసలు వ్యక్తిని రీప్లేస్ చేస్తున్నాం. అంటే, ఆ వ్యక్తితో సిమిలారిటీస్ ఉండాలి. అలా లేకుండా, అన్ని బయోగ్రఫీలూ చేయలేము. మంచిది వస్తే తప్పకుండా చేస్తా.

**అలా మీకు నచ్చిన బయోపిక్, మీరు చదివిన ఆత్మకథ?**

ఎక్కువ ఆత్మకథలు చదవలేదు కానీ, చదవాలని అనుకుంటుంటా. పరమహంస యోగానంద 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి' (తెలుగులో 'ఒక యోగి ఆత్మకథ') చదివా. మన దగ్గర ఎంతమంది చూశారో తెలియదు కానీ, బెతనీ హ్యామిల్టన్ అని అమెరికన్ ప్రొఫెషనల్ సర్ఫర్ ఉంది. ఒకసారి సర్ఫింగ్ చేస్తుండగా సొరచేప దాడిలో, ఎడమ చేతిని పోగొట్టుకుంది. దాన్నుండి బయటపడి సర్ఫింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఆమెకు పెళ్లయింది. పిల్లలున్నారు. ఆమె ఆత్మకథ చాలా ఏళ్ళ క్రితం 'సోల్ సర్ఫర్' అని వచ్చింది. దాన్నే ఆ తరువాత అదే పేరుతో సినిమాగా తీశారు. స్ఫూర్తిమంతంగా ఉంటుంది.




**మీ లైఫ్ ఫిలాసఫీ?**

జస్ట్... వర్క్ ఇన్ ప్రోగ్రెస్. రోజూ ఒక్కో అడుగూ ముందుకు సాగుతుండడమే!

**అందానికి మీ నిర్వచనం?**

మనపై మనం నమ్మకంతో ఉండడం! లావు, సన్నం, నలుపు, తెలుపు లాంటి వాటితో ప్రమేయం లేకుండా, మనల్ని మనం ప్రేమిస్తూ హాయిగా ఉండడం! కంఫర్టబుల్ ఇన్ యువర్ ఓన్ స్కిన్. మనసులో సంతోషంగా ఉంటే అదే అసలైన అందం.

### స్వీటీ... హీరోలు (అనుష్క మాటల్లో... ఆమె హీరోల గురించి)

**చిరంజీవి:** ఆయనతో ఫుల్ లెన్త్ రోల్ చేయలేదు కానీ, నా దృష్టిలో ఆయన స్టార్. తిరుగులేని లెజెండ్.
**రజనీకాంత్:** సూపర్ స్టారైనా సాదాసీదాగా ఉండే వ్యక్తి. ఎనిమిదికి షూటింగ్ అంటే ఏడుమ్ముప్పావుకే సెట్‌లో రెడీగా ఉండేవ్యక్తి. ఆయన నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది.
**బాలకృష్ణ:** అనుక్షణం ఉత్సాహం, ఉత్తేజం తొణికిసలాడే మంచి మనిషి. ఇష్టమైన వ్యక్తి.
**నాగార్జున:** నా తొలి చిత్ర హీరో. నా మనసుకు దగ్గరైన వ్యక్తి.
**వెంకటేశ్:** ఎప్పుడూ స్టార్‌లా ప్రవర్తించని మంచి మనిషి.
**రవితేజ:** పనిచేయడం బోలెడంత వినోదం.
**మహేశ్ బాబు:** ప్రొఫెషనల్. పేరు చెప్పగానే స్టార్ అనిపిస్తుంది.
**ప్రభాస్:** నాకు బెస్ట్ ఫ్రెండ్.
**రానా:** నాకు బ్రదర్. నన్ను కూడా బ్రో అని పిలుస్తాడు.
**అల్లు అర్జున్:** ఆయన హార్డ్ వర్క్, ఎంచుకొనే సినిమాలు అద్భుతం.
**గోపీచంద్:** కెరీర్ తొలినాళ్లలో కలసి చాలా సినిమాలు చేశాం.మంచి ఫ్రెండ్.
**సూర్య:** వెరీ నైస్ హ్యూమన్ బీయింగ్.
**మాధవన్:** ఎమేజింగ్ యాక్టర్. అపారమైన నాలెడ్జ్ ఉన్న వ్యక్తి. ఎన్నో కోణాలున్న ప్రజ్ఞావంతుడు. అంత తెలిసినా, సింపుల్‌గా ఉండే మనిషి.

**దయ్యాల సినిమాలు చేస్తుంటారు. దేవుణ్ణి నమ్ముతారా?**

చిన్నతనం నుండి టెంపుల్స్‌కి వెళ్లడం అలవాటు. దేవాలయాల్లో వాతావరణం నాకు ఇష్టం. తిరుపతికి కొన్నిసార్లు వెళ్లాను. కేరళలో చొట్టనిక్కర టెంపుల్, గురువాయూర్ టెంపుల్స్‌కి వెళుతుంటా. మంగుళూరులో మా అమ్మగారి సొంతూరు పుత్తూరులో మహాలింగేశ్వర ఆలయం ఉంది. అలాగే మా అమ్మ వాళ్ళ ఇంటిపేరైన బెల్లిపాడి కుటుంబం పెద్దది. పుత్తూరులో బెల్లిపాడి ఫ్యామిలీ గ్రామదేవతకు గుడి కట్టించింది. అక్కడికి వెళుతుంటా.

**ఇప్పటికిప్పుడు దేవుడు ప్రత్యక్షమై, వరమిస్తానంటే ఏం కోరతారు?**

థ్యాంక్యూ అంటాను. జీవితంలో నేను అడిగినదాని కంటే దేవుడు చాలా ఎక్కువ ఇచ్చాడు. ఈ విషయంలో నా అంత అదృష్టవంతురాలు ఎవరూ ఉండరు! ఒకవేళ ఇప్పుడూ దేవుడిని ఏమైనా అడిగితే నా అంత స్వార్థపరురాలు ఎవరూ ఉండరు. గుడికి వెళ్లే ముందు 'ఇది అడగాలి. ఇది అడగాలి' అనుకుంటాను. వెళ్లిన తర్వాత దేవుడు ముందు నిలబడినప్పుడు మాత్రం థ్యాంక్యూ' చెప్పేసి వస్తుంటా.

# 'పరుగు' నాయికకు పెళ్లైంది



సంతోశ్ రెడ్డి, శీలా

అల్లు అర్జున్ 'పరుగు'లో కథానాయికగా నటించిన శీలా కౌర్ గుర్తున్నారా? అంతకు ముందు 'సీతా కల్యాణం' చిత్రంలో నటించినప్పటీ... 'పరుగు' ఆమెకు గుర్తింపు తెచ్చింది. ఇటీవల చెన్నైకి చెందిన వ్యాపారవేత్త సంతోష్ రెడ్డిని శీలా వివాహం చేసుకున్నారు. ఈ విషయం చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం శీలా పెళ్లి ఫొటో ఇంటర్‌నెట్‌లో చక్కర్లు కొడుతోంది. 'పరుగు' తర్వాత రామ్ పోతినేని 'మస్కా', చిన్న ఎన్టీఆర్ 'అదుర్స్', నందమూరి బాలకృష్ణ 'పరమ వీరచక్ర'తో పాటు పలు తమిళ, మలయాళ చిత్రాల్లో నటించారు. తొమ్మిదేళ్లుగా చిత్రాలకు దూరంగా ఉన్నారు. 'పరమ వీరచక్ర' తర్వాత 2018లో కన్నడ చిత్రం 'హైపర్' చేశారంతే! ఆ తర్వాత మళ్లీ నటించలేదు.

### డైలీ సుడోకు - 308

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 9 | | 2 | 4 | | | | |
| | | 5 | 8 | | | | | |
| 3 | | | 7 | | | | 1 | 8 |
| | 1 | | | 3 | | 7 | | |
| | | 9 | | | | 4 | | |
| | | 6 | | 8 | | | 9 | |
| 6 | 5 | | | | 8 | | | 7 |
| | | | | | 2 | 8 | | |
| | | | | 6 | 5 | | 2 | 9 |

**సుడోకు- 307 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 5 | 1 | 8 | 2 | 3 | 6 | 4 | 9 |
| 4 | 3 | 2 | 5 | 9 | 6 | 7 | 1 | 8 |
| 6 | 9 | 8 | 4 | 7 | 1 | 2 | 5 | 3 |
| 8 | 6 | 9 | 3 | 5 | 2 | 1 | 7 | 4 |
| 3 | 7 | 4 | 1 | 6 | 9 | 5 | 8 | 2 |
| 1 | 2 | 5 | 7 | 4 | 8 | 3 | 9 | 6 |
| 9 | 8 | 7 | 2 | 3 | 5 | 4 | 6 | 1 |
| 5 | 1 | 3 | 6 | 8 | 4 | 9 | 2 | 7 |
| 2 | 4 | 6 | 9 | 1 | 7 | 8 | 3 | 5 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

# ఇక దాతృత్వానికే అంకితం!



## మైక్రోసాఫ్ట్ బోర్డు నుంచి వైదొలిగిన బిల్ గేట్స్

శాన్‌ఫ్రాన్సిస్కో: టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కంపెనీ బోర్డు నుంచి కూడా వైదొలిగారు. తన వ్యక్తిగత జీవితంలో దాతృత్వ కార్యక్రమాలకు మరింత సమయం కేటాయించేందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. 64 ఏళ్ల బిల్ గేట్స్.. 12 ఏళ్ల క్రితం నుంచే కంపెనీ రోజువారీ కార్యకలాపాల్లో పాల్గొనడం లేదు. తన భార్య మిలిండా గేట్స్‌తో కలిసి ప్రారంభించిన ఛారిటీ సంస్థ 'బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్' కార్యక్రమాలపైనే దృష్టి పెడుతూ వచ్చారు. ఇందుకోసం 2014 తొలినాళ్లలోనే మైక్రోసాఫ్ట్ బోర్డు ఛైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. తాజాగా మైక్రోసాఫ్ట్‌తోపాటు తన మిత్రుడు వారెన్ బఫెట్‌కు చెందిన కంపెనీ 'బెర్క్‌షైర్ హాత్‌వే' బోర్డుకు గుడ్‌బై చెప్పారు.

### 20 ఏళ్ల క్రితమే పగ్గాలు వీడి..

2000 జనవరిలో బిల్ గేట్స్ మైక్రోసాఫ్ట్ సారథ్య బాధ్యతలను స్టీవ్ బామర్‌కు అప్పగించి దాతృత్వ కార్యక్రమాలపై దృష్టి సారించారు. 2008లోనే కంపెనీ రోజువారీ కార్యకలాపాల నుంచి తప్పుకున్నారు. 2014లో కంపెనీ ఛైర్మన్ పదవి నుంచీ వైదొలిగారు. అదే సమయంలో కంపెనీ మూడో సీఈఓగా సత్య నాదెళ్ల పగ్గాలు చేపట్టారు.

### 13 ఏళ్లకే కంప్యూటర్‌పై పట్టు

బిల్ గేట్స్ 13 ఏళ్ల ప్రాయంలోనే కంప్యూటర్ ప్రోగామింగ్‌పై పట్టు సాధించారు. హార్వర్డ్‌లో విద్యాభ్యాసాన్ని మధ్యలోనే వదిలేసిన గేట్స్.. బాల్య స్నేహితుడైన అలెన్ పాల్‌తో కలిసి మైక్రోసాఫ్ట్‌ను ప్రారంభించారు. విండోస్ సాఫ్ట్‌వేర్ ద్వారా కంప్యూటింగ్‌ను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారు.

మైక్రోసాఫ్ట్ వ్యాపారం అనూహ్య విస్తరణ, వృద్ధితో బిల్ గేట్స్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా అవతరించారు. 1987లోనే ఫోర్బ్స్ శ్రీమంతుల వార్షిక జాబితాలో చోటు దక్కించుకున్న గేట్స్..

### ప్రపంచ కుబేరుడు

1995 నుంచి 2017 వరకు రిచ్ లిస్ట్‌లో నం.1 స్థానంలో కొనసాగారు. 2017లో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్.. గేట్స్‌ను వెనక్కి నెట్టి అగ్రపీఠం దక్కించుకున్నాడు. ప్రస్తుతం 10,200 కోట్ల డాలర్ల వ్యక్తిగత సంపదతో గేట్స్ రెండో స్థానంలో ఉన్నారు.



ఇన్నాళ్లూ బిల్ గేట్స్‌తో కలిసి పనిచేయడం, ఆయన నుంచి నేర్చుకునే అవకాశం లభించడం నాకు లభించిన గొప్ప గౌరవం. సాఫ్ట్‌వేర్‌ను ప్రజాస్వామిక శక్తిగా మల్చడంతోపాటు సమాజాన్ని పట్టి పీడిస్తున్న సవాళ్లను పరిష్కరించే ఉద్దేశంతో బిల్ గేట్స్ ఈ కంపెనీని ప్రారంభించారు. ముమ్మందు కూడా గేట్స్‌తో కంపెనీ ప్రయాణం కొనసాగనుంది. కంపెనీకి సాంకేతిక సలహాదారుగా ఆయన కొనసాగుతారు. బిల్ గేట్స్ స్నేహానికి కృతజ్ఞుడిని. ముమ్మందూ తనతో కలిసి పనిచేసేందుకు ఎంతో ఉత్సుకతతో ఎదురు చూస్తున్నా.

– సత్య నాదెళ్ల, మైక్రోసాఫ్ట్ సీఈఓ

### దాన కర్ణుడు

రెండు దశాబ్దాల క్రితమే బిల్ గేట్స్ దాతృత్వ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2000 సంవత్సరంలో విలియమ్ హెచ్. గేట్స్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. తర్వాత కాలంలో దాని పేరును బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్‌గా మార్చారు. ఈ ఫౌండేషన్ ద్వారా పలు ఛారిటీ సంస్థలు, శాస్త్రీయ పరిశోధనలకు భారీ విరాళాలు అందజేశారు. ప్రస్తుతం 4,680 కోట్ల డాలర్ల నిధులు కలిగిన ఈ ఫౌండేషన్.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ ఛారిటీ సంస్థ. 2009లో బిల్ గేట్స్, వారెన్ బఫెట్ (బెర్క్‌షైర్ హాత్‌వే ఛైర్మన్) కలిసి 'ది గివింగ్ ప్లెడ్జ్'ను ప్రారంభించారు.

# మొబైల్స్‌పై జీఎస్‌టీ మోత



## పన్ను 12 నుంచి 18 శాతానికి పెంపు

న్యూఢిల్లీ: దేశంలో మొబైల్ ఫోన్ల ధరలు మరింత ప్రియం కానున్నాయి. ఎందుకంటే, మొబైళ్లపై జీఎస్‌టీని ప్రస్తుతమున్న 12 శాతం నుంచి 18 శాతానికి పెంచారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన జీఎస్‌టీ మండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మొబైల్‌పై పన్నుల పెంపు కస్టమర్ల కొనుగోళ్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపనుందని ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) అంటోంది. అంతేకాదు, దేశీయంగా ఫోన్ల తయారీకి ఇది ప్రతికూల పరిణామమేని వాపోయింది. కరోనా వైరస్ విజృంభణతో చైనా నుంచి ఎలక్ట్రానిక్ విడిభాగాల సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో మొబైల్ హ్యాండ్‌సెట్ మార్కెట్ తీవ్ర ఒత్తిడిలో ఉందంటూ ఐసీఈఏ ఇప్పటికే ఆర్థిక శాఖకు లేఖ రాసింది. ఈ తరుణంలో జీఎస్‌టీ రేటు మరింత పెంచడం తగదని లేఖలో పేర్కొంది. మొబైల్స్‌తో పాటు వస్త్రాలు, పాదరక్షలు, ఎరువులపైనా పన్ను రేట్లు పెరగవచ్చని జీఎస్‌టీ మండలి సమావేశానికి ముందు మార్కెట్లో ఊహాగానాలు నెలకొన్నాయి. అయితే, కరోనా ప్రభావం, ఆర్థిక మందగమనం నేపథ్యంలో వీటిపై జీఎస్‌టీ పెంపు నిర్ణయాన్ని మండలి వాయిదా వేసుకుంది. తాజా సమీక్షలో సవరించిన రేట్లన్నీ ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. మరోవైపు ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావాన్ని జీఎస్‌టీ మండలి చర్చించిందని మంత్రి తెలిపారు.

### మండలి తీసుకున్న మరిన్ని నిర్ణయాలు

#### విమానాల ఎంఆర్‌ఓ సేవలిక చౌక

కరోనా ధాటికి కుదేలవుతున్న ఎయిర్‌లైన్స్ ప్రభుత్వం కొంత ఊరట కల్పించింది. విమానాల మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌ఓ) సేవలపై జీఎస్‌టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. అదీ పూర్తి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వసతితో. దేశంలో ఎంఆర్‌ఓ సేవల ప్రారంభానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని సీతారామన్ పేర్కొన్నారు.

#### అగ్గి పెట్టెలకు ఒకే పన్ను రేటు

అగ్గిపెట్టెలకు ఇకపై ఒకే జీఎస్‌టీ వర్తించనుంది. ప్రస్తుతం చేతితో తయారు చేసే అగ్గిపెట్టెలపై 5 శాతం, యంత్రంతో తయారు చేసే అగ్గిపెట్టెలపై 18 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తున్నారు. వచ్చే నెల నుంచి రెండింటికీ 12 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

#### జీఎస్‌టీ నెట్‌వర్క్ బలోపేతం

జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్)పై అసంతృప్తిగా ఉన్న కేంద్ర ప్రభుత్వం సాంకేతిక లోపాలను సరిదిద్దాలని ఇన్ఫోసిస్‌ను కోరింది. అత్యుత్తమ నిపుణులను ఈ పనికి పురమాయించాలని, 2020 జూలై నాటికి సాంకేతిక లోపాల్లేని వ్యవస్థగా మార్చాలని, ఇందుకోసం జీఎస్‌టీఎన్ హార్డ్‌వేర్ సామర్థ్యాన్ని పెంచాలని ఆదేశించింది. జీఎస్‌టీఎన్ నెట్‌వర్క్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్ఫోసిస్ రూపొందించింది.

### జీఎస్‌టీ రిటర్నులు, తదితర అంశాలు

- *2018-19 ఆర్థిక సంవత్సరానికి వార్షిక జీఎస్‌టీ రిటర్న్, రీకాన్సిలేషన్ స్టేట్‌మెంట్ సమర్పించేందుకు గడువు తేదీని 2020 జూన్ 30కి పొడిగించారు.*
- *రూ.2 కోట్ల లోపు టర్నోవర్ కలిగిన వ్యాపారాలకు 2017-18, 2018-19 వార్షిక రిటర్న్ (జీఎస్‌టీఆర్-9), రీకాన్సిలేషన్ స్టేట్‌మెంట్ల (జీఎస్‌టీఆర్-9సీ) సమర్పణలో జాప్యమైనా లేట్ ఫీజ్ విధించవద్దని మండలి నిర్ణయించింది.*
- *రూ.5 కోట్లలోపు టర్నోవర్ కలిగిన ఎంఎస్‌ఎంఈలకు 2018-19 సంవత్సరానికి రీకాన్సిలేషన్ స్టేట్‌మెంట్ (జీఎస్‌టీఆర్-9సీ) సమర్పణను సడలించింది.*
- *ఈ-ఇన్వాయిస్, క్యూఆర్ కోడ్ అమలు తేదీని ఏప్రిల్ 1 నుంచి అక్టోబరు 1కి పొడిగించారు.*
- *ఎగుమతిదారులకు ఈ-వాలెట్ స్కీమ్ అమలును సైతం 2021 మార్చి 31కి పొడిగించారు.*
- *జీఎస్‌టీ చెల్లింపుల్లో జాప్యానికి వడ్డీ విధింపును నికరంగా చెల్లించాల్సిన పన్నుపై విధించనున్నారు. ఈ నిర్ణయం 2017 జూలై 1 నుంచి అమలులోకి వచ్చేలా చట్టంలో సవరణలు చేయనున్నారు.*
- *ఈ ఏడాది మార్చి 14 వరకు రద్దయిన జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించారు. ఈ ఏడాది జూన్ 30లో రిజిస్ట్రేషన్ రద్దు ఉపసంహరణ అప్లికేషన్‌ను సమర్పించాల్సి ఉంటుంది.*
- *జీఎస్‌టీ నెట్‌వర్క్ పరిధిలోని వ్యాపారులకు వస్తు సరఫరాదారుల వివరాలను తెలిపేందుకు వీలుగా 'నీ సరఫరాదారు గురించి తెలుసుకో' పేరుతో కొత్త వసతి ఏర్పాటుకు మండలి ఆమోదం తెలిపింది.*

## 18 నుంచి యెస్ బ్యాంక్‌పై మారటోరియం ఎత్తివేత

న్యూఢిల్లీ : యెస్ బ్యాంక్‌పై విధించిన మారటోరియాన్ని ఈ నెల 18 నుంచి ఎత్తివేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా ఈ నెలాఖరులోగా ప్రస్తుత సీఈఓ, ఎండీ ప్రశాంత్ కుమార్ సారథ్యంలో కొత్త బోర్డు కొలువు దీరనుందని తెలిపింది. యెస్ బ్యాంక్ పునరుద్ధరణ స్కీమ్ 2020 ను ప్రభుత్వం శుక్రవారం నోటిఫై చేసిన సంగతి తెలిసిందే. ఈ పునరుద్ధరణ ప్రణాళికలో భాగంగా మూడేళ్ల కాలంలో యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐ తన వాటాను 26 శాతానికి తగ్గించుకునే వీలు లేదని ప్రభుత్వం పేర్కొంది. అయితే యెస్ బ్యాంక్‌లో వాటాలు కలిగిన ఇతర ఇన్వెస్టర్లు, ప్రస్తుత వాటాదారులకు సంబంధించిన 75 శాతం పెట్టుబడులకు మూడేళ్ల లాకిన్ పీరియడ్ అమల్లో ఉంటుందని తెలిపింది. 100 షేర్ల కన్నా తక్కువ ఉన్న వాటాదారులకు మాత్రం ఈ లాకిన్ పీరియడ్ వర్తించదని పేర్కొంది. కాగా డిసెంబరు త్రైమాసికంలో యెస్ బ్యాంక్ రూ.18,564 కోట్ల నికర నష్టాలను ప్రకటించింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 14వ తేదీకి.. | | విజయవాడ | 290 |
| హైదరాబాద్ | 275 | విశాఖపట్నం | 355 |
| 15వ తేదీకి.. | | వరంగల్ | 278 |
| చిత్తూరు | 293 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 290 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 20 | విజయవాడ | 30 |
| వరంగల్ | 20 | గుంటూరు | 30 |
| మహబూబ్‌నగర్ | 20 | ఒంగోలు | 30 |
| కరీంనగర్ | 20 | చిత్తూరు | 34 |
| కర్నూలు | 20 | నెల్లూరు | 34 |
| విశాఖపట్నం | 16 | అనంతపురం | 41 |
| గోదావరి | 16 | | |

# 12 లక్షల మంది ప్రయాణికుల స్క్రీనింగ్

- విమాన ప్రయాణికుల్లో 15 శాతం తగ్గుదల
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో విదేశాల నుంచి వస్తున్న ప్రయాణికులకు తప్పనిసరిగా స్క్రీనింగ్ చేస్తున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 12 లక్షల మంది ప్రయాణికులకు స్క్రీనింగ్ జరిగిందని, వీరిలో కేవలం 3,225 మందికి మాత్రమే తదుపరి పరీక్షలు నిర్వహించాలని సూచించినట్టు ఆయన చెప్పారు. శనివారంనాడిక్కడ "వింగ్స్ ఇండియా 2020"లో భాగంగా నిర్వహించిన సమావేశంలో హర్‌దీప్ సింగ్ మాట్లాడారు. ప్రయాణికుల స్క్రీనింగ్, ఇతర సదుపాయాల కల్పన విషయంలో ఇతర దేశాలతో పోల్చితే భారత విమానాశ్రయాలు బెంచ్‌మార్క్‌గా నిలుస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా 30 విమానాశ్రయాల్లో పక్కగా చెకింగ్, స్క్రీనింగ్‌లు జరుగుతున్నాయని తెలిపారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 10,876 విమానాలను స్క్రీనింగ్ చేశామని, దాదాపు 12 లక్షల మందిని స్క్రీనింగ్ జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రెండు మరణాలు మాత్రమే నమోదయ్యాయని, మరో 80 మంది వైరస్ ప్రభావం నుంచి కోలుకుంటున్నారని చెప్పారు. కరోనా వైరస్ కారణంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి సవాలుగా ఉందని, ముఖ్యంగా పౌర విమానయాన రంగం ఇబ్బందులను ఎదుర్కొంటోందని అన్నారు.

### నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి : కేటీఆర్

*ఏవియేషన్, ఏరోస్పేస్ రంగాల్లో మంచి వృద్ధి నమోదు అవుతోందని, మరింత వృద్ధి చెందడానికి కూడా అవకాశాలున్నాయని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు అన్నారు. నైపుణ్యాల అభివృద్ధి, ఎంఆర్‌ఓ (నిర్వహణ, రిపేర్, ఓవర్‌హాల్) మౌలిక సదుపాయాల వృద్ధి, విదేశీ పెట్టుబడులపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయ ప్రాంగణంలో ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్ఎస్‌టీసీ)ను ప్రారంభించినట్టు గుర్తు చేశారు. ఎంఆర్‌ఓ రంగంతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడానికి అవకాశం ఉంటుందని, దీనితో భారీ స్థాయిలో పెట్టుబడులు కూడా రావడానికి ఆస్కారం ఉంటుందని కేటీఆర్ అన్నారు. కనెక్టివిటీని పెంచడానికి తమ ప్రభుత్వం మరిన్ని విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలన్న యోచనలో ఉందని తెలిపారు.*

### రాకపోకలపై ప్రభావం

కరోనా వైరస్ భయాల నేపథ్యంలో దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్య 10 శాతం నుంచి 15 శాతం వరకు తగ్గినట్టు హర్‌దీప్ సింగ్ తెలిపారు. అయితే ఈ పరిస్థితి సాధారణ స్థాయికి చేరుకుంటుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పరిశ్రమ మళ్లీ వృద్ధి బాట పడుతుందని చెప్పారు. త్వరలోనే భారత పౌర విమానయాన మార్కెట్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరిస్తుందన్నారు.

ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య 34.5 కోట్లుగా ఉందని, 2030 నాటికి ఇది 100 కోట్లకు చేరే అవకాశం ఉందని ఆయన చెప్పారు. పరిశ్రమలో రెండంకెల వృద్ధి నమోదవుతోందని తెలిపారు. కరోనా వైరస్ మూలంగా విమానయాన కంపెనీలకు ఇబ్బందులు ఉన్నా ఏ సంస్థకు కూడా ఆర్థిక సహకారం లేదా ఇతర ప్రత్యేక ప్రోత్సాహకాలు గానీ అందించే ప్రసక్తే లేదన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయని, ఈ నేపథ్యంలో 30 రోజులకు ఒకసారి జరుగుతున్న ధరల మార్పులను 15 రోజులకు మార్చాలని చమురు మంత్రిత్వ శాఖను కోరినట్టు మంత్రి తెలిపారు.

### జీఎస్‌టీ కిందకు ఏటీఎఫ్

విమానయాన రంగానికి మద్దతుగా విమాన ఇంధనాన్ని (ఏటీఎఫ్) వస్తుసేవల పన్ను పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని హర్‌దీప్ సింగ్ పురి అన్నారు. ఇందుకున్న అవకాశాన్ని పరిశీలించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరినట్టు తెలిపారు. విమానయాన కంపెనీల నిర్వహణ వ్యయాల్లో ఏటీఎఫ్ వాటాయే 40 శాతం ఉంటోందని, ఈ నేపథ్యంలో ఏటీఎఫ్‌ను జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావాలని పరిశ్రమ కోరుతోందన్నారు.

## వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు త్రైపాక్షిక ఒప్పందం

- జీహెచ్ఐఏఎల్‌తో స్పైస్‌జెట్, రస్ అల్ ఖైమా జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, ఎగుమతులకు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీహెచ్ఐఏఎల్), రస్ అల్ ఖైమా విమానాశ్రయంతో స్పైస్‌జెట్ చేతులు కలిపింది. హైదరాబాద్‌లో జరుగుతున్న 'వింగ్స్ ఇండియా'లో ఈ మేరకు త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. విమానయాన శాఖ ప్రవేశపెట్టిన కృషి ఉడాన్ పథకం కింద ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు జీహెచ్ఐఏఎల్, స్పైస్‌జెట్‌లు తెలిపాయి. హైదరాబాద్ ద్వారా భారత్ నుంచి యూఏఈ, పొరుగు దేశాలకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ఈ ఒప్పందం దోహదం చేస్తుంది. వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేయడానికి స్పైస్‌జెట్ డెడికేటెడ్ ఫ్రైట్ విమానాన్ని వినియోగిస్తుంది. ఏప్రిల్ నుంచి ఎగుమతులు ప్రారంభమయ్యే వీలుంది. పౌర విమానయాన శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి, తెలంగాణ పరిశ్రమల మంత్రి కే తారక రామారావు, స్పైస్‌జెట్ సీఎండీ అజయ్ సింగ్, జీహెచ్ఐఏఎల్ సీఈఓ ఎస్‌జీకే కిషోర్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. స్పైస్‌జెట్, రస్ అల్ ఖైమా ఎయిర్‌పోర్ట్‌తో జట్టు కట్టడం వ్యూహాత్మక అడుగని జీహెచ్ఐఏఎల్ సీఈఓ ఎస్‌జీకే కిషోర్ అన్నారు. ఒప్పందంలో భాగంగా ప్రత్యేక ఫ్రైట్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

**కాలుష్యాన్ని తెలుసుకోవడానికి:** ఐఓటీ, కృత్రిమ మేథ, డేటా అనలిటిక్స్ ద్వారా హైదరాబాద్ విమానాశ్రయంలో వాతావరణం, శబ్దం, కర్బన ఉద్గారాలను తెలుసుకోవడానికి ఎయిర్‌బస్ బిజ్‌ల్యాబ్, తెలంగాణ ప్రభుత్వంతో జీహెచ్ఐఏఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా బిజ్‌ల్యాబ్ తన ఏవీఎల్‌పీఎస్‌యూఎం సొల్యూషన్ ద్వారా కర్బన ఉద్గారాలు, శబ్ద కాలుష్యాన్ని విశ్లేషిస్తుంది. ఎమిషన్ ఇన్వెంటరీ డేటా బేస్‌ను తయారు చేస్తుంది.

## చెన్నైలో ఎన్‌సీఎల్‌ఏటీ బెంచ్

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల కోసం చెన్నైలో నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ బెంచ్ (ఎన్‌సీఎల్‌ఏటీ) ఏర్పాటుకానుంది. ఈ మేరకు శనివారం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ, లక్షద్వీప్, పుదుచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన అప్పీళ్లపై ఈ బెంచ్ విచారణ చేపడుతుందని పేర్కొంది. కాగా, ఈ నోటిఫికేషన్ ఈ నెల 18వ తేదీ నుంచి అమల్లో వస్తుందని కార్పొరేట్ వ్యవహారాల శాఖ వెల్లడించింది.

## పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ రూ.3 పెంపు

(మొదటి పేజీ తరువాయి)

పెంపు ఫలితంగా పెట్రోలుపై మొత్తం ఎక్సైజ్ డ్యూటీ రూ.22.98కి, డీజిల్‌పై రూ.18.83కు చేరనుంది. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014లో ఇది పెట్రోలుపై రూ.9.48, డీజిల్‌పై రూ.3.56గా ఉండేది. ఈ నేపథ్యంలో తాజా ఎక్సైజ్ డ్యూటీ పెంపును ప్రతిపక్ష కాంగ్రెస్ తప్పుబట్టింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల తగ్గుదలకు అనుగుణంగా పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేసింది.

## ఆరెస్సెస్ ప్రతినిధి సభ సమావేశాలు రద్దు

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో కరోనా వైరస్ ప్రభావం నేపథ్యంలో.. బెంగళూరులో ఆదివారం నుంచి జరగాల్సిన ఆరెస్సెస్ అఖిల భారత ప్రతినిధి సభ సమావేశాలు రద్దయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు ఈ సమావేశాలను రద్దు చేసినట్లు అఖిల భారత సహ ప్రచారక్ నరేంద్ర ఠాకూర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## శవ దహనమా? మమ్మీల్లా పాతేయడమా?

- కరోనాతో చనిపోతే ఎలా?.. కేంద్రం మార్గదర్శకాలు!

న్యూఢిల్లీ, మార్చి 14: కరోనా వైరస్‌తో చనిపోయేవారి అంత్యక్రియలు ఎలా జరపాలి? మృతదేహాలకూ.. వాటి నుంచి వెలువడే ప్రత్యేక ద్రవాల్లోనూ కరోనా ఉంటుంది. అలాంటప్పుడు వైరస్ ఇతరులకు సోకకుండా మృతదేహాలను దహనం చేయడమా? లేక.. ఈజిప్టు మమ్మీలకు మాదిరిగా.. పటిష్ఠమైన భద్రత ఉండే బ్యాగులో మృతదేహాలను చుట్టేసి, పాతి పెట్టడమా? ఢిల్లీలో కరోనాతో మృతిచెందిన 68 ఏళ్ల మహిళ అంత్యక్రియల సందర్భంలో ఈ సందిగ్ధం నెలకొన్న నేపథ్యంలో.. కేంద్రం మార్గదర్శకాల రూపకల్పనకు సిద్ధమైంది. వాటిలో కొన్ని.. కరోనాతో మృతిచెందిన వ్యక్తికి పోస్టుమార్టం నిర్వహించే వైద్యుడు, ఇతర సిబ్బంది బాధితులుగా మారే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో వారికి వాడిపారేసే ప్రొటెక్టివ్ గౌన్లు, గ్లౌస్, మాస్కులు అందజేయాలి. వారు వాడే గౌన్లు నీటి నిరోధకాలు(వాటర్‌ప్రూఫ్) అయ్యి ఉండాలి. మృతదేహం నుంచి కారే ద్రవాల ద్వారా వైరస్ వ్యాప్తి చెందకుండా.. వాటిని ప్రత్యేక బ్యాగ్‌లలో చుట్టివేయాలి. శవాగారాల్లో (మార్చురీలు) కూడా మృతదేహం తాలూకు కరోనా వైరస్ సజీవంగా ఉండే ప్రమాదముంది. దీనిపైనా ప్రత్యేక దృష్టి సారించాలి. విద్యుత్తు, సీఎన్‌జీ (కాంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) దహనవాటికల్లో అంత్యక్రియలు చేయడం మంచిదని కేంద్రం భావిస్తోంది. కాగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) సూచనలనూ కేంద్రం పరిగణనలోకి తీసుకుంటోంది.



ముందుచూపుతో రువాండాలో ఏర్పాటుచేసిన పోర్టబుల్ వాష్‌బేసిన్లు ఇవి. ఒకరి నుంచి మరొకరికి కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా కిగాలి బస్‌పార్క్‌లో వీటిని ఏర్పాటు చేశారు. చేతులను శుభ్రం చేసుకున్న తరువాతే ప్రయాణికులను బస్సుల్లోకి అనుమతిస్తారు. చేతులతో టాప్ తిప్పాల్సిన పని లేకపోవడం దీని ప్రత్యేకత కాలితో బటన్‌ను నొక్కగానే నీళ్లొస్తాయి.

## మోదీ ప్రతిపాదనకు పాక్ ఓకే

- 'సార్క్' వ్యూహంపై చర్చించడానికి సిద్ధమని ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 14: ప్రధాని మోదీ ప్రతిపాదించిన 'సార్క్ దేశాల ఉమ్మడి వ్యూహం' అంశంపై పాకిస్థాన్ సానుకూలంగా స్పందించింది. వ్యూహ రూపకల్పనపై వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు శనివారం తెలిపింది. కరోనాపై పోరులో సార్క్ దేశాలు ప్రపంచానికి ఆదర్శం కావాలని మోదీ శుక్రవారం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కాగా, హోమ్ క్వారెంటైన్‌కు సంబంధించి శనివారం మోదీ ఆరోగ్య శాఖ సూచనలను ట్వీట్ చేశారు. "మిమ్మల్ని, మీరు ప్రేమించేవాళ్లని రక్షించుకోవడానికే హోమ్ క్వారెంటైన్. వెంటిలేషన్ బాగా ఉన్న రూములో ఒక్కరే ఉండండి. ఒకరి కంటే ఎక్కువ ఉండాల్సి వస్తే ఇద్దరి మధ్య కనీసం మీటరు దూరం ఉండేలా చూసుకోండి" అని ఆరోగ్య శాఖ సూచించింది.

## బెంగళూరులో భవనాన్ని ఖాళీ చేసిన ఇన్ఫోసిస్

బెంగళూరు, మార్చి 14: ప్రఖ్యాత సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ బెంగళూరు ఐపీఎం కాంప్లెక్స్‌లోని కార్యాలయాన్ని శనివారం తాత్కాలికంగా ఖాళీచేసింది. తమ ఉద్యోగి ఒకరు.. కరోనా రోగిని కలిసినట్లు సమాచారం రావడమే ఇందుకు కారణమని తెలిపింది. అయితే.. సిబ్బంది ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఇది కేవలం ముందుజాగ్రత్త మాత్రమేనని ప్రకటించింది.

## కరోనా పాజిటివ్ పరార్

- బెంగళూరులో క్వారంటైన్ నుంచి పారిపోయిన భార్య

ఆగ్రా, మార్చి 14 : అతడు బెంగళూరులోని గూగుల్‌లో ఉద్యోగి. గత నెల్లోనే అతనికి వివాహమైంది. హనీమూన్ కోసం కొత్త జంట అదే నెలలో యూరోప్‌కు వెళ్లింది. ఇటలీ, గ్రీస్, ఫ్రాన్స్ దేశాల్లో పర్యటించి మాసం చివరలో వారిద్దరూ బెంగళూరుకు తిరిగివచ్చారు. అయితే కరోనా అనుమానంతో ఈనెల 7న ఓ ఆస్పత్రిలో భర్త పరీక్ష చేయించుకోగా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. దీంతో అతడిని క్వారంటైన్‌లో ఉంచారు. అతడి భార్యను కూడా పరీక్షించగా ఆమెకూ వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో ఆమెను కూడా క్వారంటైన్‌లో ఉంచారు. భయపడి ఆమె ఈనెల 8న ఆస్పత్రి నుంచి పరారైంది. నగరంలో విమానం ఎక్కి ఢిల్లీ వరకు ప్రయాణించింది. అక్కడి నుంచి ఆగ్రా వరకు రైల్లో ఉత్తరప్రదేశ్‌లోని తన సొంతూరు వెళ్లింది. ఈ విషయం ఆగ్రా ఆరోగ్యాధికారులకు తెలియడంతో వారు ఆమె ఇంటికి వెళ్లారు. బాధితురాలిని, ఆమె కుటుంబ సభ్యులను క్వారంటైన్‌లో ఉంచడానికి ప్రయత్నించగా వారు ప్రతిఘటించారు. దీంతో జిల్లా కలెక్టరు జోక్యం చేసుకొని పోలీసుల సాయంతో మొత్తం ఎనిమిది మంది కుటుంబ సభ్యులను క్వారంటైన్‌లో ఉంచగలిగారు. ఉద్యోగి భార్యను ఆగ్రాలోని ఎస్ఎన్ మెడికల్ కాలేజీలోని ఓ ఏకాంత వార్డుకు తరలించారు.

## కన్నతండ్రి కడసారి చూపూ అద్దంలోంచే..

- కేరళలో హృదయ విదారక ఘటన

కొట్టాయం, మార్చి 14: ప్రాణాలు కోల్పోయిన తన తండ్రి మీద పడి ఏడవడానికి లేదు. కనీసం ముట్టుకోవడానికీ వీల్లేదు. కడసారి చూపు కూడా కిటికీ అద్దంలోంచే.. గుండె పగిలిపోయే ఈ సంఘటన కేరళలోని కొట్టాయంలో జరిగింది. ఇడుక్కి జిల్లాలోని తోడుప్పుజకు చెందిన లినో అబెల్ తండ్రి దగ్గుతో మంచంపై నుంచి పడిపోయారు. ఆయనను ఇక్కడి మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్చారు. దాంతో కరోనా ప్రభావిత దేశాల్లో ఒకటైన కతార్ నుంచి అబెల్ ఇటీవలే రావడంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. ముందస్తు జాగ్రత్తగా ఇద్దరినీ ఐసొలేషన్‌లో ఉంచారు. ఆరోగ్యం మరింతగా విషమించి గుండెపోటుతో తండ్రి చనిపోయారు. అబెల్ కూడా అదే ఆస్పత్రి ఐసోలేషన్‌లో ఉండడంతో.. తండ్రి మృతదేహాన్ని తాకడానికి వీల్లేకుండా పోయింది. అంబులెన్స్‌లో ఉన్న తండ్రి మృతదేహాన్ని ఐసొలేషన్ కిటికీ అద్దంలోంచే చూసి కన్నీరుమున్నీరయ్యాడు. తన తండ్రిని ఆస్పత్రికి తీసుకురాకుంటే ఇలా అద్దంలోంచి చూడాల్సి వచ్చేది కాదని, అయితే కరోనా మహమ్మారి బారిన మరొకరు పడకుండా ఉండాలనే ఆస్పత్రికి తీసుకెళ్లానని అబెల్ తెలిపాడు. కరోనా లక్షణాల అనుమానం ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నానని చెప్పాడు. తన తండ్రితో గడపాలని కతార్ నుంచి వస్తే.. ఈ దుర్ఘటన జరిగిందని అబెల్ చేసిన ఫేస్‌బుక్ పోస్ట్ వైరల్ అవుతోంది. సామాజిక బాధ్యతతో వ్యవహరించిన అబెల్‌ను కేరళ సీఎం పినరయి విజయన్ ప్రశంసించారు. తీరా చూస్తే.. అబెల్‌కి కరోనా లేదని రిపోర్టుల్లో తేలింది.

### కన్నతండ్రి కడసారి చూపూ

## అద్దంలోంచే...

**▸▸ కేరళలో హృదయ విదారక ఘటన**

కొట్టాయం, మార్చి 14: ప్రాణాలు కోల్పోయిన తన తండ్రి మీద పడి ఏడవడానికి లేదు. కనీసం ముట్టుకోవడానికీ వీల్లేదు. కడసారి చూపు కూడా కిటికీ అద్దంలోంచే.. గుండె పగిలిపోయే ఈ సంఘటన కేరళలోని కొట్టాయంలో జరిగింది. ఇడుక్కి జిల్లాలోని తోడుపుజకు చెందిన లినో అబెల్ తండ్రి దగ్గుతో మంచంపై నుంచి పడిపోయారు. ఆయనను ఇక్కడి మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్చారు. దాంతో కరోనా ప్రభావిత దేశాల్లో ఒకటైన కతార్ నుంచి అబెల్ ఇటీవలే రావడంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. ముందస్తు జాగ్రత్తగా ఇద్దరినీ ఐసొలేషన్‌లో ఉంచారు. ఆరోగ్యం మరింతగా విషమించి గుండెపోటుతో తండ్రి చనిపోయారు. అబెల్ కూడా అదే ఆస్పత్రి ఐసోలేషన్‌లో ఉండడంతో.. తండ్రి మృతదేహాన్ని తాకడానికి వీల్లేకుండా పోయింది. అంబులెన్స్‌లో ఉన్న తండ్రి మృతదేహాన్ని ఐసోలేషన్ కిటికీ అద్దంలోంచే చూసి కన్నీరుమున్నీరయ్యాడు. తన తండ్రిని ఆస్పత్రికి తీసుకురాకుంటే ఇలా అద్దంలోంచి చూడాల్సి వచ్చేది కాదని, అయితే కరోనా మహమ్మారి బారిన మరొకరు పడకుండా ఉండాలనే ఆస్పత్రికి తీసుకెళ్లానని అబెల్ తెలిపాడు. కరోనా లక్షణాల అనుమానం ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నానని చెప్పాడు. తన తండ్రితో గడపాలని కతార్ నుంచి వస్తే.. ఈ దుర్ఘటన జరిగిందని అబెల్ చేసిన ఫేస్‌బుక్ పోస్ట్ వైరల్ అవుతోంది. సామాజిక బాధ్యతతో వ్యవహరించిన అబెల్‌ను కేరళ సీఎం పినరయి విజయన్ ప్రశంసించారు. తీరాచూస్తే.. అబెల్‌కి కరోనా లేదని రిపోర్టుల్లో తేలింది.

### ఎట్టకేలకు ఇంటికి చేరిన జ్యోతి

**▸▸ ఫిబ్రవరి 27నే భారత్ చేరిక**

శంషాబాద్‌రూరల్: కరోనా పుట్టిల్లు వూహాన్‌లో చిక్కుకున్న కర్నూలు జిల్లావాసి జ్యోతి ఎట్టకేలకు ఇంటికి చేరింది. ఫిబ్రవరి 27నే ఎయిరిండియా విమానంలో భారత్ చేరిన ఆమెకు ఢిల్లీ విమానాశ్రయంలో థర్మల్ స్ర్కీనింగ్ చేయగా.. కరోనా లక్షణాలు బయటపడ్డాయి. దీంతో ఆమెను అక్కడి మానేసర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించగా.. పాజిటివ్ వచ్చింది. దీంతో అక్కడే 15 రోజులు ఉంచి చికిత్స అందించారు. పూర్తిగా కోలుకుందని వైద్యులు నిర్ధరించాక.. శనివారం ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసి హైదరాబాద్ పంపించారు. ఇక్కడి శంషాబాద్ విమానాశ్రయం నుంచి వైద్యసిబ్బంది ఆమెను ప్రత్యేక వాహనంలో కర్నూలుకు పంపించారు. చిత్తూరు జిల్లా శ్రీసిటీలోని టీసీఎల్ కంపెనీలో పనిచేసే జ్యోతి.. గత సంవత్సరం ఆగస్టులో ట్రైనింగ్ నిమిత్తం తోటి ఉద్యోగులతో కలిసి వూహాన్ వెళ్లింది. అక్కడ జనవరి నుంచి కరోనా విజృంభించడంతో ఆమెతో సహా టీసీఎల్ ఉద్యోగులంతా అక్కడే చిక్కుకుపోయారు. ఫిబ్రవరి 1న భారత్ ప్రత్యేక విమానం పంపి అక్కడ చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించింది. ఆ సమయంలో జ్యోతి తీవ్రమైన జ్వరంతో బాధపడుతుండడంతో ఆమెను విమానం ఎక్కించేందుకు చైనా అధికారులు అంగీకరించలేదు. అప్పటి నుంచి అక్కడే ఉండిపోయిన ఆమె.. భారత్ వచ్చేందుకు అనేక ప్రయత్నాలు చేసింది. ఎట్టకేలకు ఫిబ్రవరి 27న భారత్ చేరింది. ఈ క్రమంలో ఫిబ్రవరి 18న జరగాల్సిన ఆమె పెళ్లి కూడా వాయిదాపడింది. కాగా, మలేషియా, అమెరికా నుంచి వచ్చిన ఇద్దరికి కరోనా లక్షణాలు ఉండడంతో.. అధికారులు పరీక్షల కోసం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక వాహనంలో గాంధీ ఆస్పత్రికి తరలించారు. వారి వివరాలను గోప్యంగా ఉంచారు. ఇప్పటి వరకు ఎంతో మంది కరోనా అనుమానితులను గాంధీకి పంపినా ఒక్కరికి కూడా పాజిటివ్ రాలేదని ఎయిర్‌పోర్టు వైద్య బృందం తెలిపింది.

### లండన్‌లో నవజాత శిశువుకు కరోనా

బ్రిటన్‌లో అప్పుడే పుట్టిన ఓ ఆడశిశువుకు కరోనా వైరస్ ఉన్నట్లు డాక్టర్లు తేల్చారు. మిడిల్‌సెక్స్‌లోని ఎడ్మాంటన్ ఆసుపత్రిలో ఈ శిశువు జన్మించింది. ప్రపంచంలో ఈ వైరస్ వచ్చిన అతి పిన్న వయస్కురాలు ఆ శిశువే. ప్రసవానికి ముందు ఆ శిశువు తల్లి న్యుమోనియాతో బాధపడుతోంది. చాలా నీరసంగా ఉంది. అయితే కరోనా సంబంధ పరీక్షలు ఆమెకు చేయలేదు. శిశువు పుట్టాక తల్లి శాంపిల్స్ కూడా పరీక్షకు పంపారు. తల్లీ బిడ్డలను వేరుచేసి తల్లిని ప్రత్యేక ఏకాంతవాస వార్డుకు తరలించారు. బ్రిటన్‌లో ఒక్కరోజే పదిమంది మరణించడంతో మృతుల సంఖ్య 21కు పెరిగింది.



కరోనా వైరస్ వేగంగా ప్రబలుతున్న నేపథ్యంలో పారిస్‌లోని ఈఫిల్ టవర్‌ను శుక్రవారం నుంచి మూసేశారు. పరిస్థితులు చక్కబడిన అనంతరం తిరిగి సందర్శకులను అనుమతిస్తారు.

# కరోనా విశ్వరూపం

## 149 దేశాల్లో ఉగ్రతాండవం.. లక్షన్నర కేసులు- 5500 మృతులు



శ్వేతసౌధంలో జరిగిన ఓ కార్యక్రమంలో అధ్యక్షుడు ట్రంప్, ఎల్‌హెచ్‌సీ గ్రూప్ ప్రతినిధి బ్రూస్ గ్రీన్‌స్టెయిన్‌ల మోచేతి వందనం

వాషింగ్టన్, మార్చి 14: కరోనావైరస్ ఉగ్రతాండవం చేస్తోంది. 149 దేశాలకు విస్తరించింది. అంటే మూడొంతుల పైబడి ప్రపంచాన్ని కమ్మేసింది. కరోనా బారిన పడ్డవారి సంఖ్య లక్షన్నరకు చేరుకున్నప్పటికీ ఇందులో 73, 726 మందికి నయమై డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం ఏకాంతవాసంలో ఉన్న 75వేల మందిలో 6వేల మంది పరిస్థితి గడ్డుగా ఉంది.

అమెరికాలో మృతుల సంఖ్య 50కి చేరడంతో దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని విధించారు. ఎమర్జెన్సీ కింద దాదాపు 50 బిలియన్ డాలర్ల మేర నిధులు అందుబాటులోకి వస్తాయి. ఇక ప్రతీ రాష్ట్రంలో అత్యవసరంగా వైద్య కేంద్రాలు, ఐసోలేషన్ వార్డులు ఏర్పాటవుతాయి. ప్రతీ ఆసుపత్రికీ అనుబంధంగా అత్యవసర చికిత్స సౌకర్యాలు ఏర్పాటవుతాయి. స్కూళ్లు, కాలేజీలు, సినిమా హాళ్లు, క్రీడా పోటీలు... అన్నీ బంద్ అయ్యాయి. మెడికల్ షాపులు, అత్యావశ్యకమైన నిత్యావసరాలు తప్ప దాదాపుగా అన్నీ మూతపడ్డాయి. సామూహిక ప్రార్థనలు, మత సమావేశాల్ని అన్ని రాష్ట్రాలూ ఎప్పుడో నిలిపేశాయి. కరోనా పరీక్షలు నిమిత్తం తగు సంఖ్యలో కిట్లు లభించకపోవడంతో ప్రైవేటు రంగ సహకారాన్ని సైతం తీసుకుంటున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అమెరికా ఇప్పటికే యూరప్‌కు విమాన సర్వీసులన్నీ నిలిపేసింది. ఇపుడు బ్రిటన్‌కు కూడా ఆపేసింది. మెక్సికో, హోండూరాస్‌ల సరిహద్దులు మూసేసింది.

### ట్రంప్‌కూ టెస్టులు

ట్రంప్ కూడా కరోనా సంబంధ పరీక్షలు చేయించుకున్నారు. 'వైట్‌హౌస్‌లోనే డాక్టర్ల బృందం నన్ను పరీక్షించింది. శుక్రవారం రాత్రి అవసరమైన పరీక్షలు చేయించుకున్నాను. ఫలితాలు రెండు మూడు రోజుల్లో తెలుస్తాయి' అని శనివారం నాడు మీడియాకు చెప్పారు. 'నాకు ఆ లక్షణాలేవీ లేవు గానీ ముందుజాగ్రత్తగా చేయించుకుంటా' అని ఆయన రెండ్రోజుల కిందటే ట్రంప్ చెప్పారు. గతవారం బ్రెజిల్ అధ్యక్షుడు బోల్సెనారోతో ఆయన వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు.

### కెనడా పార్లమెంట్ మూసివేత

కెనడాలో పార్లమెంట్‌ను కూడా నిరవధికంగా మూసేశారు. ప్రస్తుతం ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో ఏకాంతవాసంతో ఇంట్లోనే ఉంటున్నారు. కారణం... ఆయన భార్య సోఫీకి వైరస్ సోకడం! పార్లమెంట్ మూసివేతతో కేంద్ర బడ్జెట్ సమర్పణ నిలిచిపోయింది. దేశంలో అనేక ఆంక్షలు విధించారు. ఇందులో వ్యక్తుల మధ్య దూరం పాటించాలన్నది ప్రధానమైనది.

### ఇటాలియన్ల ఆటా.. పాటా!

ఇక వైరస్ వ్యాప్తికి కేంద్రస్థానంగా మారిన ఐరోపాలో వైరస్ సోకని దేశమంటూ లేదు. ఐరోపాలో కేంద్రస్థానంగా మారిన దేశం ఇటలీ. ప్రస్తుతం నిర్మానుష్యమైన వీధులు, కర్ఫ్యూని తలపించేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాగా, వైరస్‌నుంచి కోలుకున్న చైనా ఇటలీని ఆదుకునేందుకు రంగంలోకి దిగింది. నిపుణులైన వైద్య బృందాన్ని రోమ్‌కు పంపింది.

### ఇరాన్: మిలటరీ చేతుల్లోకి వైరస్ వ్యాప్తి నిరోధం

గల్ఫ్ దేశాల్లో వైరస్ బారిన పడి విలవిల్లాడుతున్న ఇరాన్‌లో ఒక్కరోజులో 100 మంది చనిపోవడంతో మృతుల సంఖ్య 614కు పెరిగింది. 12,783 మందికి ఇది సోకింది. ప్రజారోగ్య శాఖ సూచనలు పక్కనపెట్టి యథేచ్ఛగా ప్రజలు తిరుగాడుతుండడంతో పరిస్థితిని సైన్యం (రివల్యూష్యనరీ గార్డ్స్) తన చేతుల్లోకి తీసుకుంది. ఇక రోడ్లపై ఎవరు సమూహాలుగా కనబడ్డా, షాపులు తెరిచినా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఇళ్లలోనే ఉండాల్సిందిగా కోరింది. వైరస్ కేంద్ర స్థానమైన క్వోమ్ నగరంలో సామూహిక ఖననానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యాలు బయటకు పొక్కాయి.

### స్పెయిన్ నుంచి గాల్లోనే విమానాలు వెనక్కి!

ఇటలీ తరువాత వైరస్ తీవ్రంగా ఉన్న స్పెయిన్‌లో ఒక్క రోజులోనే కేసుల సంఖ్య ఏకంగా 1500కు పైగా పెరిగి 6వేలు దాటాయి. మృతుల సంఖ్యను కొన్ని వెబ్‌సైట్లు 136 మాత్రమే అని తెలపగా మరికొన్ని 191కు పెరిగాయని వెల్లడించాయి. కాగా, లండన్ నుంచి స్పెయిన్‌కు బయల్దేరిన నాలుగు జెట్2 విమానాలు బార్సిలోనా వరకూ వెళ్లి గాల్లోనే వెనుదిరిగాయి. స్పెయిన్‌లో 15రోజుల ఎమర్జెన్సీ అమల్లో ఉంది. దేశమంతా లాక్‌డౌన్‌లో ఉంది. ప్రయాణీకులందరి భద్రత దృష్ట్యా ఆఖరి నిమిషంలో ల్యాండ్ అవకుండా వెనక్కి వచ్చేయాలని సంకేతాలు పంపారు.

### న్యూజిలాండ్ కఠిన ఆంక్షలు

విదేశాల నుంచి న్యూజిలాండ్‌కు వచ్చేవారు తప్పనిసరిగా 14రోజుల పాటు స్వయం ఏకాంతవాసంలోకి వెళ్లాలని అక్కడి ప్రభుత్వం ఆదేశించింది. ఇది న్యూజిలాండ్‌వాసులకూ వర్తిస్తుంది. ఇప్పటిదాకా వైరస్ బారిన పెద్దగా పడని న్యూజిలాండ్ ముందుజాగ్రత్త చర్యగా ఇది తీసుకున్నట్లు ప్రధాని జసిండా ఆర్డెన్ తెలిపారు. ఏ విదేశీయులూ దేశంలో తిరగడానికి వీల్లేదన్నారు. చివరకు నిరుడు క్రైస్ట్‌చర్చ్ ఊచకోత మృతుల సంస్మరణ కార్యక్రమం కూడా వాయిదావేసింది.

### రష్యా : సరిహద్దులు మూసివేత

రష్యాలో మరణాలేవీ చోటుచేసుకోలేదు. కానీ కేసుల సంఖ్య 59కు పెరిగింది. చైనాతో 4,200 కి.మీ. పొడవునా ఉన్న ప్రవేశ మార్గాలను పుతిన్ ప్రభుత్వం బంద్ చేసింది. పోలెండ్, నార్వే సరిహద్దులనూ మూసేసింది. రష్యాతో పాటు పోలెండ్, ఉక్రెయిన్, స్విట్జర్లాండ్, వెనెజులా, కొలంబియా... ఇలా ప్రతీ దేశమూ సరిహద్దుల్ని మూసేసింది. మనిలాలో వైరస్ వ్యాప్తి ప్రబలంగా ఉండడంతో ఫిలిప్పీన్స్ ప్రభుత్వం అక్కడ పూర్తి కర్ఫ్యూ విధించింది. కొన్ని నియంత్రణలు విధించి వాటిని పాటిస్తూ అత్యవసరాల కోసం మాత్రమే ప్రజలను అనుమతిస్తామని, పగటిపూట ఆఫీసులు వెళ్లడానికి పరిమితంగా పర్మిషన్లు ఇస్తామని, రాత్రిళ్లు అంటే సాయంత్రం 7 గంటల నుంచే కర్ఫ్యూ అమలు చేస్తామని అధ్యక్షుడు రోడ్రిగో డుటార్టె చెప్పారు.

### పాక్‌లో స్కూళ్ల మూసివేత

పాకిస్థాన్‌లో కరోనా వైరస్ కేసుల సంఖ్య 33కు పెరిగింది. దేశమంతా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్లు, ప్రార్థనా స్థలాలను తాత్కాలికంగా మూసేస్తున్నట్లు ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రకటించారు.

# ఇల్లు కదలొద్దు!




చెన్నైలో చేతుల శుభ్రతపై విద్యార్థుల అవగాహన కార్యక్రమం

(మొదటిపేజీ తరువాయి)

సమీక్షిస్తున్నారు. విజయవాడ నుంచి కూడా ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నారు. దీనికోసం రెండు జిల్లాలకు కలిపి ఒక అధికారిని నియమించారు. ఆ అధికారి నిరంతరం ఫోన్లలో వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. అనుమానం వచ్చినవారిని వెంటనే స్థానిక ఆస్పత్రుల్లోని ఐసోలేషన్ వార్డులకు తరలిస్తున్నారు. విదేశాల నుంచి వచ్చిన వారి సంఖ్య కడప, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికంగా ఉన్నట్లు గుర్తించారు.

### 'గుంటూరు'లో 400మంది...

గుంటూరు(మెడికల్): కరోనా భయంతో విదేశాల నుంచి వచ్చిన 400మంది గుంటూరు జిల్లావాసులను ప్రభుత్వం గృహ నిర్బంధంలో ఉంచింది. వీరిలో గుంటూరు అర్బన్ ప్రాంతంలో 201మంది, జిల్లాలోని వివిధ పట్టణాలు, గ్రామాలకు చెందినవారు 199మంది ఉన్నారు. వీరి ఇళ్లకు వెళ్లిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది 14రోజుల పాటు బయటకు రావద్దని ఆదేశించారు. జ్వరం, దగ్గు, జలుబు, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. వీరిలో అత్యధికులు ఇటలీ, దక్షిణ కొరియా, ఇరాన్, సింగపూర్ తదితర దేశాలనుంచి గతవారంలో వచ్చినవారే. కేంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు ఆ వివరాలను డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపడటంతో.. అందరినీ హోం క్వారంటైన్‌లో ఉంచారు. వ్యాధి లక్షణాలు లేకపోవడంతో కేవలం కోవిడ్-19 అనుమానితులుగా మాత్రమే భావించి గృహ నిర్బంధంలో ఉంచారు. ఆరోగ్య సిబ్బంది రోజూ ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య స్థితి పరిశీలిస్తున్నారు. కాగా, గృహ నిర్బంధంలో ఉన్న కొందరు బయట తిరుగుతున్నారంటూ ఆరోగ్యశాఖకు ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, విదేశాల నుంచి వచ్చిన వారు క్వారంటైన్ కాలం ముగిసే వరకు బయట తిరగొద్దని డీఎంహెచ్‌వో యాస్మిన్ ఆదేశించారు. శనివారం నుంచి డీఎంహెచ్‌వోలకు ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారాలు ఇచ్చిందని, బయటకు వచ్చినవారిని అరెస్ట్ చేయించి నిర్బంధంగా ప్రభుత్వాస్పత్రుల్లోని ఐసోలేషన్ వార్డులకు తరలిస్తామని హెచ్చరించారు. కరోనా తీవ్రత నేపథ్యంలో పెళ్లిళ్లు, వేడుకలు, ఊరేగింపులకు ప్రజలు దూరంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈనెల 30వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. తెనాలికి చెందిన ఒక యువకుడిలో అనుమానిత లక్షణాలు ఉండటంతో నమూనాలు ల్యాబ్‌కు పంపగా కరోనా నెగటివ్ అని తేలింది.



నెల్లూరు రైల్వే స్టేషన్ నిర్మానుష్యం

### ప్రవాసులతో గజగజ

కరోనా భయంతో విదేశాలు వదిలి స్వస్థలాలకు వస్తున్న ప్రవాసాంధ్రులను చూసి ఇరుగు, పొరుగు ఆందోళనకు గురవుతున్నారు. వీరిద్వారా వైరస్ వ్యాపించే ప్రమాదం ఉందనే భయంతో ఆరోగ్యశాఖకు, మీడియా కార్యాలయాలకు ఫోన్ చేసి సమాచారం ఇస్తున్నారు. కొందరు ఎన్నారైలు, ఇటీవల విదేశాలకు వెళ్లొచ్చినవారు గృహనిర్బంధం, ఐసోలేషన్ వార్డుకు వెళ్లకుండా తప్పించుకొనేందుకు అబద్ధాలాడుతున్నారు. గుంటూరు నగరానికి చెందిన ముస్లిం యువకుడు ఇటీవల మక్కాకు వెళ్లి వచ్చాడు. అతడిని గృహనిర్బంధంలో ఉంచమని కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశించింది. ఆరోగ్య సిబ్బంది ఇంటికి వస్తే తాను మక్కా వెళ్లలేదని, కావాలంటే చుట్టుపక్కల విచారించుకోవాలని బుకాయించాడు. అయితే సిబ్బంది తగిన ఆధారాలు చూపడంతో కిక్కురుమనలేదు. బయట తిరగొద్దని, లేకుంటే ఐసోలేషన్ వార్డుకు పంపుతామని డీఎంహెచ్‌వో అతడిని హెచ్చరించారు. ఇలాంటి ఉదంతాలు రోజుకు ఐదారు వెలుగు చూస్తున్నాయి.

## ఆస్పత్రుల్లో 21 మంది

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో కరోనా అనుమానితుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి రోజు ఇద్దరు, ముగ్గురు వరకూ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ప్రసుత్తానికి నెల్లూరులో పాజిటివ్ కేసు మినహా, ఎక్కడా కొత్త కేసులు నమోదు కాలేదు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో 21 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో 12 మంది నివేదికలు సోమవారం అందనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మినీ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించడంతో ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. విదేశాల నుంచి వచ్చిన ముగ్గురిని శనివారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని జీజీహెచ్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇటీవల జిల్లాలోని మలికిపురానికి చెందిన వ్యక్తి(39) ఖత్తర్ నుంచి, రాజమహేంద్రవరానికి చెందిన వ్యక్తి(36) యూకే నుంచి, రామచంద్రపురం మండలం శ్రీరాంపేటకు చెందిన వ్యక్తి(32) మస్కట్ నుంచి వచ్చారు. ఈ ముగ్గురి సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు వారిని జీజీహెచ్‌లోని ప్రత్యేక ఐసోలేషన్ వార్డుకు తరలించారు. మలికిపురం వ్యక్తి కొన్ని రోజుల నుంచి జలుబు, దగ్గు తగ్గడం లేదని వైద్యాధికారులు ఇంటింటి సర్వేలో గుర్తించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఆ వ్యక్తిని, ముగ్గురు కుటుంబ సభ్యులను శుక్రవారం అర్ధరాత్రి పోలీసుల సాయంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించడం కలకలం రేపింది. అయితే వారికి వైరల్ ఫీవర్ అని, కరోనా లక్షణాలు లేవని తెలిపినట్టు సమాచారం. అలాగే జిల్లాలోని అన్నవరం గ్రామానికి చెందిన ముగ్గురు కువైట్, అమెరికా, జపాన్ నుంచి ఈ నెల 9, 15 తేదీల్లో వచ్చారు. వారి వివరాలు కూడా వైద్య ఆరోగ్య శాఖాధికారులు సేకరించారు. వారినీ త్వరలో కాకినాడ జీజీహెచ్‌కు తీసుకొస్తారని తెలిసింది. కరోనా నేపథ్యంలో ప్రభుత్వం సూచనల మేరకు ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం విద్యార్థులకు శనివారం నుంచి సెలవు ప్రకటించినట్టు రిజిస్ట్రార్ ఆచార్య బి.గంగారావు తెలిపారు. విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌ల తోపాటు అనుబంధ కళాశాలల విద్యార్థులందరికీ సెలవు ప్రకటించామన్నారు. కాగా, శుక్రవారం కడప రిమ్స్‌లో చేరిన మహిళకు కరోనా లేదని శనివారం నివేదికలు వచ్చాయి. ఆమెకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన తరువాత రిమ్స్ నుంచి పంపిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్ తెలిపారు. కాగా, కరోనాపై ఆర్టీసీ కృష్ణా రీజియన్ ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. విజయవాడ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి నడిపే ఏసీ బస్సులతో పాటు విజయవాడ ఎయిర్‌పోర్టుకు నడిచే ఏసీ బస్సుల్లో సోడియం హైపో క్లోరైడ్‌ను స్ర్పే చేయిస్తోంది. కరోనా వైరస్ కారణంగా అమెరికాలో ఇబ్బందులు పడుతున్న భారత విద్యార్థులను ఆదుకునేందుకు తానా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. కరోనా నియంత్రణలో భాగంగా మూతపడిన కాలేజీలు, యూనివర్సిటీల విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపింది. ఇందుకోసం హెల్ప్‌లైన్ నంబరు 1855ను అందుబాటులోకి తీసుకొచ్చింది.



తిరుమలలో

## భక్తులందరికీ స్లాటెడ్ టోకెన్లే

**▸▸ అది తీసుకోకుంటే దర్శనం ఉండదు: టీటీడీ**

తిరుమల, రాజంపేట/ఒంటిమిట్ట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా వైరస్ తిరుమలలో వ్యాప్తి చెందకుండా కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. శనివారం అన్నమయ్య భవనంలో అదనపు ఈవో ధర్మారెడ్డితో కలిసి మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. ప్రధానంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలో నిరీక్షణ లేకుండా నేరుగా దర్శనానికి అనుమతించేందుకు వీలుగా భక్తులందరికీ స్లాటెడ్ టోకెన్లు జారీచేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం సోమవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తుంది. స్లాటెడ్ టోకెన్లు లేకుండా వచ్చేవారికి దర్శనం ఉండదు. గంటకు ఒక స్లాట్ వంతున స్లాట్‌కు 4వేల టోకెన్లు జారీ చేస్తారు. దివ్యదర్శనం టోకెన్లకు అనుగుణంగా సర్వదర్శనానికి స్లాట్‌లు కేటాయిస్తారు. కచ్చితంగా ఆ టోకెన్‌లో కేటాయించిన సమయానికే భక్తులను క్యూలోకి అనుమతిస్తారు. మంగళవారం నుంచి రెండో వైకుంఠం కాంప్లెక్స్‌లో ఒక్క కంపార్టుమెంట్ మాత్రమే తెరిచి ఉంచుతారు. తిరుపతిలోనే స్లాట్ టోకెన్లు స్వీకరించవచ్చు. తిరుమలలోనూ ప్రవేశపెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. స్లాట్ టోకెన్ పొందేందుకు తప్పనిసరిగా ఏదో ఒక గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలి. భక్తులు ఎక్కువగా గుమిగూడే విశేషపూజ, వసంతోత్సవం, సహస్ర కలశాభిషేకం సేవలూ సోమవారం నుంచి రద్దు కానున్నాయి. ఇప్పటికే పర్యటన ఖరారు చేసుకున్న భక్తులకు అదే రోజున వీఐపీ దర్శనం కేటాయిస్తారు. మిగిలిన సేవలకు యథావిధిగా అనుమతిస్తారు. కరోనా నేపథ్యంలో ఆగమ సలహాదారుల సూచన మేరకు లోకక్షేమార్థం తిరుమల పార్వేట మండపంలో ఈనెల 19, 20, 21 తేదీల్లో శ్రీశ్రీనివాస శాంతి ఉత్సవ సహిత ధన్వంతరి మహాయాగం నిర్వహించనున్నారు. 'సుపథం' ప్రవేశమార్గంలో దర్శనానికి వెళ్లదలచుకున్న ఎన్నారైలు 30 రోజులు ముందుగా భారత్‌కు వచ్చి ఉంటేనే, అది కూడా వైద్యపరీక్షల తరువాతే క్యూలోకి అనుమతిస్తారు. అలిపిరి తనిఖీ కేంద్రం, మెట్లమార్గాలలో భక్తులకు ఆరోగ్య పరీక్షలు చేసి అనుమానితులను ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేశారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలలో భాగంగా సీతారామ కల్యాణోత్సవాన్ని ఎస్వీబీసీ చానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, భక్తులు టీవీలలో వీక్షించాలని విజప్తి చేశారు. వచ్చేనెల 7న ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని, మే నెలకు వాయిదా వేశామన్నారు. అలాగే, ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీ వరకు కోదండరాముని బ్రహ్మోత్సవాలు యథావిధిగా జరుగుతాయని, ఏప్రిల్ 7న కల్యాణం మాత్రం ఆలయంలోపలి భాగంలో సాదాసీదాగా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని దీనిని లైవ్ టెలికాస్ట్ చేస్తామని, ప్రజలు వారి ఇంటి నుంచే టీవీల ద్వారా వీక్షించవచ్చన్నారు.

### రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 14: దేశంలో కరోనా మరణాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వైరస్‌ను విపత్తు (నోటిఫైడ్ డిజాస్టర్)గానూ గుర్తిస్తూ శనివారం ఉత్తర్వులిచ్చింది. 'నోటిఫైడ్ డిజాస్టర్'గా పేర్కొనడంతో స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డీఆర్‌ఎఫ్) కింద రాష్ట్రాలకు కేంద్రం నిధులివ్వనుంది. కరోనా పాజిటివ్‌గా తేలి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారికీ పరిహార సాయం అందుతుంది.

### స్వామి నారాయణ్ ఆలయాల మూసివేత

వాషింగ్టన్, మార్చి 14: కరోనా విస్తృతి నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ ఆలయాలను మూసివేస్తున్నట్లు ప్రఖ్యాత స్వామి నారాయణ్ సంస్థ ప్రకటించింది. వాలంటీర్లు, భక్తులు, స్థానికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

### రువాండాలో తొలి కేసు భారతీయుడిదే!

కిగాలి, మార్చి 14: రువాండాలో నమోదైన మొట్టమొదటి కరోనా కేసు భారతీయుడిదేనని ఆ దేశ ప్రభుత్వం శనివారం వెల్లడించింది. మార్చి 8న ముంబై నుంచి రువాండా వచ్చిన ఓ వ్యక్తికి కరోనా ఉన్నట్లు రువాండా ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. రువాండాకు వచ్చిన రోజు అతనికి ఎలాంటి వ్యాధి లక్షణాలు లేవని, అయితే శుక్రవారం అతడే స్వయంగా ఆస్పత్రికి వచ్చి పరీక్షలు నిర్వహించుకోగా కరోనా పాజిటివ్ వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు.

### కరోనాను గుర్తించే వెబ్‌సైట్

శాన్‌ఫ్రాన్సిస్కో, మార్చి 14: తమకు కరోనా వైరస్ లక్షణాలు ఉన్నాయా.. లేవా అన్న విషయాన్ని స్వంతంగా నిర్ధరించుకునేలా త్వరలో ఓ వెబ్‌సైట్ అందుబాటులోకి రాబోతోంది. దీనిని టెక్ దిగ్గజం గూగుల్ రూపొందిస్తోంది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం వెల్లడించారు. వెబ్‌సైట్ నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు.

### 27 వరకు ఆపిల్ స్టోర్లు బంద్: టిమ్ కుక్

శాన్ ఫ్రాన్సిస్కో, మార్చి 14: చైనా వెలుపల ఉన్న ఆపిల్ కంపెనీ స్టోర్లు అన్నింటినీ ఈ నెల 27 వరకు మూసివేయనున్నట్లు ఆ కంపెనీ సీఈవో టిమ్ కుక్ శనివారం తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

### అమెరికా వీసా అపాయింట్‌మెంట్లు రద్దు

న్యూఢిల్లీ, మార్చి 14: కరోనా వైరస్ వ్యాప్తిచెందడంతో భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం, కాన్సులేట్‌లు సోమవారం నుంచి అన్ని వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేశాయి. ఢిల్లీలోని అమెరికా దౌత్యకార్యాలయం శనివారం ఈ మేరకు ప్రకటన చేసింది. మరోవైపు- అత్యవసరం కాని అంతర్గత, విదేశీ ప్రయాణాలు వాయిదావేసుకోవాలని వాషింగ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయం అక్కడి విద్యార్థులకు సూచించింది.

### కరోనాపై సమరానికి రూ.147 కోట్లు: ఎఫ్‌బీ

న్యూఢిల్లీ, మార్చి 14: మహమ్మారి కరోనాపై సమరానికి 20 మిలియన్ డాలర్లు (రూ.147 కోట్లు) సమీకరించాలని సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ నిర్ణయించింది. ఇందులో 10 మిలియన్ డాలర్లను సొంతంగా ఇవ్వనుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), యునైటెడ్ నేషన్స్ ఫౌండేషన్(యూఎన్‌ఎఫ్)తో కలిసి ఈ మేరకు 'కొవిడ్-19 సాలిడారిటీ రెస్పాన్స్ ఫండ్'ను ప్రారంభించినట్లు ఫేస్‌బుక్ సీఈవో జుకెర్‌బర్గ్ తెలిపారు.

### తమిళనాట తొలికేసులో వైద్యుల విజయం

చెన్నై, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తమిళనాట తొలి కరోనా కేసుగా నమోదైన కాంచీపురం ఇంజనీరు పూర్తిగా కోలుకోవడంతో సోమవారం డిశ్చార్జి చేసే అవకాశాలున్నాయని ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఒమన్ నుంచి వచ్చిన ఆ ఇంజనీర్ జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతుండటంతో వైద్య పరీక్షలు జరిపి కరోనా సోకినట్లు నిర్ధారించారు. రాష్ట్రంలోనే తొలి కరోనా కేసుగా చెన్నై ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రత్యేక వార్డులో చేర్చి చికిత్సలందించారు. బాగా కోలుకోవడంతో తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించగా, కరోనా లేదని రిపోర్టు వచ్చింది.

# కాలక్షేపం చేస్తున్న ఈసీ

- ఏ సమస్య వచ్చినా కోర్టే దిక్కు: శైలజానాథ్
- ఛీ..ఛీ.. ఇవొక ఎన్నికలా? : తులసిరెడ్డి

విజయవాడ, కడప, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నివేదికలు వస్తాయండి... సమాచారం సేకరిస్తామండి... పరిశీలించి ఏం చర్యలు తీసుకోవాలో చూస్తామండి... అనే సమాధానాలతోనే రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ రోజులు గడుపుతోందని పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ విమర్శించారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లలో అధికార పార్టీ ఎన్నో అరాచకాలకు దిగుతున్నా ఈసీ సంతృప్తి వ్యక్తం చేస్తుందా అని ప్రశ్నించారు. విజయవాడలో శనివారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ గెలుపు కోసం వలంటీర్లు ఎంతచేయాలో అంతా చేస్తున్నారని ఆరోపించారు. అసలు వారి ఎంపికే ఒక మాయాజాలమన్నారు. స్థానిక ఎన్నికల్లో గొడవలు సర్వసాధారణమంటూ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను శైలజానాథ్ తప్పుబట్టారు. ఈ ఎన్నికలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటాయని ఆయన చెబుతున్నప్పుడు ఎన్నికలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వ పాలనలో ప్రతి చిన్న విషయానికీ కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ అభ్యర్థులకు విజయవాడలోనే కుల ధ్రువీకరణపత్రాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులపై దాడులు, నామినేషన్ పత్రాలు చింపివేసిన ఘటనల్లో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, హింసకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ శైలజానాథ్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు డీజీపీకి వినతిపత్రం సమర్పించారు. ప్రజలు ఓటేయరన్న భయంతో అధికారులు, పోలీసులతో వైసీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి కడపలో ఆరోపించారు. 'ఛీ ఛీ... ఇవొక ఎన్నికలా? ఇదొక ప్రభుత్వమా? ఇంత రాక్షస పాలన ఎన్నడూ చూడలేదు' అని విమర్శించారు.

## ఎస్ఈసీ, డీజీపీ విఫలం : వడ్డే

విజయవాడ సిటీ, మార్చి 14: రాచరిక పాలన సాగదని, రాజ్యాంగం, చట్టాలకు లోబడే పరిపాలన సాగించాలనే విషయం జగన్ తెలుసుకోవాలని మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. శనివారం విజయవాడలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ సాకుతో బలహీన వర్గాలు ఏనాటి నుంచో సాగుచేసుకుంటున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, రాజధానికి ల్యాండ్‌పూలింగ్ విధానంలో రైతులు ఇచ్చిన భూముల్లో వేలాది ఎకరాలు బయటి వారికి ఇవ్వాలనే నిర్ణయం, ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులు వేయడం, మాజీ సీఎం చంద్రబాబు విశాఖ పర్యటన సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం... రాష్ట్ర ప్రభుత్వ రాచరిక పాలనకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాజ్యాంగబద్ధంగా పాలన జరగని పక్షంలో రాష్ట్రపతి పాలన అమలు చేసే అధికారం కేంద్రానికి ఉందన్న విషయం గుర్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించడంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్, రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్ పూర్తిగా విఫలమయ్యారని వడ్డే విమర్శించారు.

## ఏం చెప్పారు... ఏం చేస్తున్నారు?: సీపీఎం

విజయవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నాడు టీడీపీ ప్రభుత్వం, ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరులో ఏమాత్రం తేడా లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. అధికారంలోకి రావడానికి ముందు వైసీపీ చెప్పిన నీతులు ఇప్పుడు అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు మాదిరిగా ఎమ్మెల్యేలను కొనుగోలు చేయనని చెప్పిన జగన్ ఇప్పుడెందుకు మాట నిలుపుకోవడం లేదని ప్రశ్నించారు. టీడీపీ చేసిన కుంభకోణాలను వైసీపీ కొనసాగించడం వల్లే వాళ్లంతా ఆ గూటి నుంచి ఈ గూటికి వస్తున్నారని ఆరోపించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో నామినేషన్ పత్రాలను చించివేయడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఈ ఘటనలు జరిగిన ప్రాంతాల్లో తిరిగి ఎన్నికలు నిర్వహించాలని మధు డిమాండ్ చేశారు.

## ప్రజాబలం ఉంటే భయమెందుకు? : సీపీఐ

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో అడ్డదారులు తొక్కి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను వైసీపీ ఏకగ్రీవం చేసుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. తమ అభ్యర్థులు మాత్రమే గెలవాలనే ఏకపక్ష ఆలోచనతో వైసీపీ పావులు కదిపిందన్నారు. నిజంగా ప్రజానుకూల పాలన సాగిస్తే దౌర్జన్యంగా ఏకగ్రీవాలు సాధించుకోవాలన్న తపన ఎందుకని ప్రశ్నించారు. బెదిరింపులు, దాడులు, పోలీసులను ఉపయోగించి ఏకగ్రీవం చేయడానికి ఎందుకు తాపత్రయపడుతున్నారని నిలదీశారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి పరీక్ష పెట్టి ఎలాగైనా గెలవాలని చెప్పడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈసీ నిద్రావస్థలో ఉందని రామకృష్ణ ఆరోపించారు.

## కరోనా విజృంభిస్తోంది..
## ఎన్నికలు వాయిదా వేయండి: సోమిరెడ్డి

నెల్లూరు వ్యవసాయం, మార్చి 14: 'రాష్ట్రంలో మొట్టమొదటి కరోనా పాజిటివ్ కేసు నెల్లూరులో నమోదైంది. మరొకరికి సైతం పాజిటివ్ వచ్చిందనే సమాచారం ఉంది. ప్రజల ప్రాణాలకంటే ఏదీ ముఖ్యం కాదు. కాబట్టి స్థానిక ఎన్నికలను వాయిదా వేయండి' అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. నెల్లూరులో ఆయన మాట్లాడుతూ కరోనా ప్రభావం తీవ్రంగా ఉంటే ఉద్యోగులు, అధికారులంతా ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారని చెప్పారు. నామినేషన్లు, ఉపసంహరణలు అయిపోయాయని, పోలింగ్ తేదీ మాత్రం మార్చమని కోరుతున్నామన్నారు.

## శ్రీకాళహస్తిలో ఎన్నికలు రద్దు చేయాలి: బొజ్జల

హైదరాబాద్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో స్థానిక ఎన్నికల ప్రక్రియను తక్షణం రద్దు చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'పరిశీలనలో మా అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. శ్రీకాళహస్తి ఆఫీసులో ఇద్దరు తలలు పగులగొట్టారు. బీజేపీ కార్యకర్తలపైనా దాడి జరిగింది. రేణిగుంట మండలంలో 21 ఎంపీటీసీలకుగాను టీడీపీకి సంబంధించి ఐదింటిని మాత్రమే ఆమోదించారు. శ్రీకాళహస్తిలో 15కుగాను నాలుగే ఆమోదించారు. ఏర్పేడు మండలంలో ఒక్కటి కూడా ఆమోదించలేదు. వైసీపీ కార్యకర్తల కంటే పోలీసులే ఓవర్‌యాక్షన్ చేస్తున్నారు' అని సుధీర్‌రెడ్డి మండిపడ్డారు.

## రాష్ట్రమంతా రౌడీయిజం

- హత్యాయత్నాలు చేసినోళ్లకు జగన్ రివార్డులు : దేవినేని
- రాష్ట్రంలో చట్టం, నేరం కలిసిపోయాయి : వర్ల
- ఎన్నికలను అపహాస్యం చేస్తున్న వైసీపీ : అనురాధ

మంగళగిరి, మార్చి 14: నాలుగు దశాబ్దాలుగా పులివెందులలో జరుగుతున్న ఎన్నికల తంతును ముఖ్యమంత్రి జగన్ స్థానిక ఎన్నికలలో రాష్ట్రమంతటా వ్యాపింపజేశారని మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పవిత్రమైన తిరుపతితోపాటు చంద్రగిరి, ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలు, కృష్ణాజిల్లాలో కూడా పులివెందుల రౌడీయిజమే కొనసాగిందన్నారు. కృష్ణాజిల్లా మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలానికి చెందిన జడ్పీటీసీ స్థానం ఎస్సీలకు రిజర్వుడు కాగా చంటిబాబు, జైపాల్, రమేశ్ అనే ముగ్గురు టీడీపీ తరపున నామినేషన్లు వేశారన్నారు. చివరిగా జైపాల్‌ను పార్టీ అభ్యర్థిగా ఖరారు చేసుకుని మిగతా ఇద్దరు వారి నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు ముగ్గురూ కలిసి మచిలీపట్నం వెళ్లగా వైసీపీ కార్యకర్తలు వారిని అడ్డుకుని జైపాల్‌తో సహా ముగ్గురూ నామినేషన్లను ఉపసంహరించుకోవాల్సిందేనంటూ బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. స్థానికులు ఇది గమనించి వైసీపీ కార్యకర్తల అడ్డగింపు నుంచి వారిని రక్షించి జడ్పీ కార్యాలయానికి తీసుకువెళ్లారన్నారు. కృష్ణా జిల్లాలోనే ఇలా జరిగితే జగన్ పాలనలో రాష్ట్రం ఎటుపోతుందో వేరే చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మరో నాయకుడు వర్ల రామయ్య మాట్లాడుతూ... రాష్ట్రంలో చట్టం, నేరం కలిసిపోయాయని, పోలీసుల వ్యవహార శైలి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎవరిని సంతోషపెట్టడానికి పోలీసులు నేరంతో కలిసి ప్రయాణిస్తున్నారు? మాచర్ల సీఐ, ఎస్ఐపై ఏ చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. డీజీపీని 5.45 గంటలపాటు కోర్టులో నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ... స్థానిక ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం అపహాస్యం చేసిందని విమర్శించారు. కనీసం మహిళలను సైతం నామినేషన్లు వేయనివ్వకుండా అధికారబలంతో అప్రజాస్వామికంగా వారిని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేరకంగా నాడు విశాఖలో జగన్ తల్లి విజయలక్ష్మిని నామినేషన్ వేయనివ్వకుండా అడ్డుకుని ఉంటే ఆ బాధేమిటో జగన్‌రెడ్డికి తెలిసివచ్చేదన్నారు.







మాచర్ల జనసేన అభ్యర్థి నాయక్‌ను నామినేషన్ ఉపసంహరణకు తీసుకువస్తున్న వైసీపీ నేతలు, నాయక్‌తో మాచర్ల ఎమ్మెల్యే పీఏ, ఉపసంహరణల తరువాత నాయక్‌ను తీసుకువెళుతున్న ఎమ్మెల్యే అనుచరులు

# ఉపసంహా'రణం'!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన బిల్లులను కూడా అస్త్రంగా ఉపయోగించుకున్నారు. నేరుగానే అభ్యర్థులకు ఫోన్‌చేసి... "మీకు రావాల్సిన సొమ్ము అవసరం లేదా? పోటీచేస్తే ఇంతే సంగతులు" అని హెచ్చరికలు జారీ చేశారు. టీడీపీకి అనుకూలంగా పనిచేసినా బిల్లుల సంగతి మర్చిపోవాలని హెచ్చరించారు. కృష్ణాజిల్లాలోనూ ఈ తతంగం నడిచింది. గుంటూరు జిల్లా నగరం మండలం పెద్దవరం టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి గోవతోటి భాస్కర్‌పై పాత కేసులు ఉన్నాయని, వాటిని తిరగదోడాల్సి వస్తుందని హెచ్చరించి నామినేషన్ ఉపసంహరింప చేశారని ఎమ్మెల్యే అనగాని ఆరోపించారు.

### ఫోర్జరీలు కూడా...

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం పెదగరువు ఎంపీటీసీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి అలుగు ప్రమీల బరిలో నిలిచారు. శనివారం ఆమె సంతకంతో కూడిన ఉపసంహరణ ప్రతం అధికారులకు అందింది. దీంతో ప్రమీల పోటీ నుంచి తప్పుకున్నట్టు ప్రకటించారు. సమాచారం అందుకున్న ప్రమీలతో సహా జనసేన, బీజేపీ నేతలు రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ప్రమీల సంతకాన్ని ఫోర్జరీ చేశారని చెప్పినా పట్టించుకోకుండా... నిర్ణయం తీసుకున్న తర్వాత ఏమీ చేయలేమని అధికారులు తేల్చేశారు. ఉండి మండల పరిధిలోని చిలుకూరు టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి కె.రామారావు నామినేషన్ వేయగా... ఆయన కుమారుడితోపాటు అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన మరోవ్యక్తి రామారావు నామినేషన్ 'విత్‌డ్రా' పత్రాలు ఇచ్చారు. ఇది దురుద్దేశంతో జరిగిందని ఎమ్మెల్యే రామరాజు ఫిర్యాదు చేయగా... అభ్యర్థి నేరుగా వచ్చి వివరిస్తేనే పరిగణనలోకి తీసుకుంటామని సాయంత్రం5.30వరకు గడువిచ్చారు. అప్పటికి రాకపోవడంతో వైసీపీ అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. దెందులూరు మండలం పెదవేగిలో దుగ్గిరాల, పెదవేగి ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులు బి-ఫామ్ ఇచ్చినప్పటికీ వారిని ఇండిపెండెంట్లుగా ప్రకటించారు. దుగ్గిరాల టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్ సొంత గ్రామం. దీనిపై 2గంటలపాటు టీడీపీ కార్యకర్తలు ఆందోళన చేశారు. చివరికి... బి-ఫారాలు దొరికాయంటూ అధికారులు ప్లేటు ఫిరాయించారు. గోపాలపురంలో గడువు తర్వాత కూడా ఉపసంహరణ పత్రాలు తీసుకున్నారు. ఒత్తిళ్ల నేపథ్యంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం జడ్పీటీసీ స్థానాల నుంచి టీడీపీ అభ్యర్థులు బరినుంచి తప్పుకొన్నారు.

### కర్నూలులో సాయంత్రం దాకా..

అభ్యర్థుల తుది జాబితా సిద్ధం చేశాక కూడా విత్‌డ్రాలు కొనసాగించిన ఘనత కర్నూలు జిల్లా అధికారులకే దక్కింది. ఏకంగా వైసీపీ జడ్పీ చైర్మన్ అభ్యర్థి కుమారుడే దగ్గరుండి మరీ 'ఉపసంహరణలు' చేయించారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత వైసీపీ కార్యకర్తలు ఆయా కార్యాలయాలకు నామినేషన్లువేసిన ప్రత్యర్థులను వెంటబెట్టుకుని వచ్చారు. ఓ మంత్రి నుంచి ఫోన్ రావడంతో... రిటర్నింగ్ అధికారి కూడా ఓకే అన్నారు. అవసరమైతే రాత్రి 7గంటల దాకా ఉపసంహరణలకు అనుమతించి... తర్వాతే తుది జాబితా ప్రకటించాలంటూ అధికారులకు రహస్య ఆదేశాలు వెళ్లిపోయాయి. కొలిమిగుండ్ల నుంచి జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలో నిలిచిన సుగుణమ్మ శుక్రవారం నుంచి స్థానిక టీడీపీ నాయకులకు కూడా అందుబాటులో లేరు. శనివారం ఉదయం వరకు ఆమెకోసం వెతుకుతున్నారు. ఇంతలో ఆమెను వైసీపీ అభ్యర్థి కుమారుడు జడ్పీ కార్యాలయానికి తీసుకొచ్చి... విత్‌డ్రా చేయించారు. ప్యాపిలి మండలానికి చెందిన కేశవులు, బేతంచర్లకు చెందిన కవిత కాంగ్రెస్ తరపున జడ్పీటీసీలుగా నామినేషన్లు వేశారు. వారిలో కొందరు కవిత ఇంటికి వెళ్లి ఓటరు జాబితా కోసం వచ్చామని సంతకాలు చేయించుకున్నారు. మర్నాడే అవి ఆర్వో వద్దకు ఉపసంహరణ దరఖాస్తులుగా వచ్చి చేరాయి. దీంతో ఆమె నామినేషన్ రద్దయింది. కర్నూలు జిల్లాలో 14 జడ్పీటీసీలు ఏకగ్రీవమయ్యాయి.

### కృష్ణాలో బెదిరింపుల పర్వం..

రెడ్డిగూడెం మండలం ముచ్చినపల్లి ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరపున ఐదుగురు నామినేషన్లు వేశారు. వీరంతా శనివారం ఉపసంహరించుకున్నారు. అన్నారావుపేట ఎంపీటీసీ స్థానంలోనూ టీడీపీ అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల్లో ఆరు ఎంపీటీసీ స్థానాలు వైసీపీకి ఏకగ్రీవమయ్యాయి. గన్నవరం- 6 ఎంపీటీసీగా బరిలో ఉన్న టీడీపీ నేత కె.కాంతారావు చేత నామినేషన్ ఉపసంహరింపచేశారు. నాగాయలంక మండలంలో రేమాలవారిపాలెం, గణపేశ్వరం, నంగేగడ్డ ఎంపీటీసీ స్థానాల్లో డబ్బులు, బెదిరింపులతో టీడీపీ అభ్యర్థులను బరి నుంచి తప్పించారు. ఉంగుటూరు మండలంలో ఎమ్మెల్యే బెదిరింపులకు దిగటంతో ఆరుగురు టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

### తూ.గో.లో ఫలించిన 'ఒత్తిళ్లు'

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 60 వరకు ఎంపీటీసీ స్థానాలను పోటీ లేకుండా సొంతం చేసుకున్నారు. అత్యధికంగా మంత్రి కన్నబాబు నియోజకవర్గంలో 17 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ టీడీపీ అభ్యర్థులను బెంబేలెత్తించడంతో 11 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. పలుచోట్ల టీడీపీ అభ్యర్థులు విత్‌డ్రాకు అంగీకరించకపోయినా బలవంతంగా తీసుకువెళ్లి అధికారుల వద్ద కూర్చోబెట్టారు. మధ్యాహ్నం మూడు గంటలు దాటిన తర్వాత కూడా ఉపసంహరణ పర్వం కొనసాగింది.

## మాచర్ల జనసేన అభ్యర్థితో బలవంతంగా ఉపసంహరణ

- జడ్పీలోనే తిష్టవేసిన ఎమ్మెల్యే పీఏ
- రిటర్నింగ్ అధికారి ముందే బెదిరింపులు

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మాచర్ల జడ్పీటీసీగా జనసేన తరపున బరిలోకి దిగిన బాలు నాయక్‌ను అధికార పార్టీ నేతలు... వెంటాడి, వేటాడి మరీ బరి నుంచి తప్పించారు. నాలుగు రోజులు వెంటాడి... ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలియడంతో ప్రత్యేక బృందాన్ని పంపి శనివారం మధ్యాహ్నానికి జడ్పీ కార్యాలయానికి తరలించారు. అప్పటికే ఉపసంహరణ సమయం ముగిసినప్పటికీ... మాచర్ల శాసన సభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పీఏ, ఆయన అనుచరులు రిటర్నింగ్ అధికారి సమక్షంలోనే బాలు నాయక్‌ను బెదిరించారు. ఉపసంహరణ పత్రంపై సంతకం చేయాలన్నారు. 'జడ్పీ బరి నుంచి తప్పుకో. రేగులవరం తండా గ్రామ సర్పంచ్‌గా రెండేళ్లు అవకాశం ఇస్తాం' అని ప్రలోభపెట్టారు. అయినా... బాలు నాయక్ దారిలోకి రాలేదు.. కొద్ది సేపటి తర్వాత బాలు నాయక్ బంధువులు ఆయనకు నచ్చజెప్పి ఉపసంహరణ పత్రాలపై సంతకాలు చేయించారు. మధ్యాహ్నం 3.45 గంటలకు నాయక్ నామినేషన్‌ను ఉపసంహరించి బయటకు వచ్చారు. ఎమ్మెల్యే పీఏ శనివారం ఉదయం నుంచే గుంటూరు జడ్పీ కార్యాలయంలో తిష్ట వేశారు. ఆ నియోజకవర్గంలోని ఐదు మండలాలలో నామినేషన్లు దాఖలు చేసిన ఇతర పార్టీల అభ్యర్థులను జడ్పీకి తీసుకువచ్చి ఉపసంహరించే ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

## ఏకగ్రీవాల పర్వం

గుంటూరు జిల్లాలో ఏడు జడ్పీటీసీలు ఏకగ్రీవంగా వైసీపీ ఖాతాలో జమ అయ్యాయి. మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని కారంపూడి, దుర్గి, వెల్దుర్తి, మాచర్ల, రెంటచింతల... గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల జడ్పీటీసీలుగా వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఆరు మండలాల్లో నామినేషన్లు దాఖలు చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన, స్వతంత్రులు, ఇతర పార్టీల అభ్యర్థులు పోటీ నుంచి విరమించుకున్నారు. రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం జడ్పీటీసీగా వైసీపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక నెల్లూరు జిల్లాలో బెదిరింపులు, డబ్బుల పంపకాలతో 12 జడ్పీటీసీ స్థానాలను వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. అల్లూరు, జలదంకి, సీతారామపురం, నాయుడుపేట, సూళ్లూరుపేట, పెళ్లకూరు, తడ, ఓజిలి, దొరవారిసత్రం, బుచ్చి, రాపూరు, కొండాపురం మండలాల జడ్పీటీసీ స్థానాలు వైసీపీ పరం అయ్యాయి. సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఏకగ్రీవం చేసుకోవడం కోసం వైసీపీ దాడులు, బెదిరింపులకు పాల్పడింది. పోలీసులు ప్రత్యక్షంగా రంగప్రవేశం చేసి ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను బెదిరించి ఉపసంహరణలు చేయించారు. మిగిలిన మండలాల్లో డబ్బు, పెండింగ్ బిల్లులు ఇప్పిస్తామనే హామీలతో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను పోటీ నుంచి విరమింపజేశారు. విశాఖ జిల్లాలో 39 జడ్పీటీసీలకుగాను ఒకటి ఏకగ్రీవం కాగా, మిగిలిన 38 స్థానాలకు 177 మంది పోటీలో ఉన్నారు. రోలుగుంట జడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం అభ్యర్థినిగా నామినేషన్ వేసిన గండి అరుణక్రాంతి, జనసేన అభ్యర్థిగా నామినేషన్ వేసిన లక్కవరపు దేవి పోటీ నుంచి ఉపసంహరించుకోవడంతో వైసీపీ అభ్యర్థిని పోతల లక్ష్మీరమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.

## అధికార బలమే నెగ్గింది

**సీఎం సొంత జిల్లాలో వైసీపీ హవా**

**36 జడ్పీటీసీ, 423 ఎంపీటీసీలు ఏకగ్రీవం**

కడప, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సీఎం సొంత జిల్లా కడపలో 'స్థానిక విజయం అధికారపక్షానికి పోటీ లేకుండానే సొంతమైంది. జిల్లాలో 50 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటిలో 36స్థానాలు అధికార పార్టీ ఏకగ్రీవం చేసుకుంది. 50 మండలపరిషత్‌ల పరిధిలో 553 ఎంపీటీసీ స్థానాలు ఉండగా... ఏకంగా 423 స్థానాలు వైసీపీకి ఏకగ్రీవమయ్యాయి. 16 స్థానాల్లో టీడీపీ, బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. 114 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా... వీటిలో 54స్థానాల్లో మాత్రమే ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థులను బరిలో నిలిపింది. 26 మండలాల్లో మొత్తం ఎంపీటీసీ స్థానాలను వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. 19 మండలాల్లో మెజార్టీ స్థానాలు ఆ పార్టీ ఖాతాలోనే పడ్డాయి. అంటే 45 మండలాలు ఇప్పటికే వైసీపీ ఖాతాలో పడినట్లే.

# ఖాకీ టెర్రరిజం!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. "ఇది పోలీస్ టెర్రరిజం కాదా? ప్రజలను తీసుకువచ్చి కొట్టేహక్కు పోలీసులకు ఎవరిచ్చారు? పోలీసులతో చితక్కొట్టించి అధికార పార్టీకి లొంగిపోయేలా చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం నేరమా? పోలీసులు అధికార పార్టీకి ప్రైవేటు సైన్యమా" అని ప్రశ్నించారు. తూర్పుగోదావరి, గుంటూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో చోటుచేసుకొన్న నాలుగు ఘటనలకు సంబంధించిన వివరాలను, వీడియోలను చూపించారు. "ఈ 4సంఘటనలు ప్రస్తుతం ప్రభుత్వాన్ని నడుపుతున్నవారి మానసిక ధోరణికి తార్కాణం. వాటిని పరిగణనలోకి తీసుకొని ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలి. నామినేషన్లు మొదలైన రోజు నుంచీ టీడీపీ అభ్యర్థులపై హింస మొదలైంది. ఉపసంహరణల గడువు ముగిసేవరకూ అడుగడుగునా ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

### సీసీ లేకపోబట్టే దొరల్లా వివేకా హంతకులు...

"పోలీస్ పర్మిషన్‌తో నేను విశాఖ వెళ్తే వైసీపీ గూండాలు అడ్డుకొన్నారు. వారిని ఏమీ చేయలేక నన్ను అరెస్టు చేసి వెనక్కు పంపారు. ఈ పని చేసినందుకు డీజీపీ ఒక రోజంతా కోర్టులో నిలబడాల్సి వచ్చింది. మాచర్లలో టీడీపీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేపై బహిరంగంగా హత్యాప్రయత్నం చేశారు. చేసిన వ్యక్తి ఎవరో టీవీల్లో ప్రపంచానికి అంతా తెలిసినా ఆ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చి బయటకు పంపారు. తెనాలిలో టీడీపీ నేత ఇంట్లోకి అర్ధరాత్రి గోడదూకి వచ్చి మేడపైన వాటర్ ట్యాంక్ వద్ద మద్యం బాటిళ్లు పెట్టి వెళ్ళారు. పొద్దున్నే ఎక్సయిజ్ పోలీసులు నేరుగా వెళ్లి ఆ బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఆ నేతను అరెస్టు చేస్తామని రచ్చ చేశారు. ఆ ఇంటి యజమాని సీసీ కెమెరాలు పెట్టించుకొన్నారు కాబట్టి అర్ధరాత్రి వచ్చి బాటిళ్లు పెట్టిన విషయం రికార్డయింది. వివేకా ఇంట్లో సీసీ కెమెరాలు లేవు కాబట్టి హత్య చేసినవారు దొరల్లా తిరుగుతున్నారు. ఇవాళ తెనాలిలో చేసిన పనినే రేపు రాష్ట్రంలో ఏ ఇంట్లో అయినా చేయవచ్చు. ఆస్తులు దోచుకుపోవచ్చు... హత్యలు చేయవచ్చు... అత్యాచారాలు చేయవచ్చు. ఎవరి ఇంట్లోకి ఎవరైనా వచ్చి ఏది పెట్టినా పోలీసులు ఇంట్లో ఉన్న వాళ్లపై కేసులు పెడతారా? దీనిని ఖాకీ టెర్రరిజం కాక మరేమంటారు? శనివారం మధ్యాహ్నం 3గంటలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసినా అధికార పార్టీ నేతలు ఆ తర్వాత కూడా టీడీపీ అభ్యర్థులను బెదిరించి ఉపసంహరణలకు తీసుకువస్తుంటే అధికారులు అనుమతిస్తున్నారు. ఎన్నికల కమిషన్‌కి ఇవి కనపడవా? కమిషన్ ఇంత నిర్వీర్యం అయిందా? ప్రత్యర్థులు లాక్కొనివెళ్లే అవకాశం లేకుండా మా అభ్యర్థుల బీ ఫారాలు న్యాయవాదుల చేతికి ఇచ్చి పంపించాలని నిర్ణయించాం. అన్నిచోట్లా సీసీ కెమెరాల నిఘాపెట్టి పర్యవేక్షణ జరపాలి"

### మాక్కాదు.. కోర్టుకు పోలీసులు చెప్పాలి

"ఎన్నికల్లో హింసపై తమకు చాలాతక్కువ సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయని డీజీపీ చెప్పడం సరికాదు. పోలీసులు పోలీసుల్లా పనిచేస్తున్నారా? మాజీ సీఎం అయిన నన్నే 151సెక్షన్ కింద అరెస్టు చేశారు. ఇక వారిని నమ్మి సామాన్యులు వస్తారా? దేశంలో ఏ డీజీపీ అయినా కోర్టులో నిలబడి 151 సెక్షన్ అంటే ఏమిటో చదివారా? తాము వేసిన అఫిడవిట్ తప్పని ఏ డీజీపీ అయినా కోర్టులో అంగీకరించారా? పోలీస్ వ్యవస్థ ఉన్నది శాంతి భద్రతలు కాపాడటానికి తప్ప ఒక వ్యక్తికి ఊడిగం చేయడానికి కాదు. మాకు సమాధానం చెప్పడం కాదు... కోర్టుకు చెప్పండి. మాచర్లలో పట్టపగలు హత్యాయత్నం చేసిన వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చి మాకు నీతులు చెబితే ఎలా? మేం మాచర్ల ఎందుకు వెళ్లామని అడుగుతున్నారు. ఎన్నికల సమయంలో మేం ప్రచారం చేయకూడదా? వద్దనడానికి మీరెవరు (పోలీసులను ఉద్దేశించి)? ఇవి సాధారణ ఎన్నికలు కావు. రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో భాగం. ప్రజలు పిరికితనానికి లొంగిపోవద్దు. పోటీ చేసేవారు ఎంత ధైర్యంగా దిగారో గమనంలోకి తీసుకొని వారికి మద్దతు ఇవ్వండి"



## వివేకాను చంపింది భారతి మేనమామే!

ముఖ్యమంత్రి సొంత బాబాయి వివేకానందరెడ్డిని పులివెందులలో కిరాతకంగా చంపి, గుండెపోటుగా చిత్రీకరించడానికి విఫలప్రయత్నం చేశారని చంద్రబాబు అన్నారు. "వివేకా మెదడు బయటకు వచ్చేలా తల పగలగొట్టి చంపితే అదంతా శుభ్రం చేసి గుండెపోటుతో చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేశారు. జగన్ మామయ్య గంగిరెడ్డి దగ్గర ఉండి ఇదంతా చేశారు. వివేకా కూతురు పట్టుబడితేనే పోస్ట్‌మార్టానికి తీసుకువెళ్లారు. ఇంత కిరాతకం ఎవరు చేశారనేది చిదంబర రహస్యంలా మిగిల్చారు. జగన్ సతీమణి భారతి మేనమామే ఈ కిరాతకానికి కారకులని ప్రపంచానికి అంతాతెలుసు. అయినా ఎవరికీ ఏమీ తెలియనట్లు నటిస్తూ వచ్చారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. కాగా, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులును అక్రమంగా నిర్బంధించడాన్ని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు.

### విపక్ష నేత ప్రస్తావించిన 4 ఘటనలివే..

- తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటలో భార్యాభర్తలు టీడీపీ తరపున పోటీ చేస్తే వారి ఇంటికి వచ్చి పోలీసు అధికారులు బెదిరించారు.
- గుంటూరు జిల్లా ధూళిపూడిలో ఎంపీటీసీ సభ్యురాలిగా పోటీ చేస్తున్న మల్లీశ్వరిని ఉపసంహరించుకోవాలని పోలీసులు బెదిరించారు. ఆమె ఆ విషయం బహిరంగంగా మీడియాకు తెలిపారు.
- చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గం రాగిగుంట గ్రామంలో టీడీపీ తరపున నామినేషన్ వేసిన పాలగిరి అమ్ములు ఇంటికి అర్ధరాత్రి వచ్చి మద్యం బాటిల్ పెట్టి దాని ఆధారంగా కేసు పెడతామని పోలీసులు బెదిరించారు. మళ్లీ ఉదయాన్నే వచ్చి పోలీస్ జీపు ఎక్కించుకొని తిప్పుతూ ఉపసంహరించుకోవాలని బెదిరించారు. అయినా ఒప్పుకోకపోతే చివరకు ఇంటి వద్ద వదిలేసి వెళ్లారు.
- అనంతపురం జిల్లా నల్లమడలో టీడీపీ తరపున నామినేషన్ వేసిన 11మంది ఎంపీటీసీలను లాక్కొని వెళ్లడానికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దౌర్జన్యం చేశారు. మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి వచ్చి అడ్డుకోవాల్సి వచ్చింది.

### రద్దుల సర్కారు.. రివర్స్ పాలన

వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలే స్థానిక సంస్థల ఎన్నికల ప్రధాన అస్త్రంగా ప్రచార పర్వానికి టీడీపీ శ్రీకారం చుడుతోంది. 'రద్దుల ప్రభుత్వం- రివర్స్ పాలన' పేరిట రూపొందించిన ప్రచార కరపత్రాలను శనివారం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు ఆవిష్కరించారు. "టీడీపీ హయాంలో మనిషి పుట్టిన దగ్గర నుంచి చనిపోయే వరకు(ఊంబ్ టూ టూంబ్) ప్రతి దశలో అనేక వినూత్న పథకాలను అమలు చేశాం. కానీ అధికారంలోకి వచ్చిన ఏడాది లోపలే వైసీపీ ప్రభుత్వం 35సంక్షేమ పథకాలను రద్దు చేసింది. వైసీపీ నేతలు వైన్, మైన్, ల్యాండ్, శాండ్ మాఫియాగా మారారు. 10నెలల్లోనే రూ.20వేల కోట్ల జే-ట్యాక్స్ వసూలు చేశారు. టీడీపీ హయాంలో 39లక్షల పింఛన్లను 54.25లక్షలకు పెంచి, రూ.200లను రూ.2వేలు చేయగా, జగన్ పాలనలో పింఛన్లను 56.70లక్షల మందికి కేవలం రూ.250 మాత్రమే పెంచి ఇస్తున్నారు. వయోపరిమితి తగ్గించినా.. లబ్ధిదారులుపెరగలేదంటే, ఎంతమందికి పింఛన్లు తొలగించారో అర్థం చేసుకోవాలి. రైతుభరోసా పేరిట 54లక్షల మందికి పెట్టుబడి సాయమని ప్రకటించి.. 46లక్షల మందికే ఇచ్చారు. అందులోనూ కౌలు రైతులందరికీ ఇవ్వకుండా మోసం చేశారు" అని ఆ కరపత్రంలో విశ్లేషించారు.

## మున్సిపల్ నామినేషన్లలో వైసీపీ జోరు

- నగర పాలక సంస్థల్లో టీడీపీ కంటే 632 ఎక్కువ
- మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 1,842 అధికం

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు దాఖలైన నామినేషన్లలో అధికార వైసీపీ జోరు కొనసాగింది. ప్రధాన ప్రతిపక్షం టీడీపీతో పోల్చితే నగర పాలక సంస్థల్లో వైకాపా అభ్యర్థులు 632, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో 1,832 నామినేషన్లు ఎక్కువగా వేశారు. వైసీపీ, టీడీపీ తర్వాత అధిక సంఖ్యలో నామినేషన్లు వేసింది స్వతంత్ర అభ్యర్థులే. వీటి పరిశీలన శనివారం జరగ్గా, ఉపసంహరణకు ఈనెల 16వరకు గడువుంది.

### నగర పాలక సంస్థల్లో...

రాష్ట్రంలో 16 మున్సిపల్ కార్పొరేషన్లు ఉండగా కోర్టు కేసులు, ఇతర అనివార్య కారణాలతో మూడింటికి, పాలకవర్గ పదవీకాలం పూర్తి కానందున మరోదానికి వెరసి 4చోట్ల ప్రస్తుతం ఎన్నికలు జరగడం లేదు. మిగిలిన 12 మున్సిపల్ కార్పొరేషన్లలోని 671 డివిజన్లకు కలిపి మొత్తం 6,563నామినేషన్లు పడ్డాయి. వైసీపీ నుంచి 2,307 టీడీపీ 1,675, స్వతంత్రులు 1,230, జనసేన 386, బీజేపీ 345, కాంగ్రెస్ 290, సీపీఎం 146, సీపీఐ 88, బీఎస్పీ 33, ఎన్సీపీ 1, గుర్తింపులేని ఇతర రాజకీయ పక్షాల నుంచి 62 నామినేషన్లు దాఖలయ్యాయి. జీవీఎంసీలో 1,361, విజయవాడలో 801, గుంటూరులో 571, కర్నూలులో 614, విజయనగరంలో 413, ఏలూరులో 287, మచిలీపట్నంలో 274, ఒంగోలులో 462, అనంతపురంలో 500, కడపలో 389, చిత్తూరులో 558, తిరుపతిలో 333 చొప్పున నామినేషన్లు వచ్చాయి.

### మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో...

75 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో 2,123 వార్డుల కోసం 12,086 నామినేషన్లు పడ్డాయి. వీటిల్లో వైసీపీ 5,452, టీడీపీ 3,610, స్వతంత్రులు 1,418, బీజేపీ 554, జనసేన 434, కాంగ్రెస్ 168, సీపీఎం 110, సీపీఐ 104, ఎన్సీపీ 87, బీఎస్పీ 27, ఇతర పార్టీల నుంచి 122 దాఖలయ్యాయి.

### వివరణ అడిగితే రాద్ధాంతమా?: బొత్స

విజయనగరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'కోర్టులో కేసు వేస్తే ఎవరినైనా వివరణ అడుగుతుంది. ఇది సహజం. దీనిపై లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారు. చంద్రబాబుకు ఏ కారణమూ దొరకని పక్షంలో ఇటువంటి వాటిపై మాట్లాడతారు' అంటూ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. చిన్న కారణం దొరికితే చాలు చూపించిందే చూపిస్తారంటూ మీడియాపైనా అక్కసు వెళ్లగక్కారు. కోర్టులో కేసు వేస్తే ఎవరికైనా వివరణ కోరుతుందని, డీజీపీకి కూడా అదే జరిగిందని, ఇందులో కొత్తేముందని తిరిగి ప్రశ్నించారు.

## నేడు గ్రామ పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఎన్నికలకు ఆదివారంనాడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 15న మొదటి విడత, 17న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 13,368 గ్రామ పంచాయతీలుంటే.... 120 గ్రామ పంచాయతీల విభజన, విలీన ప్రక్రియపై హైకోర్టు స్టే ఇవ్వడంతో మిగిలిన 13,248 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.



బ్యాలెట్ పోరుకు సన్నద్ధం



## గుర్తులు రివర్స్

**టీడీపీ అభ్యర్థికి ఫ్యాన్, వైసీపీ అభ్యర్థికి సైకిల్**

**తూ**ర్పుగోదావరి జిల్లాపరిషత్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. శనివారంతో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తికావడంతో ఎంపీటీసీ అభ్యర్థులకు గుర్తులు కేటాయించాల్సి ఉంది. దీనినే బ్యాలెట్ పేపర్ అంటారు. రిటర్నింగ్ అధికారి సంతకంతో వచ్చే దీని ఆధారంగా బ్యాలెట్ పత్రాల ప్రింటింగ్ జరుగుతుంది. కానీ తుని మండలం రేఖవానిపాలెం ఎంపీటీసీ సభ్యులకు ఇచ్చే గుర్తుల కేటాయింపులో వైసీపీ అభ్యర్థి డబ్బూరి నాగశివకి సైకిలు, టీడీపీ అభ్యర్థి నడిగట్ల సూర్యనారాయణకు ఫ్యాను గుర్తు కేటాయించారు. ఈ తప్పులతోనే శనివారం రాత్రి రిటర్నింగ్ ఆఫీసర్ సంతకంలో ఫారం9 బ్యాలెట్ పేపర్‌ను జారీచేశారు.

- ఆంధ్రజ్యోతి, కాకినాడ



## ఉపసంహరణ.. రోదన

డిప్యూటీ సీఎం నారాయణస్వామి తమకు ద్రోహం చేశారని.. దీంతో ఆయన సతీమణి పరంజ్యోతిపై టీడీపీ తరపున పోటీ చేయాలనే నామినేషన్ వేశానని చిత్తూరు జిల్లా కార్వేటినగరం జడ్పీటీసీ అభ్యర్థి మృదుల చెప్పారు. మృదులకు టీడీపీ బిఫామ్ ఇచ్చింది. అయితే డిప్యూటీ సీఎం అనుచరులు ఎన్నికను ఏకగ్రీవం చేయించాలని పట్టుదలగా ఉన్నారు. పోటీలో ఉన్న ఇతర పార్టీల వారితో విత్‌డ్రా చేయించారు. తొలుత మృదుల ససేమిరా అన్నప్పటికీ వైసీపీ నేతలు తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. రోదిస్తూనే విత్‌డ్రా ఫామ్‌పై మృదుల సంతకం చేశారు.

- చిత్తూరు కలెక్టరేట్



## నడిరోడ్డుపై నకిలీ నోట్లు

విశాఖ నగరం రైల్వే న్యూకాలనీలోని వైసీపీ కార్యాలయం వద్ద రోడ్డుపై శనివారం రూ.2 వేలు, రూ.200 నోట్లు పడి ఉండటం కలకలం రేపింది. నాయకులు, కార్యకర్తలు కార్యాలయం వద్దకు చేరుకునే సమయానికి ఈ నోట్లు కనిపించాయి. వాటిని పలువురు ఏరుకుని... నకిలీవని తెలియడంతో పడేశారు. ఆ నోట్లు ఎవరివి?, ఎక్కడి నుంచి వచ్చాయి? అనే చర్చ సాగుతోంది. ఎన్నికల వేళ నకిలీ నోట్ల పంపిణీకి ఎవరైనా తెరతీశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- తాటిచెట్లపాలెం



## వైసీపీ కార్యాలయంలో నోట్ల కట్టలు

విశాఖపట్నంలోని ఓ వైసీపీ నేత కార్యాలయంలో అవిశ్రాంతంగా డబ్బులు లెక్కిస్తున్న యంత్రాలివి. ఈ లెక్కల తతంగం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఓ నాయకుడి కార్యాలయంలో డబ్బులెక్కిస్తుండగా ఎవరో వీడియో తీసి.. పోస్టు చేశారు. కార్పొరేటర్లుగా పోటీచేసేవారు.. ఒకటి, రెండు కోట్లు ఖర్చుపెట్టాల్సి ఉంటుందని నేతలు చెప్పడంతో సమర్థులంతా డబ్బును నేతల కార్యాలయాలకు చేర్చారు. ఆ డబ్బును లెక్కించే పనిలో నేతల కార్యాలయ సిబ్బంది ఇలా బిజీగా ఉన్నారు.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

# 'అధికారిక' దాడులు!

## రంగంలోకి పోలీస్, అటవీ, ఎక్సైజ్

**అభ్యర్థికి 'బైండోవర్' బెదిరింపు**

**రాణాకు రావాలంటూ ఒత్తిడి**

**ఎమ్మెల్యే అనగాని రాకతో వెనక్కి**

**మరో అభ్యర్థిపై మద్యం కేసు**

**ఇంకొకరి సామిల్‌లో వరుస సోదాలు**

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

పోలీసులు, ఎక్సైజ్, అటవీ శాఖ! అధికార పార్టీ చేతిలో అన్ని విభాగాలూ అస్త్రాలే! విపక్షం మీదికి అవన్నీ ఆయుధాలే! టీడీపీ అభ్యర్థులను స్థానిక ఎన్నికల బరి నుంచి తప్పించేందుకు, బెదిరించేందుకు నేరుగా ఆయా శాఖల సిబ్బందే రంగంలోకి దిగుతున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల కథనం ప్రకారం...

గుంటూరు జిల్లా నగరం మండలం ధూళిపూడి టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా ఆరుంబాక మల్లేశ్వరి నామినేషన్ దాఖలు చేశారు. శనివారం ఉదయం 7.30 గంటలకే ఒక మహిళా కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఆమె ఇంటి ముందు ప్రత్యక్షమయ్యారు. నామినేషన్ వెనక్కి తీసుకోకుంటే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామంటూ 'పై నుంచి వచ్చిన సందేశం' వినిపించారు. చుట్టు పక్కలవారు గుమిగూడి మల్లేశ్వరి ఏమి తప్పు చేసిందని పోలీస్ సిబ్బందిని ప్రశ్నించారు. "ఎస్‌ఐ వాసు తీసుకురమ్మన్నారు. బైండోవర్ కేసు పెడుతున్నాం" అని పోలీసులు సమాధానం ఇచ్చారు. గతంలో ఏవైనా నేరాలకు పాల్పడి, కేసులున్న పక్షంలో బైండోవర్ చేయడం సహజం. మరి... మల్లేశ్వరిపై ఎందుకు కేసు పెడతారని స్థానికులు నిలదీశారు. "ఆ విషయం మాకు తెలియదు. ఏదైనా ఉంటే ఎస్‌ఐతో మాట్లాడుకోండి" అంటూ పోలీసులు తేల్చిచెప్పారు.



ప్యాపిలి జడ్పీటీసీ కాంగ్రెస్ అభ్యర్థి కేశవులు, కాంగ్రెస్ నంద్యాల లోక్‌సభ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్‌తో చర్చిస్తున్న వైసీపీ జడ్పీ చైర్మన్ అభ్యర్థి ఎర్రబోతుల వెంకటరెడ్డి కుమారుడు ఉదయ భాస్కరరెడ్డి

స్థానిక టీడీపీ నేతలు ఈ విషయాన్ని ఎమ్మెల్యే అనగాని దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి కేసులు లేని మహిళను, పైగా ఎంపీటీసీ అభ్యర్థిని ఠాణాకు ఎలా పిలిపిస్తారని ఆయన డీఎస్పీ, సీఐలను ప్రశ్నించారు. ఆయనే స్వయంగా ధూళిపూడి బయలుదేరారు. అప్పటికి మల్లేశ్వరిని పోలీస్ సిబ్బంది ఇంటి నుంచి బయటికి తీసుకొస్తున్నారు. ఎమ్మెల్యే వస్తున్నారని, పది నిమిషాలు ఆగాలని పోలీసులను స్థానికులు కోరారు. ఎమ్మెల్యే కారు హారన్ వినగానే ముగ్గురు కానిస్టేబుళ్లు మల్లేశ్వరిని వదిలేసి, తమ జీపులో అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయారు. ఎస్‌ఐ వాసు వైసీపీ కార్యకర్త తరహాలో బెదిరిస్తూ... టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే అనగాని మండిపడ్డారు.

### అర్ధరాత్రి అక్రమ మద్యం కేసు

గుంటూరు జిల్లా నాదెండ్ల జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా బండారుపల్లి సత్యనారాయణ బరిలో నిలిచారు. ఆయన స్నేహితుడైన గట్టినేని రమేశ్ కుమారుడు విజయసాయి కారులో 83 మద్యం సీసాలు దొరికాయని... అవి సత్యనారాయణకు సంబంధించినవేనని పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. అర్ధరాత్రి సమయంలో ఆయనను అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. "పోటీ నుంచి విరమించుకోవాల్సిందిగా నాపై ఒత్తిడి తెచ్చారు. నేను వైదొలగక పోవడంతో ఇలా తప్పుడు కేసు పెట్టారు" అని సత్యనారాయణ తెలిపారు. పోలీసులే మద్యం సీసాలు కారులో పెట్టి కేసు నమోదు చేశారని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. పోలీసులపై ప్రైవేటు కేసు వేస్తున్నట్టు చెప్పారు.

### టీడీపీ అభ్యర్థి భర్త సామిల్‌పై దాడులు

శ్రీకాకుళం జిల్లా పొందూరు-4 ఎంపీటీసీ స్థానం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా బరిలో ఉన్న బాడాన హారిక భర్త గిరినాయుడు సామిల్‌పై 'దాడులు' కొనసాగుతున్నాయి. శుక్రవారం ఎక్సైజ్ శాఖ అధికారులు సామిల్లులో తనిఖీ చేసినప్పుడు కొన్ని మద్యం సీసాలు లభించాయి. ఇవి ప్రత్యర్థులే మిల్లులో పడేసి ఎక్సైజ్ శాఖ అధికారులతో దాడులు చేయించారని గిరినాయుడు తెలిపారు. ఇక... శనివారం అటవీ సిబ్బంది రంగంలోకి దిగారు. విశాఖ రేంజ్ ఫారెస్ట్ స్క్వాడ్ డీఎఫ్‌వో పడాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో సామిల్‌లో తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కలపను గుర్తించారు.

మాజీ మంత్రి కాలవను తరలిస్తున్న పోలీసులు

## మాజీ మంత్రి కాలవపై దాడి

రాయదుర్గం, మార్చి 14: మాజీ మంత్రి, టీడీపీ నేత కాలవ శ్రీనివాసులుపై వైసీపీ కార్యకర్తలు, నాయకులు శనివారం దాడికి పాల్పడ్డారు. అనంతపురం జిల్లా రాయదుర్గం మున్సిపల్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లోనే ఈ ఘటన జరిగింది. శనివారం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన జరిగింది. ఈ సందర్భంగా ముగ్గురు సంతానం ఉన్నారనే కారణంతో 7వ వార్డు టీడీపీ అభ్యర్థి టంకశాల హనుమంతు, తల్లి ఆస్తిని పేర్కొనలేదనే కారణంతో 14వ వార్డు మోపూరి అశోక్‌ల నామినేషన్లను ఆర్వో తిరస్కరించారు. ఈ విషయమై చర్చించేందుకు కాలవ శ్రీనివాసులు కార్యాలయానికి వచ్చారు. ఆయనతోపాటు అభ్యర్థులు, న్యాయవాదులు రిటర్నింగ్ అధికారితో చర్చిస్తుండగా.. వైసీపీ కార్యకర్తలు గుంపుగా అక్కడికి చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈలోగా ప్రభుత్వవిప్ కాపు రామచంద్రారెడ్డి అక్కడికి రావడంతో.. ఇదే అదనుగా వైసీపీ శ్రేణులు పోలీసులను తోసేసి ఆర్వో కార్యాలయంలోకి జొరబడ్డారు. చాంబర్ తాళాలను పగులగొట్టి రిటర్నింగ్ అధికారి చాంబర్‌లోకి ప్రవేశించి కాలవ శ్రీనివాసులుపై దాడి చేశారు. దాడి సమయంలో కాపు రామచంద్రారెడ్డి బయటకువచ్చి దూరంగా నిలబడిపోయారు. వైసీపీ శ్రేణులను కట్టడి చేసేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. వైసీపీ కార్యకర్తల దాడితో కాలవ తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. ఆయనను పోలీసులు పట్టణ సరిహద్దులకు తీసుకెళ్లి.. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పంపేశారు.



కన్నీటిపర్యంతమైన వైసీపీ నాయకురాలు ఝాన్సీ

## సొంత పార్టీ వారికీ బెదిరింపులు

శ్రీకాకుళం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల బెదిరింపులు సొంత పార్టీ నేతలకూ తప్పడం లేదు. శ్రీకాకుళం జిల్లా భామిని మండలం సింగిడి గ్రామానికి చెందిన జయకృష్ణ కొన్నేళ్లుగా వైసీపీలో పనిచేస్తున్నారు. భామిని జడ్పీటీసీ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వు కావడంతో జయకృష్ణ భార్య ఝాన్సీకి టికెట్ ఇస్తామని గతంలో అనేకసార్లు ప్రకటించారు. దీంతో ఝాన్సీ ఎంతో ఉత్సాహంగా నామినేషన్ వేశారు. బీఫారం ఇచ్చే సమయానికి పార్టీ నాయకులు ఆమెకు మొండిచేయి చూపారు. బొడ్డేపల్లి చిన్నమ్మిని పార్టీ అభ్యర్థిగా ప్రకటించి బీఫారం ఇవ్వడంతో ఝాన్సీ కుటుంబం కన్నీరు మున్నీరైంది. నామినేషన్ ఉపసంహరించుకునేది లేదని తేల్చిచెప్పడంతో వైసీపీ నాయకులు ఆమెను బెదిరింపులకు గురిచేశారు. తీవ్ర ఒత్తిడి తేవడంతో ఆమె భయపడి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. తనకు జరిగిన అన్యాయం మీడియాకు చెప్పి బోరున విలపించారు.

## నన్ను కిడ్నాప్ చేయలేదు.. భయపడి దాక్కున్నా!

జనసేన ఎంపీటీసీ అభ్యర్థి లక్ష్మి

భీమవరం రూరల్, మార్చి 14: 'నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు. నామినేషన్ ఉపసంహరించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని వైసీపీ నాయకులు బెదిరించారు. దీంతో భయపడి మరో ప్రాంతానికి వెళ్లి దాక్కున్నా' అని పశ్చిమగోదావరి జిల్లా వెంప జనసేన ఎంపీటీసీ అభ్యర్థి గెడ్డం లక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం బయట శనివారం జనసేన నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ వేసినప్పటి నుంచి వెంపలో పెద్ద నాయకులు తనను భయపెట్టారని చెప్పారు.

## టికెట్ దక్కలేదని ఆత్మహత్యాయత్నం

మహారాణిపేట (విశాఖపట్నం), మార్చి 14: కార్పొరేటర్‌గా పోటీ చేసేందుకు టికెట్ దక్కలేదనే మనస్తాపంతో వైసీపీ నాయకుడు పీతల శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానిక 29 వార్డు వైసీపీ అధ్యక్షునిగా ఉన్న శ్రీనివాస్ (వాసు) ఏడేళ్లుగా పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో టికెట్ తనకే దక్కుతుందని ఆశించారు. చివరి క్షణం వరకు ఆయన పేరే వినిపించింది. అయితే తనను కాదని.. కొత్తగా పార్టీలో చేరిన వ్యక్తికి టికెట్ కేటాయించడంతో శ్రీనివాస్ తీవ్ర మనస్తాపానికి గురయి, నిద్రమాత్రలు మింగారు.

# వదంతులు నమ్మొద్దు

▸▸ **'స్థానిక హింస'లో దుష్ప్రచారమే అధికం**

▸▸ **ఆధారాలతో ఫిర్యాదు చేయండి: డీజీపీ**

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు సంబంధించిన వదంతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని డీజీపీ గౌతమ్ సవాంగ్ ప్రజలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసే పరిస్థితి లేదనడం దుష్ప్రచారమే తప్ప వాస్తవం కాదన్నారు. రాజకీయ పార్టీల నేతలు ఎవరైనా పోలీసులపై ఆరోపణలు చేయకుండా కచ్చితమైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ఏ పార్టీ వారైనా బాధ్యులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని భరోసా ఇచ్చారు. మంగళగిరిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు 11వేల బైండోవర్ కేసులు నమోదు చేసి లక్షమందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లకు సంబంధించి 43చోట్ల గొడవలు జరిగినట్లు చెప్పారు. పట్టణాల్లో 14ఘటనలు నమోదయ్యాయన్నారు. మొత్తం మీద ఎనిమిది హత్యాయత్నం కేసులు నమోదైనట్లు వెల్లడించారు. మాచర్లతోపాటు మరిన్ని ప్రాంతాల్లో హింస జరుగున్నట్లు బయట జరుగుతోన్న ప్రచారం మరీ ఎక్కువగా ఉందన్నారు. మాచర్ల ఘటనలో పోలీసులే ముందుగా స్పందించి సుమోటో కేసు నమోదు చేశారని చెప్పారు. అయితే అక్కడికి వెళ్లాల్సిన అవసరం విజయవాడ టీడీపీ నేతలకు ఎందుకొచ్చిందో విచారణ జరుపుతున్నామన్నారు. ఎన్నికల్లో ఎక్కువ ప్రభావం చూపే మద్యం, డబ్బు పంపిణీకి బ్రేకులేసినట్లు డీజీపీ చెప్పారు. ఎక్సైజ్ చట్టం కింద 1605



కేసులు నమోదు చేసి 1562 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. 7,762 లీటర్ల నాటుసారా, 5400 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కాగా, ఎన్నికలు జరుగుతోన్న తరుణంలో సమాజంలో అశాంతి రేకెత్తించేందుకు సోషల్ మీడియా ద్వారా హద్దులు దాటితే ఎవరైనా అగచాట్ల పాలు కావాల్సిందేనని డీజీపీ హెచ్చరించారు. తప్పుడు సమాచారాన్ని ఎక్కువగా వ్యాపింపజేస్తున్నారని, మాటలు అదుపుతప్పుతున్నాయని అన్నారు. అటువంటి వాటిపై సైబర్ నేరాల కింద కేసులు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. మార్ఫింగ్ చేసిన ఫోటోలు ఏవైనా షేర్ చేసినా సరే బాధ్యులు తప్పించుకోలేరని హెచ్చరించారు.

## ఇళ్ల స్థలాల పంపిణీకి అనుమతి లేదు

▸▸ **వలంటీర్లు ప్రచారం చేస్తే కోడ్ ఉల్లంఘనే!: ఎస్ఈసీ**



అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీకి అనుమతి లేదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్ తెలిపారు. హైకోర్టులో ఇళ్ల స్థలాల పంపిణీని ఆపడానికి కొన్ని కేసులు దాఖలయ్యాయన్నారు. ఈ అంశాలన్నింటినీ గమనించి మోడల్ ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశామన్నారు. స్థలాల పంపిణీకి సంబంధించి టెండర్లు పిలవడం, టోకెన్ల పంపిణీ తదితర కార్యక్రమాలన్నీ నిలిపివేశామని చెప్పారు. కాగా, గ్రామ, వార్డు వలంటీర్లు రాజకీయ పార్టీల తరపున ప్రచారంలో పాల్గొనడాన్ని ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు ప్రభుత్వంలో భాగస్వామ్యమైనందున తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని అనుసరించాలన్నారు. వలంటీర్లు రాజకీయ పార్టీలకు సహకరిస్తున్నారని వివిధ పార్టీలు, ప్రజల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వలంటీర్లు రాజకీయ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఐటీ స్థాయి పోలీసు అధికారిని నియమించామని రమేశ్‌కుమార్ తెలిపారు. ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఐజీ కె.సత్యనారాయణను నియమించామన్నారు. ఆయన శుక్రవారం రాత్రి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు రిపోర్ట్ చేశారని తెలిపారు.



## వైసీపీ సమావేశంలో వలంటీర్లు

తాళ్లరేవు, మార్చి 14: తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవులోని ఒక ప్రైవేట్ పాఠశాలలో వైసీపీ కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ పాల్గొని ఎన్నికల ప్రచారంపై నాయకులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో వైసీపీ కార్యకర్తలతోపాటు వలంటీర్లు పాల్గొన్నారు.

### కోడ్ ఉల్లంఘన.. ఇద్దరు ఉద్యోగుల తొలగింపు

జంగారెడ్డిగూడెం, మార్చి 14 : ఎన్నికల కోడ్ ఉండగా గ్రామసభ నిర్వహించిన గ్రామ రెవెన్యూ అధికారి దోనేపల్లి వెంకటరాజు, పంచాయతీ కార్యదర్శిని చెంచమ్మలను విధుల నుంచి తప్పిస్తూ పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరావు ఆదేశాలను జారీ చేశారు.

# స్థానిక పోరు ఆపాల్సిందే

▸▸ **కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో జరపాలి**

▸▸ **అరాచకాలపై అమిత్ షాకు చెప్పాం : కన్నా**

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'ఒకప్పుడు టెండర్లు దక్కించుకోవడానికి ఫ్యాక్షనిస్టులు సాటి కాంట్రాక్టర్లను బెదిరించేవారు. టెండర్ ఫారాలు లాక్కోవడం, విత్ డ్రా చేయించడం చూశాం. అదే ఫ్యాక్షనిస్టు సీఎం అయితే ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు బెదిరింపులు, నామినేషన్ పత్రాలు లాక్కోవడం, దాడులు చేయడం, మొత్తం మీద ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం చూస్తున్నాం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ మండిపడ్డారు. 'స్థానిక సంస్థల ఎన్నికలు-రాజకీయ పార్టీల పాత్ర' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ విజయవాడలోని ఒక హోటల్లో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించింది. ఈ సందర్భంగా విలేకరుల ప్రశ్నలకు కన్నా సమాధానం చెప్పారు. "నవరత్నాల పేరుతో ప్రజలకు చాక్లెట్లు ఇచ్చి జగన్ నెక్లెస్ ఎత్తుకెళ్తున్నారు. భారీ మెజారిటీతో గెలిచినా కేవలం తొమ్మిది నెలల్లోనే భ్రష్టు పట్టిన వైసీపీ ప్రభుత్వం ప్రజాకోర్టులో నిలబడలేక ఎన్నికల్లో హింసకు పాల్పడుతోంది. ఈ ఎన్నికలను ఆపాల్సిందే. పోలీసులు కొన్నిచోట్ల చేతులు ఎత్తేస్తే, మరిన్ని చోట్ల వాళ్లే రంగంలోకి దిగి ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను బెదిరిస్తున్నారు. ఈ అక్రమాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తే ఒక ఎస్‌ఐపై చర్యలు తీసుకోలేని దుస్థితిలో ఉంది. రాష్ట్రంలో ఈసీ, పోలీసు వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. చరిత్రలో లేని హింస స్థానిక సంస్థల ఎన్నికల్లో చూస్తున్నాం. వీటిని వెంటనే రద్దుచేసి కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో కేంద్ర పారామిలటరీ బలగాల రక్షణలో ఎన్నికలు నిర్వహించాలి. దీనిపై ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశాం. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీరుపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం" అని కన్నా తెలిపారు. కాగా, అధికారం చేపట్టిన తొమ్మిది నెలలకే వైసీపీ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఏలూరులో విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం కళ్లు, చెవులు మూసుకుందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు విశాఖలో ఆరోపించారు. అధికార పార్టీ నేతలు రౌడీలను ముందుపెట్టి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కర్నూలులో ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బే కొలమానంగా వైసీపీ అభ్యర్థులను రంగంలోకి దించుతోందని, ఒక్కో అభ్యర్థి కోటి నుంచి రెండు కోట్ల రూపాయలు చూపించాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేయడంతో టిక్కెట్లు రాని వారంతా బీజేపీలోకి వస్తున్నారని ఎమ్మెల్సీ మాధవ్ విశాఖలో అన్నారు.





### నా భూమినే కబ్జా చేశారు!

రాజధాని పేరుతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో జగన్ అండ్ గ్యాంగ్ చేస్తున్న అరాచకాలతో అక్కడి ప్రజలు వణికిపోతున్నారని కన్నా ఆరోపించారు. ఆశ్చర్యకరంగా విశాఖలోని కాపులుప్పాడలో తన స్థలాన్నే జగన్ బంధువులు కబ్జా చేశారని, అక్కడికి తమవారిని పంపితే 'కన్నా గారిదని తెలీదు' అంటూ సమాధానం ఇచ్చారని అన్నారు. అంతకన్నా ఆశ్చర్యకరంగా ఒక ఐపీఎస్ అధికారి స్థలాన్నీ ఆ పక్కనే కబ్జా చేశారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.


కోహ్లీ

## కరోనాను ధైర్యంగా ఎదుర్కొందాం

### ప్రజలకు స్టార్ల సందేశం

**న్యూఢిల్లీ:** అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకొని కరోనాకు దూరంగా ఉందామని టీమిండియా కెప్టెన్ కోహ్లీ పిలుపునిచ్చాడు. అందరం ధైర్యంగా నిలిచి ఈ మహమ్మారిపై పోరాడదామని అన్నాడు. 'వ్యాధి నివారణకన్నా నిరోధమే ఉత్తమం. కొన్ని ముందస్తు జాగ్రత్తలు పాటిద్దాం. కోవిడ్-19 దరిచేరకుండా చూసుకుందాం. అంతా ధైర్యంగా నిలిచి ఈ మహమ్మారిపై యుద్ధం చేద్దాం' అని కోహ్లీ ట్వీట్ చేశాడు.

**జాగ్రత్తగా ఉండండి: వీవీఎస్**

తగిన జాగ్రత్తలతో కరోనాను నివారిద్దామని మాజీ బ్యాట్స్‌మన్ వీవీఎస్ లక్ష్మణ్ అన్నాడు. 'ముందస్తు జాగ్రత్తలు తీసుకొని బాధ్యతాయుతంగా వ్యవహరిద్దాం. కరోనా లక్షణాలు కన్పిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోండి. ఒకవేళ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలితే తక్షణమే స్వీయ నిర్బంధంలోకి వెళ్లండి. తద్వారా ఇతరులకు వ్యాధి సోకకుండా కాపాడిన వారవుతారు. మనమంతా కలిసికట్టుగా పోరాడి కొవిడ్-19ను పారదోలదాం' అని లక్ష్మణ్ ట్వీట్ చేశాడు.


రొనాల్డో

**అప్రమత్తంగా ఉందాం..**

**స్పెయిన్:** విశ్వవ్యాప్తంగా కరోనా మహమ్మారి భయపెడుతున్న తరుణంలో సాకర్ కింగ్ క్రిస్టియానో రొనాల్డో సోషల్ మీడియా ద్వారా అందరికీ ఓ విన్నపం చేశాడు. ఈ వైరస్ బారి నుంచి ప్రజలంతా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో రొనాల్డో భావోద్వేగపూరిత పోస్ట్ చేశాడు. 'ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ, స్థానిక ప్రభుత్వాలు సూచించిన విషయాలను మనమంతా కచ్చితంగా పాటించాలి. ఈ మహమ్మారి కారణంగా ఆప్తులను కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ వైరస్ బారిన పడ్డ నా సహచర ఆటగాడు డేనియల్ రుగానిలాతో మిగతా వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా' అని రొనాల్డో తన పోస్ట్‌లో పేర్కొన్నాడు.

# మినీ ఐపీఎల్ ఆడిద్దామా!

**ప్రత్యామ్నాయాలపై చర్చ | ఫ్రాంచైజీలతో పాలకమండలి భేటీ**

**ముంబై:** కరోనా ధాటికి ఐపీఎల్-13వ సీజన్ షెడ్యూల్ ప్రకారం పూర్తి స్థాయిలో నిర్వహించే వీలు లేకుండా పోయింది. దీంతో మ్యాచ్‌లను కుదించి మినీ ఐపీఎల్ మాదిరి లీగ్‌ను జరిపితే ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. శనివారం ఎనిమిది ఫ్రాంచైజీల యజమానులతో ఐపీఎల్ పాలకమండలి సమావేశం జరిగింది. దీంట్లో బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, కార్యదర్శి జై షా కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా టోర్నీ నిర్వహణకు ఏడు అంశాలపై చర్చ జరిగినట్టు సమాచారం. ఈనెల 29 నుంచి ఏప్రిల్ 15 వరకు ఈ లీగ్‌ను వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుత స్థితిని బట్టి చూస్తే ఆ తర్వాతైనా వీలవుతుందా? అనే విషయం చెప్పలేమని పంజాబ్ కింగ్స్ లెవెన్ సహ యజమాని నెస్ వాడియా చెప్పాడు. 'ఐపీఎల్ ఎప్పుడు ప్రారంభమవుతుందని అడిగితే ఇప్పుడైతే ఎవరూ చెప్పలేరు. రెండు, మూడు వారాల తర్వాతే పరిస్థితిని సమీక్షించగలం. అప్పటివరకు ఈ వైరస్ తీవ్రత తగ్గాలని ఆశిద్దాం' అని నెస్ వాడియా అన్నాడు. మరోవైపు బీసీసీఐ, ఫ్రాంచైజీలతో పాటు స్టార్ స్పోర్ట్స్ కూడా ఆర్థిక నష్టంపై ఆందోళన చెందడం లేదని స్పష్టం చేశాడు. ప్రస్తుతానికి ప్రజల భద్రతకే పెద్దపీట వేశామని గుర్తు చేశాడు. ఏప్రిల్ 15 తర్వాతైనా ఐపీఎల్ జరిగితే మంచిదేనని.. లేకుంటే చేసేదేమీ లేదన్నాడు.


గంగూలీ | జై షా

**రెండు గ్రూపులుగా మార్చి..**

ఫ్రాంచైజీలతో జరిగిన సమావేశంలో ఆరు నుంచి ఏడు ప్రత్యామ్నాయాలపై చర్చ జరిగినట్టు బోర్డు అధికారి ఒకరు తెలిపారు. ఇందులో ఐపీఎల్‌ను కుదించడం కూడా ఒకటని అన్నారు. 'రెండోది.. ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించడం. టాప్-4 జట్లు ప్లేఆఫ్స్‌కు చేరుకుంటాయి. ఇక మూడోది.. డబుల్ హెడర్ మ్యాచ్(ఒకేరోజు రెండు మ్యాచ్‌లు)లను పెంచడం. అన్ని మ్యాచ్‌లను రెండు, మూడు స్టేడియాలకే పరిమితం చేస్తే ఆటగాళ్లు, సిబ్బంది, టీవీ క్రూ ప్రయాణ భారాన్ని తగ్గించడం నాలుగోది. తక్కువ కాల వ్యవధిలోనే ఖాళీ స్టేడియాల్లో 60 మ్యాచ్‌లను ఆడించడం మరో పద్ధతి. దీని ద్వారా ఆర్థిక నష్టాన్ని కూడా అరికట్టవచ్చు. విదేశాల్లో ఐపీఎల్‌ను నిర్వహించడంపై చర్చ జరగలేదు' అని ఆ అధికారి వివరించారు.

**'మరోసారి సమావేశమవుతాం'**

లీగ్‌ను నిర్వహించే విషయమై మరోసారి సమావేశమవుతామని ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ వెల్లడించాడు. 'పరిస్థితులను సమీక్షిస్తున్నామని మాకు చెప్పడమే ఈరోజు భేటీలో ప్రధాన ఉద్దేశం. అంతా మెరుగైనప్పుడు మరోసారి సమావేశమై టోర్నీ ఎప్పుడు జరపాలనేది చర్చిస్తాం. అంతవరకు అందరి భద్రతే మాకు ముఖ్యం' అని పార్థ్ జిందాల్ స్పష్టం చేశాడు. ఇక ఎక్కువ డబుల్ హెడర్ మ్యాచ్‌లను ఆడించాలనే విషయంపై మాట్లాడలేదని అన్నాడు.

**ఐపీఎల్ అంటేనే కాసుల వర్షం కురిపించే క్రికెట్ పండగ.. ఆదాయంలో ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ లీగ్‌లతోనే పోటీ పడుతుంది. ఇప్పుడు కొవిడ్-19 పంజాకు ఈ లీగ్ విలవిల్లాడుతోంది. ప్రస్తుతానికి వాయిదా వేసినా.. ఆ తర్వాత కూడా టోర్నీ జరగపోతే పరిస్థితి ఏమిటనే ఆందోళన నిర్వాహకులను వెంటాడుతోంది. అదే జరిగితే ఐపీఎల్ స్టేక్‌హోల్డర్లు, ఫ్రాంచైజీలు, స్పాన్సర్లు తదితరులకు నష్టం వేల కోట్లలో ఉండబోతోంది.**



# రద్దయితే నష్టం రూ.10వేల కోట్లు?

**కోల్‌కతా:** కరోనా ప్రభావంతో క్రికెట్ కార్యకలాపాలు ఆగిపోవడమే కాదు.. ఐపీఎల్‌తో ముడిపడిన సంస్థల ఆర్థిక మూలాలకు కూడా గట్టిగానే దెబ్బ తగలనుంది. అందుకే ఖాళీ స్టేడియాల్లోనైనా మ్యాచ్‌లు జరగాలని జట్ల యజమానులు కోరుకుంటున్నారు. ఎందుకంటే ఉన్నపళంగా లీగ్ రద్దయితే స్పాన్సర్‌షిప్స్, మీడియా రైట్స్, ఫ్రాంచైజీల ఆదాయం, ఆటగాళ్ల ఫీజుల రూపంలో ఐపీఎల్ నష్టం రూ.10వేల కోట్లుగా ఉంటుందని అంచనా. అందుకే విదేశీ ఆటగాళ్లు రాకపోయినా కూడా లీగ్ జరిగితేనే గౌరవంగా ఉంటుందని ఓ ఫ్రాంచైజీ అధికారి అభిప్రాయపడ్డాడు. 'లీగ్‌ను నిర్వహించలేకపోతే ప్రతీ జట్టు కూడా బీసీసీఐ, బ్రాడ్‌కాస్టర్, స్పాన్సర్ల నుంచి వచ్చే రూ. వంద కోట్లకు పైగా రాబడిని కోల్పోతుంది' అని బీసీసీఐ అధికారి వివరించాడు.

**జరగడం అనుమానమే**

ఐపీఎల్‌ను కుదించడంపై ఫ్రాంచైజీల యజమానులతో బీసీసీఐ సమావేశం ఎలాగున్నా.. ఏప్రిల్‌లో జరగడం కూడా సందేహమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కరోనాను ప్రపంచ మహమ్మారిగా ప్రకటించిన నేపథ్యంలో ఇప్పట్లో సాధారణ పరిస్థితి నెలకొనడం అసాధ్యంగా కనిపిస్తోంది. 'ఐపీఎల్ జరిపేందుకు ఏప్రిల్ 21 నుంచి మే 31 వరకు ఆరు వారాల విండో ఉంటుంది. ఒకవేళ అంతా మెరుగై ఏప్రిల్ 20న ఆరంభించాలనుకున్నా.. ఆ నిర్ణయం 10 లోపే తీసుకోవాలి. ఎక్కువ డబుల్ హెడర్ మ్యాచ్‌లను నిర్వహిస్తే ఆరు వారాల సమయం సరిపోతుంది. కానీ ఏప్రిల్ తొలి వారంలో కరోనా ప్రభావం తీవ్రతపై ఇదంతా ఆధారపడి ఉంటుంది. లేకపోతే వచ్చే ఏడాదికి వాయిదా పడినట్టే' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.


ఫ్రాంచైజీల సమావేశానికి హాజరైన షారుఖ్

**పదేపదే శానిటైజ్ చేసుకున్నాం**

సమావేశంలో అన్ని జట్ల యజమానులను కలవడం సంతోషంగా ఉంది. ఇప్పుడు లీగ్‌ను జరపడం కన్నా అందరి భద్రత ముఖ్యమని మేం అభిప్రాయపడ్డాం. కేంద్రం సూచించిన మార్గదర్శకాలు అంతా పాటించాల్సిందే. మేమైతే పదేపదే శానిటైజ్ చేసుకున్నాం.

**కోల్‌కతా జట్టు సహ యజమాని షారుఖ్ ఖాన్**

**బీసీసీఐకి రూ.2000 కోట్లు**

ఐపీఎల్ రద్దయితే బీసీసీఐ రూ. 2 వేల కోట్ల రెవెన్యూను కోల్పోతుంది. ప్రసారకర్త స్టార్ స్పోర్ట్స్ నుంచి ప్రతీ ఏడాది బోర్డు రూ.3 వేల కోట్లు పొందుతుంది. దీన్ని ఫ్రాంచైజీలతో 50:50గా పంచుకుంటుంది. టైటిల్ స్పాన్సరర్ వీవో నుంచి ఏడాదికి రూ.500 కోట్లు అందుతుంది. ఇక ఆయా ఫ్రాంచైజీలు తమకున్న స్పాన్సరర్ల సంఖ్యను బట్టి 35 నుంచి 75 కోట్ల రూపాయల మేర నష్టపోతాయి. స్టేడియం గేట్ మనీ నష్టం ఆయా జట్లకు 20 నుంచి 45 కోట్ల వరకు ఉంటుంది.

**బ్రాడ్‌కాస్టర్‌కు పెద్ద దెబ్బే..**

లీగ్ రద్దు ప్రభావం ముఖ్యంగా ప్రసారకర్త స్టార్ గ్రూప్‌పై అధికంగా పడుతుంది. భారత క్రికెట్ మ్యాచ్‌లు, ఐపీఎల్ కోసం ఐదేళ్ల కాలానికి ఈ సంస్థ ఏకంగా రూ.16 వేల కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ద్వారా ఏటా 20శాతం రాబడిని ఆశిస్తోంది. ఇప్పటికే దక్షిణాఫ్రికాతో సిరీస్ రద్దయింది. ఇక లీగ్ కూడా అదే బాటన పడితే స్టార్ గ్రూప్ రూ. 3200 కోట్లను నష్టపోవాల్సిందే.

**హోటళ్ల రాబడిపైనా..**

ఐపీఎల్‌పై స్టార్ హోటళ్లు, విమానయానంతో పాటు ఇతర సిబ్బంది కూడా ఆధారపడి ఉన్నారు. అన్ని జట్లు తమ ఆటగాళ్ల రవాణా, వసతి కోసం రూ.5 కోట్లు ఖర్చు చేస్తుంది. అలాగే అన్ని జట్లు కలిపి కనీసం 600 మందిని వివిధ పనుల కోసం నియమించుకుంటాయి. దీనికి రూ.10 కోట్ల వరకు ఖర్చు చేస్తాయి. ఇప్పుడు వారి ఆదాయం కూడా ప్రమాదంలో పడినట్టే.

## లీగ్ జరగొచ్చు: గంగూలీ

**ముంబై:** పరిస్థితులు చక్కబడితే ఏప్రిల్ 15 తర్వాత ఐపీఎల్ జరిగే అవకాశాలున్నాయని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. కరోనా వైరస్ తీవ్రత నేపథ్యంలో..ఈనెల 29న ప్రారంభం కావాల్సిన 13వ సీజన్ ఐపీఎల్‌ను వచ్చేనెల 15వరకు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. శనివారం ఇక్కడ జరిగిన ఐపీఎల్ పాలక మండలి సమావేశం అనంతరం సౌరవ్ విలేకరులతో మాట్లాడాడు. మ్యాచ్‌లను కుదించి ఐపీఎల్‌ను నిర్వహించే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు 'అలా జరిగే అవకాశాలు లేకపోలేదు. ఏప్రిల్ 15 అంటే.. నిర్ణీత సమయానికి ఐపీఎల్ మొదలై ఉంటే అప్పటికి పదిహేను రోజులు పూర్తవుతుంది. పరిస్థితి కనుక మెరుగైతే టోర్నీని కుదించి నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తాం. అయితే ఎన్ని మ్యాచ్‌లు ఉంటాయన్నది ప్రస్తుతం చెప్పలేను' అని గంగూలీ బదులిచ్చాడు.

## మంజ్రేకర్‌పై వేటు

**వ్యాఖ్యాతల ప్యానెల్ నుంచి తొలగింపు**



**న్యూఢిల్లీ:** భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరిగిన తొలి వన్డేకు వ్యాఖ్యాతల్లో సంజయ్ మంజ్రేకర్ లేకపోవడం పలు అనుమానాలు రేకెత్తించింది. అయితే అతడిని ఆ ప్యానెల్ నుంచి బీసీసీఐ తప్పించినట్టు..బోర్డు వర్గాలు వెల్లడించాయి. మంజ్రేకర్‌పై వేటుకు కారణాలు కచ్చితంగా తెలియకున్నా.. అతడి శైలిపై బీసీసీఐ సంతృప్తిగా లేదని సమాచారం. 54 ఏళ్ల మంజ్రేకర్ తన వ్యాఖ్యలతో పలుసార్లు వివాదాస్పదుడయ్యాడు. గత ఏడాది వన్డే వరల్డ్‌కప్ సందర్భంగా ఆల్‌రౌండర్ జడేజాను 'అప్పుడప్పుడు జట్టులోకి వచ్చిపోయే ఆటగాడి'గా వర్ణించి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఆ వ్యాఖ్యలకు జడేజా కూడా ఘాటుగా సమాధానమిచ్చాడు. దాంతో జడేజా గురించి తాను తప్పుగా అంచనా వేశానని ఆ తర్వాత మంజ్రేకర్ అంగీకరించాడు. ఇకపోతే.. అత్యున్నత స్థాయి క్రికెట్ ఆడని హర్షా భోగ్లే వ్యాఖ్యానానికి విశ్వసనీయత ఏపాటిదని.. బంగ్లాదేశ్‌తో గులాబీ టెస్ట్ సందర్భంగా కామెంట్రీ బాక్స్ నుంచి మంజ్రేకర్ అనడం తీవ్ర వివాదం రేపింది.

## ఆసీస్-కివీస్ సిరీస్ రద్దు

**మెల్‌బోర్న్:** 'కొవిడ్-19' ప్రభావంతో మరో సిరీస్ రద్దయింది. ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మధ్య వన్డే సిరీస్‌లోని మిగిలిన రెండు మ్యాచ్‌లను రద్దు చేస్తున్నట్టు శనివారం ప్రకటించారు. అభిమానులు లేకుండా నిర్వహించిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా గెలుపొందిన సంగతి తెలిసిందే. కరోనా నేపథ్యంలో న్యూజిలాండ్‌లో ఆదివారం రాత్రినుంచి ఆంక్షలు విధిస్తున్న కారణంగా విలియమ్సన్ సేన తక్షణమే స్వదేశానికి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఆస్ట్రేలియా నుంచి న్యూజిలాండ్‌లో ప్రవేశించేవారు 14రోజులు స్వీయ నిర్బంధంలో ఉండడం తప్పనిసరి చేస్తూ న్యూజిలాండ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో సిరీస్‌ను రద్దు చేస్తున్నట్టు క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది.

**లాకీ ఫెర్గూసన్‌కు నెగిటివ్**



కివీస్ ఫాస్ట్ బౌలర్ లాకీ ఫెర్గూసన్‌కు 'కొవిడ్-19' నెగిటివ్‌గా వచ్చింది. గొంతు నొప్పిగా ఉందని చెప్పడంతో ఆస్ట్రేలియాతో శుక్రవారం సిడ్నీలో జరిగిన తొలి వన్డే అనంతరం ఫెర్గూసన్‌ను ఐసోలేషన్‌కు తరలించారు. అతడికి కరోనా పరీక్షలు నిర్వహించగా నెగిటివ్‌గా రావడంతో న్యూజిలాండ్ జట్టు ఊపిరిపీల్చుకుంది.



### జీత్‌చంద్రకు ఒమన్ టైటిల్

**మస్కట్:** భారత యువ ప్యాడ్లర్ జీత్‌చంద్ర ఓమన్ టేబుల్ టెన్నిస్ ఓపెన్‌లో అండర్-21 పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. శనివారం జరిగిన ఫైనల్లో జీత్‌చంద్ర 11-6, 11-7, 13-11తో భారత్‌కే చెందిన ప్రపంచ రెండో ర్యాంకర్ మానవ్ టక్కర్‌కు షాకిచ్చి టైటిల్ సాధించాడు.

**బీసీసీఐ దేశవాళీ మ్యాచ్‌లన్నీ నిలిపివేత**

**ముంబై:** కరోనా మహమ్మారితో ప్రస్తుతానికి దేశవాళీ మ్యాచ్‌లన్నింటినీ తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు బీసీసీఐ ప్రకటించింది. ఇందులో ఇరానీ కప్, హజారే ట్రోఫీ తదితర టోర్నీలున్నాయి.

**ఏప్రిల్ 20 దాకా టెన్నిస్ ఈవెంట్లు వాయిదా**

**లండన్:** కొవిడ్-19 మహమ్మారి కారణంగా టెన్నిస్ ఈవెంట్లన్నీ వాయిదాపడ్డాయి. ప్రస్తుతం జరగాల్సిన అన్ని టోర్నీలను వచ్చేనెల 20 దాకా వాయిదా వేస్తున్నట్టు అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) శనివారం ప్రకటించింది. పురుషుల, మహిళల ఐటీఎఫ్ వరల్డ్ టూర్, వరల్డ్ జూనియర్ టూర్, యూఎన్ఐక్యూఎల్‌ఓ వీల్‌చెయిర్ టెన్నిస్ టూర్, ఐటీఎఫ్ బీచ్ టెన్నిస్ వరల్డ్ టూర్, ఐటీఎఫ్ సీనియర్స్ టూర్ ఈవెంట్లు సస్పెండైన వాటిలో ఉన్నాయి.

## ఏటీకే తీన్‌మార్

- **మూడోసారి ఐఎస్ఎల్ టైటిల్ కైవసం**
- **ఫైనల్లో చెన్నయిన్ ఎఫ్‌సీపై విజయం**



**మార్గావో:** కోల్‌కతా సాకర్ జట్టు అట్లెటికో కోల్‌కతా (ఏటీకే) అదరగొట్టింది. రికార్డు స్థాయిలో మూడోసారి ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో ఏటీకే 3-1 గోల్స్ తేడాతో చిరకాల ప్రత్యర్థి చెన్నయిన్ ఎఫ్‌సీను చిత్తు చేసి ట్రోఫీ అందుకుంది. కరోనా నేపథ్యంలో ప్రేక్షకులు లేకుండానే జరిగిన ఈ టైటిల్ ఫైట్‌లో ఏటీకే తరపున జేవియర్ హెర్నాండెజ్ (10వ నిమిషం, 90+4వ) రెండు గోల్స్, ఎడు గార్సియా (48వ) ఓ గోల్ చేశారు. చెన్నయిన్ జట్టులో ఏకైక గోల్‌ను నెర్జుస్ వాల్స్‌కిస్ (69వ) సాధించాడు.

### ఒలింపిక్స్ నిర్వహిస్తాం: జపాన్ ప్రధాని



**టోక్యో:** ఓవైపు కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తున్నా.. ఒలింపిక్స్‌ను నిర్వహిస్తామనే జపాన్ అంటోంది. ఆ మేరకు ఏర్పాట్లు కూడా చేస్తున్నామని ఆ దేశ ప్రధాని షింజో అబే శనివారం చెప్పారు. 'కరోనా వైరస్‌ను అధిగమిస్తాం. ఎలాంటి సమస్య లేకుండా షెడ్యూల్ ప్రకారం ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిస్తాం' అని టోక్యోలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో అబే ప్రకటించారు. ఒలింపిక్స్ వాయిదా లేదా రద్దు గురించి తాము ఆలోచించడం లేదని ఆయన అన్నారు.







Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.